సాహిత్య

# ప్రస్థానం


జనవరి 2012

వెల రూ. 10



సాహితీ స్రవంతి

# సామల సదాశివ కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు



సామల సదాశివ

**2011** సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు తెలుగులో 'స్వరలయలు' పుస్తకానికి గాను ప్రసిద్ధ సాహిత్యవేత్త సామల సదాశివకు ప్రకటించారు. సాహిత్య సంగీత రంగాల్లో సాధికార పరిజ్ఞానం గల సదాశివకు ఈ అవార్డు ప్రకటించడం పట్ల సాహితీస్రవంతి హర్షం ప్రకటిస్తున్నది. తెలుగు, హిందీ, ఇంగ్లీషులతో పాటు ఉర్దూ, పారశీ వంటి భాషలలో కూడా పరిజ్ఞానం కలిగిన సదాశివ తన ఆత్మకథ 'యాది' ద్వారా తెలుగు పాఠకలోకానికి సుపరిచితులు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సదాశివ సీనియర్ సాహిత్యవేత్త. ఈ సంవత్సరం కవిత్వ విభాగంలో 8 పుస్తకాలు, నవలల విభాగంలో 7 పుస్తకాలు, వ్యాసాల విభాగంలో 3 పుస్తకాలు, కథల సంపుటి, చరిత్ర, ఆత్మకథ, నాటకం విభాగాలకు ఒక్కొక్క పుస్తకానికి ఈ అవార్డులు ప్రకటించారు. కవిత్వంలో కబిన్ ఫుకన్(అస్సామీ), మణీంద్ర గుప్తా(బెంగాలీ), ప్రేమానంద మొసాహరి(బోడో), నసీమ్ షఫాయీ(కాశ్మీరి), మెల్విన్ రొడ్రిగ్యుస్ (కొంకణి), హరేకృష్ణ శతపతి(సంస్కృతం), ఆదిత్య కుమార్ మండి(సంతాలి), ఖలీల్ మమూన్ (ఉర్దూ)లకు, నవలల విభాగంలో కాశీనాథ్ సింగ్ (హిందీ), గోపాలకృష్ణ పాయ్ (కన్నడ), క్షేత్రి బీరా (మణిపురి), కల్పనాకుమారి దేవి (ఒడియా), బల్‌దేవ్ సింగ్ (పంజాబీ), అతుల్ కనక్(రాజస్థానీ), ఎస్. వెంకటేశన్ (తమిళ్) లకు, వ్యాసాల విభాగంలో లలిత్ మగోత్రా (డోంగ్రి), గ్రేస్ (మరాఠీ), సామల సదాశివ (తెలుగు) లకు ఈ పురస్కారం దక్కింది. రామచంద్ర గుహ(ఇంగ్లీషు) చారిత్రక విభాగం, మోహన్ పరమార్ (గుజరాతీ) కథల సంపుటి విభాగం, ఎం.కె. సాను(మలయాళం) ఆత్మకథ విభాగం, మోహన్ గెహాని (సింధి) నాటక విభాగంలో ఈ అవార్డు అందుకోబోతున్నారు. డిసెంబరు 21న కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి అగ్రహారం కృష్ణమూర్తి ఈ వివరాలను అకాడమీ వెబ్‌సైట్‌లో ప్రకటించారు. 2012 ఫిబ్రవరి 14న లేఖా ఉత్సవాల సందర్భంగా సాహిత్య అకాడమీ నిర్వహించబోయే సభలో న్యూఢిల్లీలో ఈ పురస్కార ప్రధానం జరుగుతుందని ఆ ప్రకటనలో తెలియజేశారు.


# హైదరాబాద్‌లో పుస్తకాల పండుగ



నెక్లెస్ రోడ్ వద్ద పీపుల్స్‌ప్లాజాలో డిసెంబరు 15 నుండి 25 వరకు నిర్వహించిన 26వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో 'వాక్ ఫర్ బుక్స్' ప్రారంభిస్తున్న నగర కమీషనర్ ఎ.కె. ఖాన్



హైదరాబాద్ బుక్‌ఫెయిర్ వేదికపై ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణల ఆవిష్కరణ



సాహితీస్రవంతి, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సంయుక్త నిర్వహణలో ప్రసిద్ధ రచయితల ఫొటో ప్రదర్శన

సాహిత్య ప్రస్థానం
సంపుటి : 11 జనవరి 2012 సంచిక : 72

# శుభారంభం

**నూ**తన సంవత్సరం ప్రవేశించింది. నూతనత్వం మనం తెచ్చుకోవాలి. వ్యక్తిగత జీవితాల్లోనైనా వ్యవస్థాగత అంశాల్లోనైనా. ప్రయత్నం, చైతన్యం లేకుండా మార్పు రాదు. అలాటి పునస్సంకల్పానికి, నూతన ప్రారంభాలకు ఇది సరైన సందర్భం. హ్యాపీ న్యూ ఇయర్ హడావుడి అవసరం లేదు గాని కాలానికి ఒక కొండగుర్తుగా దీన్ని తీసుకుని కార్యాచరణను నిర్వచించుకోవచ్చు, నిర్దేశించుకోవచ్చు.

. . .

ప్రపంచీచరణ మేడిపండు నిజస్వరూపాన్ని 2011 సాక్షాత్కరింప చేసింది. ప్రపంచంలో దురాక్రమణలూ దేశంలో అవినీతి భాగోతాలు ఆర్థిక భారాలు అన్నీ కళ్ళు తెరిపించేవిగా వున్నాయి. దానిపై ఒక విహంగావలోకనం లోపలి పేజీలలో ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో సాహిత్య సాంస్కృతిక రంగాలలో కర్తవ్యాలేమిటి? సాహిత్యకారుల కర్తవ్యమేమిటి? కరిగిపోయిన ఏడాది వారు దాన్ని ఏమాత్రం నెరవేర్చారు? వచ్చే ఏడాది ఏం చేస్తే నేటి అవసరాలకు సమాజం అంచనాలకు అందుకోగలుగుతామన్నది ప్రశ్న.

. . .

రచనలు చేయడం, పుస్తకాలు ప్రచురించడం ఒక భాగమైతే వాటిని ప్రజల దగ్గరకు తీసుకెళ్ళడంలో ఏ మేరకు సఫలం అవతున్నామన్నది తదుపరి ప్రశ్న. దీన్ని పరిశీలించాలన్నా అనుభవాలు, వాస్తవాలే ఆధారం. అందుకే ఆ విషయాలపైనా మీ అభిప్రాయాలను కోరుతున్నాం. 2012లో ప్రజా సాహిత్య రంగం మహోద్యమంగా సాగాలంటే ప్రజల్లో ప్రగతిశీల ప్రజాస్వామిక రచనలను విస్తారంగా తీసుకెళ్ళాలంటే ఏం చేయాలన్నది ప్రశ్న.

. . .

ఈ ప్రశ్నలు వేసుకుని మేమే సమాధానం చెప్పే ముందు మీ మనోభావాలు తెలుసుకోవాలనుకుంటున్నాము. అందుకే సాహిత్య రంగానికి సంబంధించి మీ భావాలు ఆహ్వానిస్తూ ఒక ప్రశ్నావళి ప్రచురిస్తున్నాము. వాటిపై మీ అభిప్రాయాలు చూసిన తర్వాత పత్రిక తరఫున స్పందన, భవిష్యత్ సూచనలు కొందరు సాహిత్య ప్రముఖుల భావాలు ఫిబ్రవరి సంచికలో...

***రచయితలు, పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు...***

బొమ్మలు : చంద్ర, శివాజీ, వెంకటేష్

## ఈ సంచికలో...


ఓ బాడుగెద్దు ఆత్మకథ (కథ) ........ 2
వెలుగు జాడ గురజాడ ........ 5
కవిత ........ 9
2011 తెలుగు సాహిత్యం
ఓ విహంగ వీక్షణం ........ 10
కవిత ........ 14
భూతవైద్యం (కథ) ........ 15
కవిత ........ 17
నిజ రూపాల నిరూపణ
కొనసాగిన కార్యాచరణ ........ 18
లేళ్ళ మెరక (కథ) ........ 21
పియర్ పావ్లో పాసోలినీ
(ఆధునిక ఇటలీ కవులు) : సౌభాగ్య ........ 24
చీకటి రోజుల వెలుతురు జాడలు ........ 26
కవిత ........ 27
సమాజయజ్ఞం స్వేదర్శి కాళీపట్నం ........ 28
ప్రేమకు కూడా (అనువాద కథ) ........ 36
కొత్త పుస్తకాలు ........ 38
సాహిత్యరంగం తీరుతెన్నులపై మీరేమంటారు? ........ 40
నివాళి ........ 41
బుక్‌ఫెయిర్ ........ 42
డైరీ ........ 44

సంపాదకవర్గం
**తెలకపల్లి రవి** (సంపాదకుడు)
**కె.ఆనందాచారి**
**వొరప్రసాద్**
**వల్లభాపురం జనార్దన**

**కె. లక్ష్మయ్య,** మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ.మెయిల్ : Prasthanam_ss@yahoo.co.in
ssprasthanam@gmail.com
www.prasthanam.com

కథ



# ఓ బాడుగెద్దు ఆత్మకథ

**- తియ్యగూర సీతారామిరెడ్డి**

**పు**ట్టీ పుట్టగానే పాలకోసం వెదుకుతూ వెదుకుతూ ఉంటే ఆ చల్లని చేతులే సాయమందించి వుంటాయి. ఆ చల్లని చేతులే నా మెడ చుట్టూ అల్లుకొని ఆప్యాయతలు కురిపించేవి. మంచి మంచి తీయని దంటు పరకలు ఒక్కొక్కటిగా నోటి కందించేవి. తరువాత తరువాత మేతలు మేపేవి. దాణాలు పెట్టేవి. జనపకట్టె మెత్తని చివరలను తుంచి అందించేవి. కొద్ది కొద్దిగా పెద్దవుతూ ఉండగా ఒక మండే ఎండాకాలంలో నా గిట్టల్లో పుండ్లు పడ్డాయి. ఆ చేతులే ఆ పుళ్ళను కడిగి కడిగి మందులు పూశాయి. నా కాలును అతని తొడ మీద ఉంచుకొని గిట్టల్లో ఇరుక్కున్న పురుగుల్ని నొప్పి లేకుండా తీసి గోరువెచ్చని నీళ్ళతో కడిగేవాడు. అతనంటే ఎంతో ఇదిగా వుండేది. పొద్దు పొద్దుకీ కనబడకపోతే బెంగగా వుండేది. అతని కోసం అరిచేవాడిని. అతని అడుగుల చప్పుళ్ళు దూరం నుండే విని రంకెలే వేసేవాడిని. దగ్గరకు రాగానే లేచి నిలబడే వాడిని. ఓ డబ్బాలో మూత్రం పట్టి దూరంగా పారబోసేవాడు. మంచి పక్క వేసేవాడు. ఎప్పుడూ నా వంటికి తడై ఎరుగదు. రోజూ సాయంకాలం కాలవకు తోలుకెళ్ళేవాడు. లేత ఎండలో నా వళ్ళంతా తెల తెల్లగా మెరిసిపోయేది. ఈడొచ్చేసరికి బలంగా తయారయ్యాను.

ఓ రోజు నా ప్రక్క ప్రక్కనే నా ఈడు కోడె ఒకటి వచ్చి చేరింది. మొదట మొదట అది నన్ను గుర్రుగా చూసేది తరువాత తరువాత ఇద్దరం కలసిపోయాము. ఇద్దరికీ కాడి కట్టాడు. మా మెడలు అర్రులు చేశాయి. బండి లాగడం, అరక దున్నడం. సాలులో తిన్నగా నడవడం అన్నీ బాగా నేర్పాడు. ఇద్దరం కలిసికట్టుగా పట్టు పట్టి లాగే వాళ్ళం. అతడు ఎప్పుడూ మామీద చర్నాకోల విసిరేవాడుగాదు. మా వంటి మీద చిన్న వాత కూడా పడలేదు (అలా పడతాయని తరువాత తెలిసిందిలే).


మా పక్క పక్కన పెయ్య దూడలుండేవి. అప్పుడప్పుడూ ఏదో వింత వాసనలొచ్చేవి. అరచి గోల చేసేవి. అవన్నీ నాలో ఆ స్రవాలను రేకెత్తించేవి. లోపల ఏదో జరిగేది. అతడు మా పగ్గాలు విప్పేవాడు. ఆకర్షణలో ఆ పెయ్యలకు దగ్గరయ్యేవాడిని. నా జతగానికి కూడా ఇలాంటి సరదాలు తీరుతూ వుండేవి.

వానాకాలం వచ్చింది. ఊరకనే ఉన్నాం. ఓ రోజు నలుగురు కొత్తవాళ్లు వచ్చారు. కాళ్ళకు తాళ్ళు గట్టి కింద పడేశారు. నా నరాలు పట్టకారుతో వత్తి పారేశారు. విపరీతమైన నొప్పి కలిగింది. పెద్దగా అరిచాను. నిజంగా ఇలా జరిగిందా. కన్నుల వెంట నీరు ధారగా కారాయి. నాతో అంత ప్రేమగా ఉండే అతడేనా ఇలా చేసింది. నమ్మలేకపోయాను. కానీ పచ్చి నిజం. నొప్పి తెలుస్తుందిగా. ఇది భ్రమ కాదు. అతని మీదున్న ప్రేమ వల్ల కోపం రాలేదు. ఏడుపు వచ్చింది. మొట్టమొదటిసారి అతనంటే కొంచెం అయిష్టం ఏర్పడింది. నా హృదయంలో

ఏదో ముల్లు కెలుకుతూనే వుంది. అయితే ఆ రోజునుండీ అతడు దాణా ఎక్కువగా పెట్టాడు. మంచి మంచి మేతలు వేశాడు. బండి అరక కట్టలేదు. ఊరకనే తెగ మేపాడు. బాగా బలంగా తయారయ్యాను. అయితే ఇప్పుడో విచిత్రం జరిగింది. పెయ్యల నుండి వచ్చే వింత వాసనకు ఏ స్రావం ఊరడం లేదు. ఏమయిందో ఏమో? నా జతగాని స్థితీ ఇంతే!

తొలకరులెన్నో జరిగిపోయాయి. దుక్కులెన్నో గడచి పోయాయి. రోజులు మారిపోయాయి. ఇదివరకటి మేతలు కరువయ్యాయి. దాణాలు అందడం లేదు. పచ్చి పరకలకు కూడా దిక్కులేదు. ఒక్కొక్క పెయ్యను ఎవరో వచ్చి తోలుకు పోయారు. మళ్ళీ వస్తాయని ఎదురు చూశాము. కానీ మళ్ళీ తిరిగి రాలేదు. రోజులు గడిచే కొద్దీ మేమిద్దరమే మిగిలాము.

ఓ రోజు అతడు కన్నీళ్ళ పర్యంతంగా నా వద్దకు వచ్చి వళ్ళంతా నిమిరాడు. గంగడోలు నవరిస్తూ ఉండిపోయాడు. ఇంతలో ఎవరో నలుగురు వచ్చారు. పాత పగ్గాలు తీసివేసి కొత్త తాళ్ళు కట్టారు. మళ్ళీ కింద పడేసి ఇంకేదో చేస్తారని భయపడ్డాను. కానీ నన్నూ నా జతగాడిని ఓ అరిసే బండి ఎక్కించారు. దీన్ని అప్పుడప్పుడు రోడ్డు మీద చూశాం. కానీ ఎప్పుడూ ఎక్కలేదు. దాన్ని మాలాంటి ఎద్దులేవీ లాగడం లేదు. కానీ విచిత్రంగా అరుస్తూ పోతూ ఉంది. కొంచెం పక్కకు చూశాను. ఇళ్ళూ, పొలాలు వెనక్కు పరుగులెత్తుతున్నాయి. ఇళ్ళు వెనక్కి నడుస్తాయని, పొలాలు పరుగెత్తుతాయని ఇప్పుడే తెలిసింది. అర్థం కాని సంగతేమిటంటే పొలాలు, రోడ్లు, ఇళ్ళు వెనక్కి పరుగులెత్తితే మేము బండి ముందుకు లాగడమెందుకో? ఎంత ఆలోచించినా ఏమీ అర్థం కాలేదు.



కొంతసేపటికి అరిసే బండి అరవడం మానుకొంది. ఇళ్ళు, పొలాలు వెనక్కు పరుగులెత్తడం ఆగిపోయాయి. నన్ను, నా జతగాడిని బండి దించారు. ఓ చిన్న పంచపాళిలో కట్టిపడేశారు. "అతని" కోసం అరచి అరచి రంకెలు వేశాను. అతని అడుగు చప్పుళ్ళ కోసం ఆత్రంగా ఎదురుచూశాను. చీకటి పడింది. రాతిరంతా మేత తినబుద్ధి కాలేదు. తెలతెలవారుతుండగా ఎవరో వచ్చి బండి కట్టారు. ఆ కట్టడం కట్టడం ఎంత ఎండెక్కినా విడవనే లేదు. బండికి కట్టి వుంచే నీళ్ళు పెట్టారు. ఆకలవుతుంది. ముందు బండిలో వున్న మేత పరకల్ని ఆవురావురుమంటూ లాగి తినసాగాను.

ఎవరో వచ్చి మూతిమీద రెండు తగిలించాడు. అతడెప్పుడూ అలా చేయలేదు. ఇంతింత బరువులు కూడా వేయలేదు. ఇప్పటి వరకు బలం మీద ఉన్నాం గనుక ఈ బరువు లెక్కలేదని పిస్తుంది. సూరీడటు తిగిరినాక మా మొగాన ఇంత ఎండుచెత్త వేశాడు. "అతని" కోసం ఎదురుచూశాను. రాను రాను "అతడు" కనబడతాడనే ఆశ అడుగంటిపోయింది. రోజు రోజుకూ పని పెరుగుతుంది. మేతలందడం లేదు. సత్తువ తగ్గిపోతుంది. ఎందుకిలా జరుగుతుంది. అతడు మేపుతున్నట్లు ఇతడెందుకు మేపడం లేదు. నా మెదడుకు ఏం అందడం లేదు. ఇతని మీద కోపం వచ్చేది. కస్సుబుస్సుమంటే నాలుగు దెబ్బలు పడటం తప్ప ఏ లాభమూ లేదు. అలా కాలం ఈడుస్తూ ఉన్నాము.

అప్పుడప్పుడు "ఇతనిని" చూస్తే జాలేస్తుంది. మాకన్నా బక్కగా ఉన్నాడు. మాతో పాటే కష్టం చేస్తాడు. ఈ ఇంట్లో అందరూ పనిచేస్తూ ఉంటారు. మా పక్క పక్కనే జీవిస్తూ మాతోటే ఉంటున్నారు. అప్పుడప్పుడూ వాళ్ళు తాగే గంజే మాకూ పోస్తున్నారు వారికి ఎక్కువైనప్పుడల్లా! ఏదో ఉన్నదాంట్లోనే  మాకు ఇంత పడేస్తున్నారు. అంతా మెల్లగా అలవాటయిపోయింది. మునుపటి మేతలపై, దాణాలపై భ్రమలు తొలగిపోయాయి. కండలన్నీ కరిగిపోయాయి. బొక్కలన్నీ బయటపడ్డాయి. ఇతడూ మాలాగే ఉన్నాడు. బండికి సరుకులు ఎక్కించేటప్పుడు ఎక్కడ పడిపోతాడో అనిపించేది. మాక్కూడా బండి వంతెన ఎక్కేటప్పుడు చాలా కష్టపడాల్సి వస్తుంది. ఎక్కడ లాగలేక పడిపోతానో అనిపించేది. నా జతగాడి పనీ అంతే! ఇద్దరం పళ్ళ బిగువున నెట్టుకొస్తున్నాం.

అరకలు లాగలేక పోతున్నాం. బళ్ళు మోయలేక పోతున్నాం. వీపులు పగిలి పోతున్నాయి. ముల్లుగర్రలు విరిగి పోతున్నాయి. ఎప్పుడు పొద్దు పోతుందా అని ఎదురు చూసేవాళ్ళం. రాత్రయితే దోమలు కుట్టి కుట్టి పడేసేవి. ఎప్పుడు తెల్లవారుతుందా  అని ఎదురు చూసేవాళ్ళం. ఇంకా నీరసించి పోయేవాళ్ళం. ఓ రోజు బాగా ఎండెక్కింది. బండి లాగుతూనే వున్నాం. దారిలో ఓ వంతెన ఎక్కాల్సి వచ్చింది. ఎత్తు ఎక్కే వరకు ఎట్టానో లాక్కుంటూ, పీక్కుంటూ ఎక్కాం. ఇక ఉందల్లా కిందకి దిగడమే. అసలు బాధంతా ఇక్కడే వుంది. ఇదివరకైతే రొమ్ము బలం మీద బండిని ఆపగలిగేవాళ్ళం. ఇప్పుడు దిగాలంటే భయం భయంగా ఉంది. అందుట్లో బండి కొంచెం ముందు బరువైందనుకుంటా. బరువంతా మెడల మీదే ఉంది. కిందకి తొక్కేస్తుంది. కాడి మెడల మీద నిలవడం లేదు. ముందుకు తోసివేస్తుంది. మెల్లగా ఆపుకుంటూ దిగే సత్తువ లేదు. ఆ ఊపు ఆపలేక పరుగెత్తవలసి వచ్చింది. ఓపికేమో లేదు. ఆ ఊపు అందుకోలేక ముందుకు పడ్డాను. కాలు మడతపడింది. పుటుక్కుమంది. కూలబడిపోయాను. బండి బండంతా వచ్చి మీద పడింది. నడుములు విరిగాయి. పెద్దగా మూలిగాను. జనం వచ్చి కష్టం మీద నన్ను బండి నుండి వేరుచేశారు. అక్కడే వో పక్కకు లాగి పడేశారు. "ఇతడు" వచ్చి కొద్దిగా నీళ్ళు పెట్టాడు. కొంచెం ప్రాణం కుదుటపడినట్లయింది.

రాత్రి అవుతుండగా ఓ అరిచే బండి వచ్చింది ఎట్టాగో జనాలందరు నన్ను బండి ఎక్కించారు. విరిగిన కాలు, నడుము ఇంకా

## కవిత

# ప్రజలపై పాలకులు పగబట్టారు

- అద్దేపల్లి రామమోహనరావు

సెల్ : 9849150303



ప్రభుత్వం
ప్రజా వ్యతిరేకమైన దేన్నీ ఆపదు
బల్లి, పురుగును మింగడానికి
శరీరంలో ప్రతి అణువూ దూకుతున్నా
ఎంతసేపైనా అలా ఆగిపోతుంది
కాని, అనువైన క్షణంలో
ఒక్క ఉదుటున తినడం మాత్రం మానదు
అదివరకు అణు విద్యుత్తుని
ప్రజా ప్రేమికులు 'కాస బియాంకా'లా
తమ దేహాల్ని అడ్డం పెట్టి ఆపినా
ప్రభుత్వం విదేశీ క్రేన్లు కొనుక్కొచ్చి
గడ్డకట్టిన వాళ్ళ దేహాల్ని బలవంతంగా లాగేసి
అణు వరదకి గేట్లు తెరిచేశారు
ఇప్పుడు కొన్ని కోట్ల మందిని
శవాల మీద 'చిల్లర' నేరుకుని బతకమని
ఎఫ్.డి.ఐ.ని నెత్తిన మోసి తెస్తూ, తెస్తూ
ప్రజా ప్రేమికులు బ్రేక్ వేస్తే ఆగిపోయి
'ఏకాభిప్రాయం' కోసం ఎదురు చూస్తున్నారు
అనేకమైన బల్లి చూపుల్తో
ఏకాభిప్రాయం సాధించే దాకా
కనుపాపల్ని కదిలించరు
త్వరలోనే ఏకాభిప్రాయాన్ని పెద్ద ఉరితాడుగా పేని
చిల్లర వ్యాపారాల ఊపిరి లాగేస్తారు
సంస్కరణలు 'వాల్' నీడల మంచు దోవల గుండా
అభివృద్ధి మార్గంలోనే ముందుకుపోతై
మదపుటేనుగులు ఉన్మాదంతో పరుగులు పెడ్తుంటే
అల్పజీవులు మట్టి కలిసిపోతుంటై
ఏనుగులు ప్రపంచాన్ని బెసకనివ్వకుండా పట్టుకున్న
దిగ్గజాలకు దేశాన్ని తాకట్టు పెట్టి
ఎన్నెన్నో కొత్త వస్తువుల పెట్టెల్ని మోసుకొచ్చి
కుబేరుల పాదాల దగ్గర పడేస్తై
ఆ పెట్టెల్లోంచి అన్ని వృత్తుల్నీ మట్టి కరిపించే
బంగారు వానలు కురుస్తై
బంగారు పొడి ఒంటికి పూసుకుని
పాప్ డాన్సులు చేసేవాళ్ళు చేసుకుంటారు
వాళ్ళు విసిరే చిల్లర నేరుకునే వాళ్ళు ఏరుకుంటారు
దేశం ముందుకు పోతూనే ఉంటుంది
2020 విజన్ కోసం
నురుగులు కారుస్తూ పరుగులు పెడుతూనే ఉంటుంది

---

కదిలి బాధ ఎక్కువైంది. మళ్ళీ ఇళ్ళు, పొలలు వెనక్కు పరుగులెత్తసాగాయి. ఒక్కసారిగా గతం జ్ఞాపకాలు కళ్ళెదుట కదలసాగాయి. "అతడు" గుర్తుకు వచ్చాడు. కళ్ళమ్మట నీళ్ళు ధారగా కారసాగాయి. అప్పుడప్పుడూ అరిచే బండి ఎగిరెగిరి పడేది. అసలే హూనం అయిన వళ్ళు ఇంకా హూనం అయింది. దాంతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాను. నొప్పులకు తెంపే లేదు. కొంతసేపటికి అరిచే బండి ఆగింది. కొంతమంది నన్ను కిందకి తోశారు. పై ప్రాణం పైనే పోయింది. ఎటూ కదలలేక పోయాను. అంతా నరకంగా వుంది. ఏం జరుగుతుందో తెలియడం లేదు. కొంతసేపటికి తెల్లారింది. నా పక్క పక్కనే నాలాంటి బక్కజీవుల్ని చేర్చారు. ఎండ ఎక్కింది. దాహం వేస్తుంది. నీళ్ళు పెట్టే నాథుడే లేడు. దూరంగా ఓ చెట్టు నీడ ఉంది. కొన్ని జీవులు మెల్లగా ఆ చెట్టు నీడకు చేరాయి. కానీ నేను కదలలేకపోవడంతో ఆ ఎండలోనే కాలిపోయాను. నురుగు దొబ్బలు పడ్డాయి. ఇంతలో ఓ పెద్ద అరిచే బండి వచ్చింది. మా బక్క జీవుల్ని దాంట్లో ఎక్కించడం మొదలుపెట్టారు. కుక్కి కుక్కి ఎక్కించారు. నన్ను కూడా లోపలికి తోసి తోసి ఎక్కించారు. చుక్కలు చూపించారు. ఒక దానిమీద ఒకదాన్ని ఇరుకుగా ఎక్కించడంతో ఊపిరి కూడా ఆడటం లేదు. విరిగిన నడుం ఇంకా విరిగిపోయింది. పై ప్రాణం పైనే పోయింది. కానీ కొన ఊపిరి మిగిలే వుంది. బండి ఎప్పుడు సాగిందో ఎప్పుడు ఆగిందో ఏం తెలియడం లేదు. అన్నింటినీ కిందికి జారవిడుస్తుంటే తెలిసింది. అన్నింటినీ పోగు పడ్డట్టుగా బండి నుండి వదేశారు. చచ్చే ప్రాణులు చచ్చాయి. నా పని కూడా అయిపోయిందనుకున్నాను. ఇంకా ఏ నరకం చూడాల్సి వుందో కొనప్రాణం మిగిలి వుంది. ఎవరో వచ్చి నా కొమ్ములు కోస్తున్నారు. కోస్తూ ఉంటే నెత్తురు ధారలు కారుతుంది. కారి కారి కళ్ళు పూడుకుపోయాయి. బాధతో మూలగడానికి కూడా ఓపిక లేదు. స్థాణువులా ఉండిపోయాను. నా వళ్ళంతా వాళ్ళకే అప్పజెప్పాను. నాది అనుకోవడానికి ఏముంది. బతికుండగానే చర్మం ఒలుస్తున్నారు. ఇంతలో ఏ పుణ్యమూర్తో వచ్చాడు. గొంతు తెగుతున్నట్టు తెలిసింది. ఆ తరువాత ఏం జరిగిందో.. అంతా నిశ్శబ్దం...

సెల్ : 9491336258

## 150వ జయంతి

# వెలుగు జాడ గురజాడ

**- డా॥ కె. ఆశాజ్యోతి**



గురజాడ అప్పారావు

**ఒకటిన్నర శతాబ్దం తరువాత కూడా గురజాడ సమాజాన్ని కదిలిస్తున్నారంటే అతని దృష్టి ఎంత ముందుకు సాగిందో, ఈ సమాజం. అందులోని మనం అతడి కన్నా ఎంత వెనకబడి ఉన్నామో తెలుసుకొనడానికే తరాల అంతరాలు దాటి గురజాడను తలచుకుంటున్నాం.**

గురజాడ కలం అప్రతిహతం 'సమ్మోహనం' ఎంతటి వారైనా ఆ కలం సమ్మోహనానికి తలొగ్గవలసిందే! ఆ కలం గళం ముందు నమోవాకాలు అర్పించవలసిందే! ఆ కలం రేపే కలకలం ముందు మోకరిల్లవలసిందే! ఆ కలం మేరునగధీరత్వం ముందు మూగ బోవలసిందే! ఆ కలం వెలువరించే విస్ఫులింగాలకు బెదర వలసిందే! అది పలికించే కిలికించితాలకు పులకరించవలసిందే! కొండలను సైతం ఢీకొనే ఆ కలం ధీశక్తి ముందు విచలితమనవలసిందే! గుండె కుహురాలలో ఆ కలం ప్రజ్వలింపజేసే బడబాగ్నిని భరించ వలసిందే! అవి జాలు వార్చే పదబంధాల సోయగాల ఉప్పెనలో నామరూపాలు లేకుండా పోవలసిందే! తీరాలను తాకే కెరటాల ఉధృతిలో ఆ కలం గుండె తీరాలను తాకుతుంటే రక్తధారలుగా మిగలవలసిందే!

కాసుకు లోనై తల్లీ తండ్రీ
నెనరూ న్యాయం విడనాడి
పుత్తిడి బొమ్మను పూర్ణమ్మను
ఒక ముదుసలి మొగుడికి ముడివైస్త్రీ

పూర్ణమ్మ గేయంలో పదాల పోహళింపులో గురజాడ పలకించిన కరుణ రసాత్మక వేదన తాకని గుండె ఉంటుందంటే నమ్మలేం! నాటి కాలానికి ప్రాచుర్యంలో ఉన్న బాల్య వివాహమనే సాంఘిక దురాచారాన్ని ఇంత మృదువుగా, సూటిగా తాకించగల కలం కేవలం గురజాడది మాత్రమేనన్నది జగమెరిగిన సత్యం. జనం ఒప్పుకొనే వాస్తవం!

అసలు గురజాడ పలికించని సంగతులున్నాయా అని అనుకోవసరం లేదు. తను చూసిన సమాజం - ఆ సమాజంలో పెచ్చరిల్లుతున్న దురాచారాలు. వాటిని రూపుమాపే కనీస ప్రయత్నానికి గురజాడ కలం చేసిన మహాయజ్ఞం. ఎంత సాటిలేనిదో అవగతమైన సమాజమే ఇది. ఒకటిన్నర శతాబ్దం తరువాత కూడా గురజాడ సమాజాన్ని కదిలిస్తున్నారంటే అతని దృష్టి ఎంత ముందుకు సాగిందో, ఈ సమాజం. అందులోని మనం అతడి కన్నా ఎంత వెనకబడి ఉన్నామో తెలుసుకొనడానికే తరాల అంతరాలు దాటి గురజాడను తలచుకుంటున్నాం.

గురజాడ ఎంతటి క్రియాశీలురంటే తన కాలంలోని సమాజ అసమతౌల్యాన్ని గమనించారు. ప్రశ్నించారు. ప్రశ్నించడం - ప్రశ్నించి నిలబడగలిగే సామాజిక స్థితీ గతీ అప్పటికి ఎవరికీ లేదు.' ఒకవేళ ఉన్నా గురజాడలా ఎవరూ పట్టించుకోలేదు' - 'ఆది కాలంలో తిక్కన, మధ్య కాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మన తెలుగులో మహా కవులు - అన్నారు శ్రీశ్రీ" ఈ ముగ్గురూ సమాజంలో సాగుతున్న అసంగతులను ప్రశ్నించినవారే! ప్రశ్నించడానికి తిరగబడడానికి ఏ మనిషికైనా సమాజంలోని పరిస్థితులే ప్రేరేపిస్తాయి. సమాజమే నేర్పుతుంది. ప్రశ్నించడం నేర్చుకున్న వ్యక్తి సాధ్యా సాధ్యాలను బేరీజు వేసుకోవాలి. ఫలితం ఏదైనా, ఎలా ఉన్నా ప్రశ్నించడం సగటు వ్యక్తి కనీస బాధ్యత.!! ద్రౌపది ద్వారా పితృస్వామ్య సమాజాన్ని ప్రశ్నించిన తిక్కన - పెచ్చుమీరిన సాంఘిక దురాచారాలకు పద్యాలతో నిక్కచ్చిగా కడిగేసిన వేమన - సామాజిక దౌర్బల్యాలను నిలదీసి సమాజాభ్యున్నతికి అని కంటక ప్రాయమని తెలిపిన గురజాడ - ఈ ముగ్గురూ సమాజ క్షాళనానికి చేసిన పని ప్రశ్నించడమే! అందుకే ఈ ముగ్గురిదీ సాహిత్యంలో ప్రత్యేక స్థానం. అందునా గురజాడది మరీ ప్రత్యేకం.

యెల్ల లోకము వొక్కయిల్లై
వర్ణభేదము లెల్ల కల్లై
వెలనెరుంగని ప్రేమబంధము

వేడుకలు కురియును అంటారు గురజాడ! అందుకే జాతి సమైక్యతకై, సమ సమాజాభ్యున్నతికై కలంతో పోరాడిన యోధుడుగా చరిత్రలో మిగిలిపోయారు గురజాడ. వర్ణభేదాలు కల్లలౌతాయని, హద్దు లెరుగని ప్రేమబంధం అందరినీ ఆనందింపజేస్తుందనీ, మతాలన్నీ మాసిపోతాయనీ, జ్ఞానమొక్కటే నిలిచి వెలుగుతుందనీ ప్రపంచమంతా ఏక కుటుంబమవుతుందనీ నమ్మారు. "ప్రపంచీకరణ"లో భూగోళమంతా కుగ్రామమవుతుందన్న ఆలోచన వెనుక స్వార్థపూరిత అగ్రరాజ్యాల కుట్ర రానున్న నేపథ్యంలో - వర్ణభేదం లేని ప్రపంచమంతా ఏక కుటుంబమై భాసిస్తుందని భావించిన గురజాడ ఎంతటి క్రాంతదర్శి.

స్త్రీ, పురుషుల మధ్య స్నేహం – ప్రేమ మాత్రమే కలకాలం నిలుస్తుందనీ, ఆలు మగల మధ్య మాంగల్య బంధాన్ని మించి ప్రేమబంధం బలపడాలని గురజాడ అభిప్రాయం.

ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును
ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును

ఈ మాటలు జీవితాన్ని ఎంతో లోతుగా అనుభూతించగలిగిన వాడైతేనే అనగలడు. ఆ అనుభూతి సాంద్రత తెలిసినవాడు గురజాడ! స్త్రీ పురుషుల మధ్య దాంపత్యం అర్థవంతంగా సాగడానికి ప్రేమను మించిన ఏ శక్తి ఆధారం కాదని నమ్మారు. నమ్మిన దానిని ప్రవచించారు.

దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్

తిండి కలిగితే కండకలదోయ్
కండ కలవాడేను మనిషోయ్

అనగలిగే నిండైన గుండె కేవలం గురజాడకు మాత్రమే ఉంది. మానవాళిని కులమతాలకు అతీతంగా ప్రేమించగలిగే గుండె ధైర్యం గురజాడకే ఉంది.

"మంచి గతమున కొంచెమేనోయ్" – సమాజం చూపు భవిష్యత్తును దర్శించేదై ఉండాలని గురజాడ ఆశించారు. చూరు పట్టుకుని వేలాడుతున్నట్టుగా గతానికి వేలాడొద్దన్నారు. గతాన్ని వదిలి భవితవ్యంలోకి నడవమన్నారు.

మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచి యన్నది మాలయైతే
మాలనే అగుదున్

గురజాడ మాలవాడు అవుతాడా? కాదా? అవగలడా? వంటి అసంగత సందేహాలను పక్కన పెట్టి ఒక బ్రాహ్మణుడు – సమాజంలో అంటరానితనం క్షయలా – రాచపుండులా తొలుస్తున్న తీవ్ర పరిస్థితుల్లో – మంచి యన్నది మాలయైతే మాలనే అగుదున్" అనడానికి ఎంత గుండె ధైర్యం కావాలి. అంటరాని వారి వెంట వచ్చే గాలి కూడా అంటరానిదై. విషతుల్యమై భరించలేని స్థితిలో అసామాన్యమైన రొమ్ము పొగరుతో, దుర్బలుడైన వ్యక్తి కొండలు పిండి చేయగల మనో ధైర్యంతో అనడం నిస్సందేహంగా అసామాన్యమే 'దుస్సాహసమే'. గురజాడ మాత్రమే అనగలడు 'అనగలిగారు' ఈ సాహసం ఎందరికో స్ఫూర్తి.'

స్త్రీ వాదం ఒక వాదంగా ప్రారంభమై బలపడి ముందుకు సాగడానికి ఎన్నో దశాబ్దాల ముందే –"స్త్రీలు మేలుకోవాలి. ఎదురించాలి, తిరగబడాలి అన్నారు గురజాడ. స్త్రీల పట్ల, వారి సమస్యల పట్ల సానుభూతి ప్రదర్శించడం కన్నా స్త్రీ జాతి జాగృతికి కృషి చేయవలసిన అవసరం ఉందని భావించిన ఆత్మీయుడు, స్త్రీ పక్షపాతి. కన్యాశుల్కంలో – మధురవాణి, బుచ్చమ్మ, వెంకమ్మ, పూటకూళ్ళమ్మ, మీనాక్షి, యోగిని, కన్యకలో కన్యక, పూర్ణమ్మలో పూర్ణమ్మ, థామన్ పితియస్‌లో పితియస్, దిద్దుబాటులో కమలిని, పాత్రలను నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకుని రూపొందించినవే!

**గురజాడ మాలవాడు అవుతాడా? కాదా? అవగలడా? వంటి అసంగత సందేహాలను పక్కన పెట్టి ఒక బ్రాహ్మణుడు – సమాజంలో అంటరానితనం క్షయలా – రాచపుండులా తొలుస్తున్న తీవ్ర పరిస్థితుల్లో – మంచి యన్నది మాలయైతే మాలనే అగుదున్" అనడానికి ఎంత గుండె ధైర్యం కావాలి. అంటరాని వారి వెంట వచ్చే గాలి కూడా అంటరానిదై. విషతుల్యమై భరించలేని స్థితిలో అసామాన్యమైన రొమ్ము పొగరుతో, దుర్బలుడైన వ్యక్తి కొండలు పిండి చేయగల మనో ధైర్యంతో అనడం నిస్సందేహంగా అసామాన్యమే 'దుస్సాహసమే'. గురజాడ మాత్రమే అనగలడు 'అనగలిగారు' ఈ సాహసం ఎందరికో స్ఫూర్తి.'**

వ్యావహారిక భాషోద్యమానికి గిడుగు రామమూర్తితో గురజాడ కలసి చేసిన కృషి అనన్య సామాన్యం. గ్రాంథిక భాష ఎంత కృతకంగా ఉందో వ్యావహారిక భాష అవసరం మరెంత ఉందో తెలియజేస్తూ కనాశుల్కం Preface to The Second Edition లో "The Telugu intellect is also seriously handicapped by the tyranny of anthonity of a highly artificial Literary dialect, a rigid system of Alliterative Verfication and Literary types which have long played out……. I cannot understand how modern writers fail to see the merits of spoken Telugu. Its softness which elicited the admiration of foreigners, and its range of expression'' అని తెలిపారు. విదేశీయులను ఆకర్షించిన తెలుగు, తెలుగు వారి దృష్టి ఎందుకు నోచుకోలేకపోయిందా అని బాధపడ్డాడు.

తెలుగు సాహిత్య అధ్యయనానికి పఠన పాఠవాలు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయన్నది గురజాడ ప్రశ్న. సంస్కృత, మాతృ భాషల బోధనా పద్ధతుల వైఫల్యానికి కారణాలు ఎన్నో ఉన్నా కృతక గ్రాంథిక భాష ప్రధాన లోపంగా భావించారు. అందుకే "డీ సెంట్ పత్రం"లో ఇలా అంటారు. "మలుపుల మొగలో ఇప్పుడు నిలబడి ఉన్నాం. ఈనాడు మనం తీసుకునే నిర్ణయాలపైనే ముందు తరాల వారి భవితవ్యం ఆధారపడి ఉంది. తెలుగు సాహిత్యాన్ని గొలుసులతో బంధించి మాడ్చినా, స్వేచ్ఛ ప్రసాదించి జవం జీవాలతో వర్ధిల్లనిచ్చినా అందుకు బాధ్యులం మనమే! దేశానికంతటికీ సంబంధించిన సమస్యల పరిష్కారంలో వ్యక్తిగతమైన అభిమానాలకీ, అయిష్టాలకీ ఎంత మాత్రం తావు యివ్వడానికి వీలులేదు. ఏమో యినాడు మనం తీసుకునే నిర్ణయాల మీదే భవిష్యత్తు అంతా ఆధారపడి ఉందేమో ఎవరు చెప్పగలరు?"

నేడు వ్యావహారిక భాష ఆంధ్రదేశం నలుమూలలా చేరి సజీవ భాషగా నిలబడడం వెనుక గురజాడ అవిరళ కృషి, తపోదీక్ష మరువరానివి. అందుకే బూదరాజు రాధాకృష్ణ – "తెలుగులో ఉన్న తెలుగుదనాన్నే తెలుగు జాతికి తెలియజెప్పటం వల్లనే గురజాడకు తెలుగు సాహితీ లోకంలో అద్వితీయ స్థానం వచ్చిందని ఈ విమర్శకులు తమకు తెలియదని గుర్తించినట్లుంది. లేనిదాన్ని సృష్టిస్తే అది కృతకమవుతుంది. ఉన్నదాన్ని ఉన్నట్లు వాడితే అది సజీవమవుతుంది.

> **మనిషి జీవితంలో ఏ సందర్భంలోనైనా సరిపోయే మాటలు కన్యాశుల్కంలో ఎక్కడో ఒక చోట లభిస్తాయి అంటారు శ్రీశ్రీ! అదే గురజాడలోని సార్వజనీన లక్షణం నాటి సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని నాటకం రాయబడ్డా నేటికీ కన్యాశుల్కం నాటకం విరివిగా  నాలుకల మధ్య నలగడానికి కారణం గురజాడ సార్వజనీనతే!'**

గురజాడ సజీవ శిల్పి. వేమన తరువాత తెలుగువాడిని తెలుగులో రాసి మెప్పించగల తెలుగువాడు మరొకరు పుట్టి ఉంటే అతడే గురజాడ" అన్నారు.

వ్యావహారిక భాషోద్యమంతో తెలుగు సాహిత్యంలో ఆధునికతను ప్రవేశపెట్టిన గురజాడ "తోకచుక్క" మూఢనమ్మకాన్ని బద్ధలు చేస్తూ తాను ఉద్యమించిన సంఘ సంస్కారానికి దోహదకారిగా భావించడం గమనిస్తే గురజాడలో ఆధునిక విజ్ఞానం పట్ల ఆసక్తి ఎంత కంఠరఘ్నంగా ఉందో అవగతమవుతుంది. అభివ్యక్తికి గురజాడ ఎంచుకున్న "ముత్యాల సరాల" ఛందస్సు ఆధునికతకు ఎంత దోహదం చేసిందో అందరికీ తెలిసిందే! గురజాడలో ప్రధానంగా కనబడే గుణం ప్రయోగశీలత!! గ్రాంథిక భాషని తిరస్కరించి ప్రజోపయోగమైన వ్యావహారిక భాష ఆవశ్యకతను ప్రతిపాదించడమే ఒక అద్భుతమైన ప్రయోగం. పట్టినది సాధించే దాకా నిద్రపోని అకుంఠిత దీక్ష, ఆధునికతలో భవిష్యత్తును దర్శించే క్రాంతదర్శత్వం గురజాడ సొంతం! వ్యావహారిక భాషను భావజాల మాధ్యమంగా అద్భుతంగా మలచుకున్న అక్షర శిల్పి గురజాడ. అందుకే శ్రీశ్రీ –

అడుగుజాడ గురజాడది
అది భావికి బాట
మనలో వెధవాయిత్వం
మరిపించే పాట
అన్నారు'.

గురజాడ బహుముఖీన ప్రజ్ఞ పరిఢవిల్లింది "కన్యాశుల్కం" నాటక రచనలో! తొలి కన్యాశుల్కం కన్నా మల కన్యాశుల్కం గురించి ఇలా చెప్పుకున్నారు తన లేఖలలో! "మొదటి ముద్రణము కంటే యిది నా భావాలను సమగ్రంగా వ్యక్తం చేస్తున్నది. మొదటిది దీనిలాగా కాదు. అంతర్గత మనోభావాలను కాక, స్థూలంగా పైపై పూతలనే అది ప్రతిబింబించింది. పైకి కనబడే దానికన్నా బలమైన నైతిక భావాన్ని పొందింది. నా పుస్తకం జీవితాన్ని నేను చులకనగా భావించనని తెలుపుతుంది. హాస్యంలో పొంగిపోయ్యే పుస్తకంలో జీవితంలో గంభీరాన్ని చూపడం చాలా కష్టమైన పని ప్రయత్నించాను నేను."

సామాజిక స్పృహ, సామాజిక వాస్తవికత కన్యాశుల్కంలో ప్రతిబింబించినంత సంపూర్ణంగా మరే ఇతర భారతీయ నాటకాలలో ప్రతిఫలింపబడలేదని విజ్ఞుల ప్రశంసను పొందింది. సమాజంలోని వివిధ వర్గాలు, వర్ణాలు, మూలాల, వృత్తుల అంతరంగ తత్వాలను ఆవిష్కరించిన నాటకం కన్యాశుల్కం. సమాజానికి గతి ఉంటుంది ఆ గతికి ఒక క్రమత ఉంటుంది. ఆ క్రమతత్వాన్ని గ్రహించి భిన్న కోణాలను కన్యాశుల్కం ఆవిష్కరించింది. అంతేకాదు – Modern life which presents complex Social Conditions is reflected by play writers'' అని గురజాడే చెప్పుకున్నారు. సమకాలీన సమస్యలు నాటక రచయితలు స్వీకరించడం లేదని, అందుకే ఆ నాటకం రాసినట్టు తెలిపారు. సమాజం తన గమనంలో పెడదారులు పడుతోందని గ్రహించి ప్రతి మనిషీ మేలుకొనేలా చెంపపెట్టులా సాగించిన రచన కన్యాశుల్కం నాటకం. కన్యాశుల్కం ఎంతటి దురాచారమో ఎవరైనా అర్థం చేసుకోగలరు. దాన్ని రూపుమాపడం కోసం ముందడుగు వేసి మొదటి ప్రయత్నంలోనే చిరస్మరణీయునిగా గురజాడ మిగిలారు. కన్యాశుల్కమైనా, వరకట్నమైనా సమస్య స్త్రీ చుట్టూ తిరుగుతోంది. నాటి కన్యాశుల్కమైనా, నేటి వరకట్నమైనా రూపాలలో తేడా తప్ప సమస్య మూలం ఒకటే.' ఆ మూలాన్ని సమూలంగా నాశనం చేయవలసిన అగత్యం గ్రహించిన వారు గురజాడ. కన్యాశుల్కంలో సౌందర్యమంతా నాటకంలోని పాత్రలు, సంభాషణలు, మనో ప్రవృత్తులలో ఉంది. గురజాడ ఎంత పదజాలాన్ని  వాడారంటే ఆ నాటకం ఒక నీటిలా నిరంతరంగా సాగుతుంటే తెలుగు సాహిత్యం దశాబ్దాలుగా తోడుకున్నా, వాడుకున్నా ఇంకా ఇంకా ఊట ఊరుతూనే ఉంది. మనిషి జీవితంలో ఏ సందర్భంలోనైనా సరిపోయే మాటలు కన్యాశుల్కంలో ఎక్కడో ఒక చోట లభిస్తాయి అంటారు శ్రీశ్రీ! అదే గురజాడలోని సార్వజనీన లక్షణం నాటి సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని నాటకం రాయబడ్డా నేటికీ కన్యాశుల్కం నాటకం విరివిగా  నాలుకల మధ్య నలగడానికి కారణం గురజాడ సార్వజనీనతే!'

నాటకంలోని సౌజన్యరావు, అగ్నిహోత్రావధానులు, లుబ్ధావధానులు వంటి పేర్లు కృతకంగా ఉన్నాయని కె.వి.రమణారెడ్డి అభిప్రాయపడ్డారు. ఐతే సార్థక నామధేయులైన అగ్నిహోత్రావధానులు, లుబ్ధావధానులు, కరటకశాస్త్రి వంటి వారిని నేటికీ. సమాజంలో నిత్యం చూస్తూనే ఉంటాం. కన్యాశుల్కం నాటకం ఘనత ఏమిటి అంటే జీవితమంత గొప్పది" అన్నాడు శ్రీశ్రీ!! అల్ప పాత్రలైన అసిరిగాడు, మున్సబు నాయుడు, పూజారి గురవయ్య, హెడ్ కానిస్టేబుల్, సిద్ధాంతీ ప్రతి చిన్న పాత్ర సమగ్రంగా చిత్రింపబడడం నాటక వైదగ్ధ్యాన్ని పెంచాయి. మానవగత లోపాలు, సమయస్ఫూర్తి, లోపాయికారితనం, సమస్య నుండి నెగ్గుకు రాగల చాతుర్యం, ఎదుటివారి లోపాలను తనకు అనువుగా మలుచుకోవడం వంటి  అంతర్గత లక్షణాలతో నాటకాద్యంతం ఒక్క వెలుగు వెలిగిన పాత్ర "గిరీశం"చుట్టకూ – స్టీము యంత్రానికీ లింకు పెట్టగల నేర్పరి ఒక్క గిరీశమే' అంతే కాదు.

ఖగపతి అమృతము తేగా
భుగభుగమని పొంగి చుక్క భూమిని వ్రాలెన్
పొగచెట్టయి జన్మించెను
పొగతాగని వాడు దున్నపోతై పుట్టున్!!

అంటారు. సర్వస్ఫూర్తిమత్వం కలిగిన కళాకారుడు గిరీశం. సాంఘిక దురాచారాలను ఎత్తి చూపడానికి గిరీశాన్ని ఆయుధంగా ఎంచుకున్నారు గురజాడ. గిరీశానికి విధవరాలైన బుచ్చమ్మ పట్ల మమకారం! ఆమె ముగ్ధ సౌందర్యం పట్ల ఆరాధన! నాటకమంతా వెధవ్వేషాలతో తప్పించుకు తిరిగినా బుచ్చమ్మను నిజాయితీగా "విడో మారేజి" చేసుకోవాలనుకుంటాడు గిరీశం! అయితే, సౌజన్యరావు పంతులు అడ్డుపడి గిరీశం బుచ్చమ్మల వివాహం జరగనివ్వకపోవడంతో "డామిట్!

## కవిత



# విలయంగా లయంగా...

- కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి
సెల్ : 9948774243

నాలో నేనేమిటో తెల్సుకోలేకున్నాను
నాలో నీవేమిటో ఏమి చెప్పమంటావ్!
నాలో జిజ్ఞాసలు జిగీషలు
స్పష్టాస్పష్టంగా చిత్రాలుగా విచిత్రాలుగా
ఉడుకుతున్న తపనలు
పాకుతున్న తాపత్రయాలు
ఎంతకూ తెలియని నేనుగానే మిగిలిపోయా...

నీలోని నిప్పు గొంతుకల ఘోష
కొంత గేయంగా
మరికొంత గాయంగా వినిపిస్తూ
అంతటా దుఃఖపు కణికల వాసన!
నాలో మెలితిరిగే మెలుకువ
ఓ అనుభవాన్ని రచిస్తూ
బంధిత ఆనందాన్ని విముక్తీకరించేందుకు
కవితా ప్రవాహమై ముంచెత్తుతుంటూంది!

నీ అస్థిమిత ఆలోచనా లోచనలు
మహత్తర దృష్టినిచే
సులోచనాలకై దేవులాడుతూ
విస్తార శాంతిధామాలకై స్వప్నిస్తుంటాయ్!
పేలికలు పీలికలుగా చీలిన ప్రాణాలు
పొగులుతూ రగులుతూ
పొగలు కక్కే ఆశల శ్వాసలు
పగలు కక్కే రోషాలు ద్వేషాలు
నీలో నాలో సంకుల సమరాలైపోతూ...
పసితనపు పచ్చదనం ఏనాడో వాడిపోయింది!

యవ్వనపు వాన ఎప్పుడో కురిసి వెలిసింది
వృద్ధాప్యపు వాయుగుండమూ
తీరం దాటబోతుంది
ఇంకా...
నాలో వో తడవని ఎడారి
నీలో వో తపించే సముద్రం
ఊపిరి పట్టుకునే వున్నాయ్!
ఇంతదూరం నడిచినా
నేనేమిటో తెలియని నాకు
నాలో నీవేమిటో నేనెలా చెప్పగలనో చెప్పు!
దుర్భేధ్య దుఃఖ శిఖరాలమైన మనం
అంతర్ముఖంగా తవ్వుకుంటూ
పరమానంద జలనిధులాన్వేషణలో
నేనో విలయంగా
నీవో లయంగా
మిగిలిపోతూనే వుంటాం!!

---

కథ అడ్డం తిరిగింది!" అనంటాడు. గిరీశం అన్న ఈ మాటను తెలుగు సాహిత్యంలో అనంతర కాలంలో ఎందరో ఉపయోగించి ఎంత ప్రాచుర్యం కలిగించారో తెలిసిన విషయమే! నాటకంలోని పాత్రలనే కాదు తన నైజంతో పాఠకులను తన ప్రభావంలోకి తెచ్చుకోగలిగిన బలమైన పాత్ర గురజాడ వారి గిరీశం!

నాటకంలో గిరీశంతో సమ ఉజ్జీగా ఉన్న పాత్ర మధురవాణి! వేశ్యా వ్యాపారం, బాల్యవివాహాలు నిర్మూలించడం ధ్యేయంగా కన్యాశుల్కం నాటకం సాగడానికి గల అనేక కారణాలలో ఆమె కూడా ఒక కారణం. నాటకేతివృత్తం కోసం వేశ్యగా మధురవాణిని సృష్టించినా సంస్కారవంతురాలిగా గురజాడ చూపించాడు. మధురవాణి సౌందర్యవతి. బ్యూటిఫుల్ నాచ్ డెవిల్, తెలివైనది, ఆత్మవిశ్వాసం కల స్త్రీ. స్నేహం, ప్రేమా కలది. గిరీశాన్ని నమ్మించగల ప్రజ్ఞ కలది. స్వావలంబి. నాటకంలో అందరికీ సహాయపడే గుణం! ఎవరి మీద ఆధారపడదు. తన వృత్తిని ఎట్టి క్లిష్ట పరిస్థితుల్లోనూ అవమానించదు. అంతస్సంఘర్షణను స్వశక్తితో పరిష్కరించుకోగల కుశాగ్ర బుద్ధి జీవి మధురవాణి.

ఏ ప్రాధాన్యతా లేని పాత్రగా గిరీశాన్ని నాటకంలో గురజాడ సృష్టించినా, గిరీశం లేని కన్యాశుల్కం నాటకమే కాదన్నంతగా పాత్రోన్మలనం సాగింది. గిరీశం నాయకుడు కాదు! అలాగని ప్రతి నాయకుడూ కాదు! గురజాడ లోకజ్ఞత, బహుముఖీనత ఇక్కడే ప్రస్ఫుటమవుతోంది. శతాబ్దాలుగా నాటక లక్షణాలు శతాధిక గ్రంథాలలో నిక్షిప్తం చేసి నాయక, నాయిక, ప్రతి నాయకులతో సాగుతున్న సంప్రదాయాన్ని ఒకే ఒక్క "కన్యాశుల్కం"లో పటాపంచలు చేసి నభూతో నభవిష్యత్‌గా నిలిపిన గురజాడ అసామాన్యుడు. ప్రాతఃస్మరణీయుడు.

గురజాడది తల్లి మనస్సు! కుల మతాలకు అతీతంగా గురజాడను దర్శించాలి' సంకుచిత భావనా చట్రంలో గురజాడను బంధించే పరిస్థితిలో తెలుగు ప్రజలు ఉండకూడదు!! తల్లిలా అందరి శ్రేయస్సును ఆకాంక్షించినవారు గురజాడ. సమాజగత దుర్లక్షణాలను మాతృ హృదయంతో గమనించాడు. ప్రతీ సమస్యను లోతుగా అర్థం చేసుకున్నాడు. అందుకే ఇలా అనగలగారు. "చిన్నతనంలో బొమ్మలాట నేర్చి ఉండుట చేత లోకమనే రంగంలో చిత్ర కోటి రీతులను ఆటాడే మనుష్యులనే పాత్రముల సొగసునే కనిపెట్టడము నాకు అలవాటైనది. సొగసు లేని మనిషే ఉండదు. స్నేహము, ప్రేమ అనాది అయిన్నీ యెప్పటికి సరికొత్తగా ఉండే రెండు వెలుగులను నరుని మీద తిప్పి కాంచితే వింత సొగసులు బయలుదేరతవి. అసూయ అనే అంధకారంలో అంతా ఏకనలుపే!" ఎంత జీవనసారం! అతడి మేధో సంపత్తికి, ఆర్ద్ర హృదయానికి, అనుభూతి తత్వానికి కైమోడ్పులు తప్ప అందజేయడానికి తెలుగు ప్రజలకు, సమాజానికీ, సాహిత్యానికీ భాషలో ఏ భావమూ మిగలలేదు."

జాతి పురోగమనానికి కొత్తదారులు వేసి, గతానుగతికత్వం వదిలి తెలుగు సాహిత్యం సుసంపన్నం చేసి, మానవ స్వభావ పరిశీలనలో అందెవేసిన చేయిగా పేరొందిన గురజాడలో ఒక మార్క్సిస్టు, ఒక విప్లవవాది, ఒక అభ్యుదయవాది. ఒక స్త్రీ వాది, ఒక దళితవాది అంత కంటే గొప్ప మానవతావాది ఉన్నాడన్న సత్యం కాదనలేని వాస్తవం!! ఆ వాస్తవాన్ని గ్రహించి – సమాజం తన గమన నిర్దేశనాన్ని సాగిస్తుందని ఆశించడమే – ప్రయత్నించడమే గురజాడ వారసులుగా మనందరం చేయగలిగిన పని!! ▪

## కవిత

### టర్కీ కవిత

# ఇరవయ్యో శతాబ్దపు ప్రజల గీతం

హిందీ : హసన్ దినామ్
తెలుగు : నిర్మలానంద
సెల్ : 9133510634



ఓ ఇరవయ్యోకటవ శతాబ్దపు ప్రజలారా!
నేను మీ పాట పాడతాను
ఏ యువరాజయినా తన ఉద్యానవనంలో
పచార్లు చేస్తున్నట్టుగా
మీరు భూమి మీద అలా వెళ్తారు!

మీ వ్యక్తిత్వం పైన నా ఆనందం
అత్తరులో వున్న శుద్ధ వస్త్రాలకి మల్లేనే వుంటుంది

అప్పుడు యుద్ధాలు ఉండవు
పోరాటాల పేరు ఊసే వుండదు
మానవుని కనురెప్పల పైకి కన్నీరు వస్తుంది
కాని అది (ఆ కన్నీరు) ప్రేమ తర్వాత,
లేక ఎవరి చావు తర్వాత

ఓ ఇరవయ్యోకటవ శతాబ్దపు ప్రజలారా!
మీరు (అంటే భవిష్యత్తులో) నాలో నుంచి
ప్రవహిస్తూ వుంటారు
నా నాడుల్లో మీ అడుగుల సవ్వడి
అపూర్వంగా వుంటూ
ఈ నిర్మానుష్యమైన రోడ్లపై
ఏ శ్రమా లేకుండా రొట్టెలు తింటూ
నక్షత్రాల వేపు చూస్తూ
మీరు కన్నీరు కార్చారు
మీ పట్టు దుస్తులు సూర్యుని వెలుతురులా
సులభంగా వుంటాయి

ఓ శాంతిమయులైన నేలతల్లి బిడ్డలారా!
మీ జీవితంలో తుపాకులుండవు!
రైఫిళ్ళు వుండవు!
ఏహ్యాభావం ఉండదు!
బీదరికం ఉండదు!

నేను ఆ దినాల్ని దర్శించేందుకు
జీవించి వుంటానా?
నేను మీ భుజంతో నా భుజం కలిపి
భవిష్యత్తుకి సంబంధించిన ఆ రీవైన
రాజమార్గాలపైన
నడవగలనా?

ఏమిటి చంద్రుడూ, నక్షత్రాలూ, మేఘాలూ
నీకు మల్లేనే నాకు సయితం అంత కొత్తగాను
అనిపిస్తాయా?
అపరిచితులైన నా వారసులారా!
నా చేతుల్లోకి మీ చేతులను తీసుకోగలనా?
ఎన్నడూ దుఃఖమూ, లోటునూ తాకని
ఆ మీ చేతుల్లో ఎంతటి వెచ్చని జీవితం వుంటుంది?

ఓ రాబోవు యుగమా!
మీ ధ్యాస రాగానే నేను
పక్షికి మల్లేనే రెక్కల్ని సాచి ఆకాశాన్ని కొలిచేందుకు
ఎగిరిపోతాను!

నాకు తెలుసు, ఈ లోకంలో
మహత్తరమయిన గీతాల్ని పాడుకొంటారు
మీ గీతపు తొలి పాదాన్ని
పాడటం జరుగుతున్నపుడు
అప్పుడు బహుశా నా ఎముకలు సైతం నేలలో
కరిగిపోయి వుంటవి
నా సమకాలీనులకి మల్లేనే
బహుశా మీరు సయితం నా గీతాల్ని
అయిష్టపడవచ్చు
కాని దీనివల్ల ఏం జరుగుతుంది?
మీ జీవితంలో సౌందర్యం మెరిసిపోతుంది
మీ పైన లెక్కలేనంతటి శాంతి నీడ వుంటుంది
మీరు సుఖంగా వుంటారు
అంతే!

---

# ఆలోచిస్తే ఓ క్షణం

- జెబిఎస్ మూర్తి



పరీక్ష తప్పావని ప్రాణత్యాగం
చేశావు
పబ్లిక్ పరీక్ష రద్దు చేస్తే?
తిగిగొస్తావా?
రాగింగ్ భూతానికి భయపడి పై
నుండి దూకేవు
అల్లరి మానిన ఆకతాయిలు అశ్రు
తర్పణాలిస్తే తిరిగొస్తావా?
రుణ భారం మోయలేక ఉరికొయ్యకు
వేలాడేవు
ప్రభుత్వం రుణ మాఫీ చేస్తే?
తిరిగొస్తావా?

బీడు భూములను చూసి గుండె
బద్దలు చేసుకున్నావు
తొలకరికి భూమి పులకరించి
మొలకెత్తితే?
తిరిగొస్తావా?

సమస్యకు చావే కాదు పరిష్కారం
అదే నిజమైతే... మానవ
మనుగడే ప్రశ్నార్థకం!
ఆత్మహత్యలు చేసుకొనే భీరువుల్లారా!
తెలుసుకోండి
కోట్లు కుమ్మరించినా
కొనలేనిది ప్రాణం
మధుర క్షణాలు మీవే...
ఆలోచిస్తే ఓ క్షణం
వేగిరపడితే వేకువరాదు
వేచి ఉంటేనే వేకువ చూడగలం
పోరాడగలం
సాధించగలం

# 2011 తెలుగు సాహిత్యం ఓ విహంగ వీక్షణం



## - దుప్పల రవికుమార్

***ఈ సహస్రాబ్దంలో మొదటి దశకం పూర్తయి రెండో దశకంలోకి అడుగుపెట్టగానే ఏర్పడ్డ రాజకీయ సంక్షోభాలు ప్రజల జీవితాల్లోకి చొచ్చుకు వచ్చి అతలాకుతలం చేశాయి. 2011 ఏమాత్రం ఆ సమస్యలకు పరిష్కారాలు కనుగొనలేకపోయింది. దాని మూలాన జీవితంలో అల్లకల్లోలంతో కూడిన గందరగోళం కొనసాగుతోంది. రాజకీయ, సామాజిక జీవితాల్లో చెలరేగిన తుఫాను సాహిత్య, సాంస్కృతిక వాతావరణంలో కూడా దాని ప్రభావాన్ని చూపిస్తోంది. తెలుగు భాషలోని సృజనశీలురందరూ అందుకు తగ్గట్టుగానే అహరహం శ్రమించి జన జీవితాన్ని అక్షరబద్ధం చేస్తున్నారు. 2011లో తెలుగు సాహిత్య ప్రస్థానం సాగించిన ఎత్తుపల్లాల ప్రయాణాన్ని విహంగ వీక్షణం చేయడమే ఈ వ్యాసం ఉద్దేశం.***

ప్రసారమాధ్యమాలైన దినపత్రికలు తమ సోమవారపు సాహిత్య పేజీల్లోను, ఆదివారపు అనుబంధాల్లోనూ చక్కని, చిక్కని ఆలోచనను పంచే, పెంచే విధమైన కథలు, కవితలు, సాహిత్య వ్యాసాలను ప్రచురించారు. అవికాక సాహిత్య పత్రికలు సైతం తమ విధిని అత్యంత సమర్ధంగా నిర్వర్తించాయి. వీటితో పాటు తెలుగులో తొలిసారిగా ఉపగ్రహ ప్రసారాలతో ఇరవై నాలుగు గంటలూ వార్తలతో అలరించే ప్రైవేటు టీవీ ఛానెల్ సైతం దీనికి చేయూతనందించడం విశేషం. హెచ్ఎంటివి వందేళ్ల తెలుగు కథపై సుప్రసిద్ధ సాహితీవేత్త గొల్లపూడి మారుతీరావుతో వ్యాఖ్యాన సహిత కార్యక్రమాన్ని ప్రసారం చేయడం గమనార్హం. ఇవికాక యథాతథంగా చాలామంది రచయితలు, కవులు, కథకులు తమ రచనలను పుస్తకాలుగా ప్రచురించి సాహితీ ప్రేమికులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది ప్రారంభంలోనే 2010వ సంవత్సరానికి గాను సలీం నవల 'కాలుతున్న పూలతోట' కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందన్న మంచివార్తను అందించింది. ఎయిడ్స్ వ్యాధి, దానిపట్ల భయాందోళనల నేపథ్యంలో యువతరానికి చక్కటి సందేశాన్ని అందించిన నవలగా ఖ్యాతిగాంచిన ఈ 'కాలుతున్న పూలతోట' నవల హిందీలోకి కూడా అనువాదమై దేశవ్యాప్తంగా ఆదరణ పొందింది. తణుకు శ్రీ నన్నయ్య భట్టారక పీఠం ఆధ్వర్యంలో 2010వ సంవత్సరానికి గాను తిలక్ పురస్కారాన్ని ప్రముఖ కవి కొప్పర్తి దక్కించుకున్నారు. మచిలీపట్నం సాహితీ మిత్రుల సంస్థ మినీ కవితా ప్రతిభా కవయిత్రి శైలజామిత్రకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె 'అగ్నిపూలు' మినీ కవితా సంకలనం విడుదల చేశారు. కవిత్వాన్ని తాను శ్వాసిస్తానని, తాను చూసిన జీవితాన్ని అవగతం చేసుకున్న తీరుతోనే తన మినీ కవితలు రూపం సంతరించుకుని ప్రాణం పోసుకున్నాయని ఆమె తెలిపారు. మరొక ప్రతిష్టాత్మకమైన ఈదూరు సుబ్బయ్య సాహితీ అవార్డును కందుకూరి శ్రీరాములు రచించిన 'రావిరూకల' కవితాసంపుటికి అందజేశారు. ఈ కవితా సంపుటి ప్రేమికులందరినీ ఆలోచింపజేసిన కవితలు కలిగినదిగా పేరు పొందింది.

చాసోస్ఫూర్తి సాహిత్య పురస్కారం ప్రముఖ రచయిత, సాహిత్యనేత్రం సంపాదకులు శశిశ్రీకి లభించింది. ప్రతిఏటా తన తండ్రి చాగంటి సోమయాజులును యువ పాఠకులంతా స్మరించుకునేలా చాగంటి తులసి ఒంటిచేత్తో చేస్తున్న సాహితీ యజ్ఞంగా ఈ చాసోస్ఫూర్తి సాహితీ పురస్కార ప్రధానోత్సవాన్ని చెప్పుకోవచ్చు. ప్రతి ఏటా తెలుగు సాహిత్యాన్ని తన రచనలతో సంపద్వంతం చేస్తున్న ఒక కృషీవలుడిని గుర్తించి గౌరవించడమంటే మాటలు కాదు కదా. ఈ ఏడాది అవార్డును అందుకున్న శశిశ్రీ తాను సొంతంగా హృద్యమైన మానవీయ కథలు రాయడమే కాక, మరింత మందిని రాసేలా ప్రోత్సహించే వేదికగా తన సాహిత్యనేత్రం పత్రికను రూపుదిద్దారు. తెలుగు కథలతో పాటు కొన్ని కథల ఆంగ్లానువాదాలను సైతం ఈ పత్రికలో ప్రచురించడం ప్రశంసార్హం. గత ఏడాదికి గాను ప్రసిద్ధి చెందిన డాక్టర్ నాగభైరవ అవార్డు ప్రముఖ కవి దర్భశయనం శ్రీనివాసాచార్య రచించిన వచన కవిత్వం 'నేలగంధం'కు లభించింది. 2010వ సంవత్సరానికి గాను ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డును 'అనంతరం' కవితా సంపుటి రచయిత కోడూరి విజయకుమార్ దక్కించుకున్నారు. 86 కథలతో బాలసాహిత్యంగా ముందుకొచ్చిన 'ఉగ్గుపాలు' సంపుటికి భూపాల్‌కు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. పిల్లల కథలు పేరుతో

వస్తున్న కాకమ్మ కథలు, కల్పితాలు, దెయ్యాలు దేవతల పేరుతో వస్తున్న కథలకు భిన్నంగా పిల్లల కథలను వెలువరించారు భూపాల్. పిల్లల్ని మనసారా ప్రేమించందే సరైన పిల్లల కథలు రావనే నమ్మకంతో రచయిత బాల సాహిత్యంలో శాస్త్రీయ దృక్పథం ఉండాలని కోరుకుంటారు. పిల్లలకు కథల ద్వారానే జీవితం పట్ల అవగాహన పెరుగుతుందని నమ్మే రచయిత పిల్లల సమస్యలకు పెద్దలే పరిష్కారాలు సూచించాలని ఈ కథల సంపుటిని రచించినట్టు ఆయన ప్రకటించారు. ఇక 2011 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడెమీ హిందీ యువలేఖక్ పురస్కారం తెలుగు భాషకు గాను పేరిశెట్టి శ్రీనివాస్ అందుకున్నారు. ఈయన స్వయంగా కవి కావడమే కాక అనేక అనువాదాలను సాహితీ ప్రియులకు అందించారు. గుంటూరు జిల్లా రచయితల సంఘం 2010 వ సంవత్సరానికి గాను సాహిత్య పురస్కారాలను 'ప్రాప్తం' కథల సంపుటి రచయిత విహారికి 'గుండ్లకమ్మ తీరాన' కథల సంపుటి రచయిత కాట్రగడ్డ దయానంద్‌లకు అందజేశారు. తమిళనాడుకు చెందిన ప్రముఖ ప్రగతిశీల రచయిత చిన్నప్పభారతి పేరిట ఆయన ఏర్పాటు చేసిన సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది తెలుగు భాషకు కేటాయించారు. ఈ పురస్కారం 'పొగచూరిన ఆకాశం' కవితా సంపుటి రచించిన అద్దేపల్లికి లభించింది. డాక్టర్ అద్దేపల్లి రామమోహన్‌రావు ప్రసిద్ధ ప్రజాకవి, విమర్శకుడు. ఈ కవితా సంపుటిలో అద్దేపల్లి ప్రపంచీకరణ నేపథ్యంలో సామ్రాజ్యవాద పోకడలను, దేశంపై రాజకీయ ఆర్థిక దుష్ప్రభావాలను, సాంస్కృతిక కాలుష్యాన్ని ప్రతిభావంతంగా అక్షరీకరించారు. ఈ సంపుటిలో ప్రచురించిన కవితలన్నీ కవి నిబద్ధ జీవితానికి, నిరంతర సాహితీ కృషికి నిదర్శనం. ఈ ఏడాది సోమిరెడ్డి జమున స్మారక రాష్ట్రస్థాయి అవార్డుకు మార్కాపురం కవి మంత్రి కృష్ణమోహన్ రాసిన నానీల సంపుటి 'మట్టిపలకలు' ఎంపికైంది. 2011వ సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక డాక్టర్ నాగభైరవ అవార్డుకు ప్రముఖ కవి, రచయిత, సినీగేయ రచయిత రసరాజు ఎంపికయ్యారు. సామల సదాశివగారికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం ఇవ్వటమంటే ఇటు సాహిత్యాన్ని, అటు సంగీతాన్ని సత్కరించడమే. ఉర్దూ కవిత్వ రహస్యాలను ఉర్దూ, తెలుగు పాఠకులకు వందలాది వ్యాసాల ద్వారా అందించారు సదాశివ. అంతేకాక శాస్త్రీయ సంగీతానికి సంబంధించిన గంభీరమైన అంశాలను ముచ్చట్లుగా చెప్పటం వారి ప్రత్యేకత. వారి రచనలో సరళమైన భాషకు నిరాడంబరమైన శైలి పూవుకు తావి అబ్బినట్టుంటాయి. ఆయన రాసిన 'స్వరలయలు' వ్యాస సంకలనానికి ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ప్రకటించింది.

ఇక ఈ ఏడాది విడుదలైన కవితా సంకలనాల ప్రస్తావనకొస్తే దీర్ఘకవితలతో పాటు, మినీ కవితలు, నానీలు, రెక్కలు వంటి అన్ని రకాల ప్రయోగాలు చేయడంలో తెలుగు కవులు ముందుంటారని మరోసారి నిరూపించుకున్నారు. భావంలోను, భాషలోను, పదచిత్రాల ఎంపికలోను, వస్తువు ఎంపికల్లోను కొత్త కొత్తదారులు తొక్కారు. గీతా రఘురామ్ రచించిన 'వెలుగునీడలు' కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. డాక్టర్ విప్లవ్‌దత్ శుక్లా రచించిన 'విపుల' మినీ కవితా సంకలనం విడుదలయింది. కంచరాన భుజంగరావు రచించిన నానీల సంపుటి 'కొంగా! నా గోరు మీద పువ్వెయ్యవా...' ను విడుదల చేశారు. వంగర పరమేశ్వరరావు రచించిన రెక్కల సంకలనం 'ఆశల రెక్కలు' ద్విభాషా సంకలనాన్ని ఆవిష్కరించారు. మనిషిలో మార్పు, తద్వారా సమాజంలో శాంతి పరిఢవిల్లడానికి రెక్కల ప్రక్రియ దోహదపడుతుందనే ఆశతో ఈ ప్రక్రియను తానాశించినట్లు ఆయన చెప్పుకున్నారు. తాత్వికత భూమికగా కలిగిన రెక్కలు అంతర్ముఖ దిశలో మానవున్ని ప్రయాణింపజేసే విధంగా ఉంటాయి. పాఠకులను ఆలోచనా ముద్రలో పడేస్తాయి. ఆలోచనలను సంస్కరిస్తూ, జ్ఞానానికి బాటలు వేస్తాయన్న ఆశ ఈ రెక్కలలో కనిపిస్తుంది. జి. రామకృష్ణ రాజు 'మొగలిరేకులు' కవితా సంపుటిని వెలువరించారు. ఓరుగంటి పురుషోత్తం కవితా సంపుటి 'పుస్తకంలో నెమలీక'ను తన పాఠకుల కోసం అందించారు. సున్నితమైన భావాలకు మరింత సున్నితమైన పదాల అమరిక జతగూడినపుడు కవిత్వం ఎంత మనోహరంగా ఉంటుందో అనుభూతి చెందించే కవితా సంపుటిది. ఇటీవల పదునుగా, విస్తృతంగా కవిత్వం రాస్తున్న కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి రచించిన కవితా సంపుటి 'రాగం పరాగమైన వేళలో ఊపిరి సంతకం' ఆవిష్కరణ జరిగింది. చిన్ని నారాయణరావు 'మాట' దీర్ఘకవిత కావ్యం వెలువరించారు. నెల్లూరు జిల్లా నుండి ఒక నిబద్ధతతో సామాజిక బాధ్యతతో ఆధునిక కవిత్వాన్ని వెలువరిస్తున్న కవుల్లో నారాయణరావు ఒకరు. ఆయన రాసిన ఈ దీర్ఘకవితలో వివిధ సామాజిక చలనాలు ఎలా మాటల రూపంలో వ్యక్తమవుతాయో చిత్రించారు. ఈ కవిత్వం చదువుతున్నప్పుడు మాటలు ఎలాంటి మాజిక్కులు చేస్తాయో పాఠకులకు బోధపడుతుంది. మనిషి క్రమక్రమంగా తన జీవితాన్ని మెరుగుపరుచుకోవడానికి, విముక్తి సాధించుకోవడానికి చేసిన పోరాటాలు, ఉద్యమాలకు ఆధారం మాటలేనని మనకు ఎరుక కలిగిస్తారు. డి.నరేందర్‌రెడ్డి రచించిన 'హంసధ్వని'ని కవితా ప్రియులకు అందించారు. తన కవిత్వంతో అనేక అవార్డులు పొందిన పొత్తూరి సుబ్బారావు మరో కవితా సంపుటిని ప్రచురించారు. ఈసారి మనోహరమైన కవితలు, గేయాలతో కొత్త సంపుటి 'మనోహర దృశ్యం'గా కవి హృదయాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ కవి సంగినేని రవీంద్ర రచించిన "లోలోన..' విడుదల కాగానే సాహితీ ప్రియులను ఆకట్టుకుంది. డాక్టర్ ఎన్.గోపి శరపరంపరగా రాస్తున్న కవితల్లో మరికొన్నింటిని 'రాతి కెరటాలు' గా మరో కొత్త సంపుటంగా ఆవిష్కరించారు. యథావిధిగా తన అభిమానులనే కాక కవులందరినీ తన నిర్మలమైన కవితా సొగసులతో అలరించారు. మంత్రి కృష్ణమోహన్ రచించిన నానీల సంపుటి 'మట్టి పలకలు' విడుదల కావడమే కాకుండా అనేక బహుమతులను కూడా దక్కించుకుంది. ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో ప్రఖ్యాతి గాంచిన ప్రముఖ కవి అలీజహీర్ రాసిన 'సంకేతం' కవితా సంపుటి తెలుగు, ఉర్దూ భాషల మధ్య సంబంధానికి సంకేతంగా వచ్చింది. ఆయన కవితలను జి.వి.రత్నాకర్ తెలుగులోకి అనువదించారు. వైవిధ్య సాంస్క

ృతిక సంఘర్షణలకు ఇదొక ప్రతిబింబం. బూర్జువా, భూస్వామ్యం నుంచి నేటి సమాజం వరకు పరిణామ క్రమానికి ఈ కవిత్వం ఒక సంకేతంగా నిలవగలదు. డాక్టర్ ఎన్.గోపి రచించిన నానీలు తెలుగు కవితా సంపుటికి రష్యన్ అనువాదం పొయిటిక్ మినియేచర్ విడుదలైంది. ఇది మొత్తంగా తెలుగు కవులంతా గర్వించదగ్గ విషయం. రష్యన్ సాహిత్యపు తెలుగు అనువాదాల్ని కొన్ని దశాబ్దాలుగా తెలుగు సమాజం ఎంతో ఆత్మీయంగా, ఇష్టంగా చదువుతోంది. ఇప్పుడు రష్యన్ కవితాప్రియులు సైతం తెలుగులో ఒక కొత్త సాహిత్య ప్రక్రియను ఆదరించి అక్కున చేర్చుకుంటే ఎంతో ఆనందం కదా. సమాజం పట్ల తాను పెంచుకున్న ప్రేమానురాగాలను కవితాక్షరాలుగా, సామాజిక సంక్షోభంలో పెల్లుబికిన వేదనలన్నీ అనుభవాలుగా మలుచుకుని కవిగా ఎదిగిన కెరె జగదీష్ వెలువరించిన కవితా సంపుటి 'సముద్రమంత గాయం'. ఈ కవిత్వం వెనుక రెండు దశాబ్దాల కవిత్వాభిమానం, అధ్యయనం, ఏకాగ్రత, నిబద్ధతలు ఉన్నాయి. 125 సంవత్సరాల కాలంలో 63 కరువులు అనుభవించిన అనంతపురం జిల్లాకు చెందిన కవిగా తన నేలమీద కొనసాగుతున్న జీవన సంక్షోభాన్ని అక్షరబద్ధం చేయాలన్న తపనతో వచ్చిన ఈ కవిత్వం తప్పక పాఠకులకు నచ్చుతుంది.

సత్యభాస్కర్ తన కథలతో 'గమనం' సంపుటిని ప్రచురించారు. పేరుకు తగ్గట్టుగానే తన ఆలోచనల, అనుభవాల పరిణామ గమనాన్ని ఎప్పటికప్పుడు కథనీకరించిన సత్యభాస్కర్ కథాప్రియులను పలకరించారు. పిల్లల్లో ప్రశ్నించేతత్వం పెంపొందించినప్పుడే సమాజాభివృద్ధికి నిజమైన మార్గం ఏర్పడుతుందని 'జహీరాబాద్ పిల్లల కథలు' పుస్తకాల ఆవిష్కరణ సభలో చుక్కారామయ్య అన్నారు. కథా రచన పిల్లలలో మానసిక వికాసానికి, ఉన్నత విలువలు ఏర్పరుచుకోవడానికి దోహదపరుస్తుందని అన్నారు. బాల్యంలో ప్రశ్నించే తత్వమే రేపటి పౌరుల శాస్త్ర పరిజ్ఞాన అభివృద్ధికి అంకురమన్న సంగతి మనం ఎరిగినప్పుడే పిల్లల కోసం, పిల్లల చేత బాధ్యతాయుతమైన రచనలు చేయగలగడమే కాదు చేయించగలం కూడా. మరో సీనియర్ కథకుడు ఎం.ఆర్. వి. సత్యనారాయణ 'ఆమె గెలిచింది' పేరుతో తన కథల సంపుటిని విడుదల చేశారు. హృద్యమైన మానవీయ కథలను అందంగా అల్లగల సిహెచ్ వి. బృందావనరావు 'కొత్తతరం' కథల సంపుటిని ప్రచురించారు. కథావీధిలోకి కొత్తగా అడుగుపెట్టిన వీధుల రాంబాబు రచించిన 'బంతిపూల మాల' బాలల కథల సంపుటి పిల్లలకే కాక పెద్దలకు కూడా ఆసక్తి కలిగించింది. మైనార్టీ రచయిత వేంపల్లి షరీఫ్ కథా సంపుటి 'జుమ్మా' పేద ముస్లింల జీవిత గాథల ఆధారంగా వచ్చింది. పేద తరగతి ముస్లింల జీవితాలను కథలుగా చిత్రీకరించడమే కాకుండా మంచిశిల్పంతో కథలు రాశారని విమర్శకులు మెచ్చుకున్నారు. కళింగాంధ్ర యువ కథాకెరటం మల్లిపురం జగదీష్ ఈసారి పద్నాలుగు కథలతో 'శిలకోల' పేరుతో కథల సంపుటిని ప్రచురించారు. మన పొరుగునే వున్న గిరిజన జీవితం గురించి తెలుగు కథాపాఠకులకు తెలియజెప్పింది భూషణం మాష్టారు, ఆయన స్ఫూర్తితో గిరిజన జీవితాన్ని కథాబద్ధం చేసిన అట్టాడ అప్పలనాయుడు గాని, గంటేడ గౌరునాయుడు గాని కేవలం సహానుభూతితో రచనలు సాగించిన వారే. దీనినొక పెద్దలోటుగా భావిస్తున్న సమయంలో ఆ జీవితాన్ని ప్రత్యక్షంగా ఎరిగిన మల్లిపురం జగదీష్ కథాజగతిలోకి ప్రవేశించడం రెండు చేతులతో ఆహ్వానించదగ్గది. ఆదివాసీ ప్రాంతాలలో మతమార్పిడి కొనసాగుతున్న క్రమంలో సాంస్కృతిక జీవనం ఏ విధంగా దెబ్బతింటుందో, ప్రభుత్వ విధానాలు తమ జీవితాలను ఏ విధంగా అతలాకుతలం చేస్తున్నాయో, ముఖ్యంగా ఆదివాసీ స్త్రీలు తమ జీవనాన్ని కొనసాగిస్తున్న తీరు జగదీష్ తన కథల్లో చిత్రించారు. మధ్యతరగతి పాఠకులకు తెలియని జీవితమది. ఇటీవల 'దుక్కి' కవితా సంపుటితో సాహిత్య ప్రియుల్ని పలకరించి, ఫ్రీవర్స్‌ఫ్రంట్ అవార్డులను స్వీకరించి వెంటనే తన కథల సంపుటి 'నకజనకరి నాం..నా'తో మళ్లీ పలకరించారు చింతా అప్పలనాయుడు. జన జీవితానికి అయిన గాయాల నుండి ఓడుతున్న రక్తాన్ని అనుభవించకపోతే ఇటువంటి కథలు పుట్టడం కష్టం అన్నమాదిరిగా పదహారు కథలతో కళింగాంధ్ర సంక్షుభిత జీవితాన్ని కథనీకరించారు రచయిత. శ్రమ జీవన సౌందర్యం, స్థానిక భాషా తియ్యదనంతో వ్యంగ్యపూరిత వాస్తవాలను ఉట్టిపడేట్టు అప్పలనాయుడు తన కథారచన సాగిస్తున్నారు. కథలన్నీ చదివి ఆలోచించదగినవే. మరో కళింగాంధ్ర రచయిత్రి కె.ఎన్. మల్లీశ్వరి తన బ్లాగు రాతలను జాజిపూలు పేరుతో పర్‌స్పెక్టివ్స్ ప్రచురణగా అక్షర ప్రేమికులను చేరారు. సున్నితమైన భావాలను, సరళమైన భాషలో, లోతైన ఆలోచనలతో ఇప్పటికే కథలు రాస్తున్న మల్లీశ్వరి ఆలోచనలను ఈ పుస్తకం ద్వారా మన ముందుంచారు.

కథకూ నవలకూ కవిత్వానికీ ఉన్న సున్నితమైన తెరల పొరలను చీల్చి అత్యంత సున్నితమైన పద విన్యాసంతో తెలుగు పాఠకులకు మనోవిందు చేశారు తన 'తేరానామ్ ఏక్ సహారా'తో నరేష్ నున్నా, దాస్యం సేనాధిపతి వివిధ సాహిత్య పత్రికలలో ప్రచురించిన పుస్తక సమీక్షలతో 'దర్శనం' గ్రంథం ప్రచురించారు. సాహిత్య ప్రస్థానం సంపాదకులు తెలకపల్లి రవి "శ్రీశ్రీ జయభేరి' పుస్తకాన్ని వెలువరించారు. ఈ పుస్తకం అతికొద్ది నెలలలో మూడు ముద్రణలు పొందడం విశేషం. రాచపాలెం చంద్రశేఖరరెడ్డి గురజాడ రచనలపై తన అభిప్రాయాలను చెప్తూ 'దీపధారి గురజాడ' వ్యాసాన్ని పుస్తకంగా అందించి మన మేధను పెంచే ప్రయత్నం చేశారు. ద్వానాశాస్త్రి, దాశరథి కవిత్వాన్ని మరోమారు పరామర్శించి వెలువరించిన 'నవ కవితా జలధి – దాశరథి' అభిమానులను అలరించింది. ప్రముఖ కవి, రచయిత ఎస్.ఆర్. పృథ్వీ రచించిన 'వ్యాస దీపిక'ను విడుదల చేశారు. కిరణ్‌బాల రచించిన కథా సంపుటి 'కానుక', కవితా సంపుటి 'నా కలల ప్రపంచంలో', నాటి కల సంపుటి 'చందమామ... మామే' మూడు పుస్తకాల ఆవిష్కరణ ఒకే రోజు జరిగింది. ప్రముఖకవి, విమర్శకులు డాక్టర్ రాధేయ రచించిన

విమర్శావ్యాసాల సంపుటి 'కవిత్వం ఓ సామాజిక స్వప్నం' ప్రచురించారు. డాక్టర్ సి.భవానీదేవి ధైర్యంగా 'బొబ్బిలి యుద్ధం' నాటకాన్ని రచించి ప్రచురించారు. సాహిత్య ప్రస్థానం మాసపత్రిక 'దిక్సూచి' పేరుతో ప్రత్యేక సంచికను వెలువరించింది. జూన్, జూలై నెలలకు గాను వచ్చిన ఈ సంచికలో దాదాపు ఏభైమంది మహా రచయితల కలాల నుంచి వెలువడిన వివిధ రకాలైన రచనలు ఉన్నాయి. ఆత్మకథల అనుభవాలు, అభిప్రాయాలు, సలహాలు, సంభాషణలు, సంవాదాలు, లేఖలు, ఇంటర్వ్యూలు, స్వీయ పీఠికలూ ఉన్నాయి. అభ్యుదయ అభివృద్ధి నిరోధక దృక్పథాల మధ్య తేడాను తెలియజేయడం లక్ష్యంగా వెలువడిన ఈ ప్రత్యేక సంచిక వెనువెంటనే మరో ముద్రణ వేయాల్సి వచ్చిందంటే పాఠకుల ఆదరాభిమానాలు ఎంతగా పొందిందో తెలుస్తుంది. ఆగస్టు 13, 14, 15 తేదీల్లో విజయవాడ నగరంలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరిగాయి. తెలుగు కీర్తిని ప్రపంచానికి తెలియజెప్పే కళారూపాల ప్రదర్శనలు జరిగాయి. తెలుగు ప్రజల చరిత్ర, సంస్కృతి, భాషా, ప్రాచీనతలకు సంబంధించిన పురావస్తు ఆధారాలు, చరిత్ర పరిశోధనలో ఎదురవుతున్న సమస్యలు, రేపటి సామాజిక అవసరాలు తదితర అంశాలపై చర్చలు జరిగాయి. అష్టావధానం, కళారూపాలు, రచనలపై విశ్లేషణలు ఇలా తెలుగును దశదిశలా చాటే అన్ని రకాల కళారూపాలను, తెలుగు ప్రశస్తిని, తెలుగు ఔన్నత్యాన్ని చర్చావేదికల ఏర్పాటుతో పాటు, ఇందుకోసం చేపట్టాల్సిన కార్యాచరణను గురించి చర్చించారు.

తెలుగు సాహిత్య వాతావరణంలో మరో ఉత్సవ సంరంభంగా శత జయంతులు నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా మరోమారు ఆయా వైతాళికులను మనసారా స్మరించుకుంటున్నాం. వారి కృషిని ఆవాహన చేసుకుని ప్రస్తుత సమాజంలో అదే స్ఫూర్తిని మరింత నిండుగా తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తాం. జనవరి 2011 నుండి జనవరి 2012 వరకు ప్రముఖ కవి త్రిపురనేని రామస్వామి చౌదరి 125వ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ మీదే ఆధారపడి వుందని, సామాజిక మార్పుకోసం జరిగే పోరాటంలో కార్మిక వర్గమే నాయకత్వం వహిస్తుందని నమ్మిన ఫైజ్ అహ్మద్ ఫైజ్ శతజయంతి ఉత్సవాలు ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరిలో ప్రారంభమయ్యాయి. గజల్ కవితారూపంలో ఎంత ఆరితేరిన నైపుణ్యం గలవాడంటే గజల్ గురించి అంతవరకూ ఉన్న చిత్రాల్ని మార్చి సరికొత్త అనుసంధానాలను ఫైజ్ అహ్మద్ సృష్టించారు. ఆయన కవిత్వం పేద, కష్టజీవుల పోరాటాలకు స్ఫూర్తినిచ్చింది. ఆధునిక కథకు దిశానిర్దేశం చేసిన గురజాడ అప్పారావు 150వ జయంతి వేడుకలు అనేక పట్టణాల్లో జరిగాయి. అప్పటి సమాజంలో చెడు సంప్రదాయాలను ఎండగట్టడమే పనిగా పెట్టుకుని సాహితీ సృజన చేసిన గురజాడను అనేక రకాలుగా ఈ సమావేశాలు స్మరించుకున్నాయి. ఆయన కథలను, కవితలను పునఃపఠనం చేశారు. దివాకర్ల వెంకటావధాని శతజయంతి ఉత్సవం ఈ ఏడాది జరుగుతోంది. ఆయన రచనలు పునర్ముద్రితమవుతున్నాయి.

ఇక కాలం కర్కశంగా కొంతమంది సృజశీలురను తెరమరుగుచేసింది. వారి జీవిత నిష్క్రమణతో మన గుండెలు బరువెక్కినా, ఆ లోటును మనమెప్పటికీ తీర్చుకోలేకపోయినా వారి కృషి మాత్రం మనకు అందుబాటులో ఉండి నిరంతర స్ఫూర్తినందిస్తూనే ఉంటుంది. ప్రముఖ సాహితీవేత్త, కళాప్రపూర్ణ డాక్టర్ జ్ఞానానంద కవి జనవరి 7 కన్ను మూశారు. కళింగాంధ్ర ప్రాంతానికి చెందిన ఈయన ఆమ్రపాలి, గోల్కొండ, క్రీస్తు ప్రబంధం, నా జీవిత గాథ, పిల్లనగ్రోవి, ధర్మాగ్రహము, అక్షరపూజ, పాంచజన్యం తదితర గ్రంథాలు రచించారు. ప్రఖ్యాత తెలుగు కథా, నవలా రచయిత ఎన్.ఆర్. చందూర్ జనవరి 11న కన్నుమూశారు. తెలంగాణ తొలితరం కథా రచయిత గూడూరి సీతారాం సెప్టెంబర్ 25న తుదిశ్వాస విడిచారు. 1936లో కరీంనగర్‌లో జన్మించిన సీతారాం 1950 నుండి కథలు రాయడం ఆరంభించారు. తెలంగాణ మాండలికంలో తొలిదశలో ప్రజాజీవితాన్ని చిత్రించిన కథకులలో సీతారాం ఒకరు. ప్రముఖ రచయిత అవసరాల రామకృష్ణారావు అక్టోబరు 28న తుదిశ్వాస విడిచారు. 1931లో జన్మించిన అవసరాల దాదాపు ఆరు దశాబ్దాల పాటు తెలుగునాట సాహితీ పంటలు పండించారు. హాస్య రచయితగా పేరొందిన ఆయన రచనల్లో వ్యంగ్యం వెనుక జీవన వాస్తవాల గాంభీర్యత కూడా కనిపిస్తుంది. దాదాపు 600 కథలు, 15 నవలలు, ఇతర పుస్తకాలు, మోనోగ్రాఫులు, అనువాదాలు వెలువరించారు. ఇక అనువాదాల ద్వారా తెలుగు సాహిత్య ప్రపంచంలో అడుగుపెట్టి, మధ్యతరగతి మందహాసాన్ని ఒడిసి పట్టి అపురూపమైన కథా రచన చేసి, సినీ ప్రపంచంలోకి వెళ్లి అజరామరమైన చిత్రకథా సంభాషణలను అందించి ఐదారు దశాబ్దాలుగా మన జీవితాల్లో పెనవేసుకుపోయిన ముళ్లపూడి వెంకటరమణ తన కోతికొమ్మచ్చి సీరీస్‌ను పూర్తి చేయకుండానే నిశ్శబ్దంగా మననుంచి తప్పుకున్నారు. తాత్వికతలో ఉన్నత శిఖరాలు అధిరోహించిన డాక్టర్ కొత్త సచ్చిదానందమూర్తి జనవరి 24న, కవిత్వ భాషకు నూతన జవజీవాలందించిన డాక్టర్ వేగుంట మోహన్‌ప్రసాద్ ఆగస్టు 2న, పాత్రికేయానికి నూతన సొబగులు అద్ది, అనువాద సాహిత్యంలో మేలిముత్యాలు అందించిన నండూరి రామమోహనరావు సెప్టెంబర్ 2న, సాహిత్య విమర్శలో మార్క్సిస్టు ప్రమాణాలను పాటించిన డాక్టర్ రాజ్ బహద్దూర్ గౌర్ అక్టోబర్ 6న, సినీ గీత సాహిత్యంలో ప్రజా సారస్వతాన్ని చొప్పించిన జాలాది రాజారావు అక్టోబర్ 14న, సాహితీ కృషీవలుడు ఏల్చూరి విజయరాఘవరావు నవంబర్ 30 మనల్ని వారి సాహిత్య వారసులుగా వదిలేసి శాశ్వత శెలవు తీసుకున్నారు.

కొత్త కొత్త ఆశలతో కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్నాం. మన ఆశల ఆకాంక్షలను నెరవేర్చుకునే ప్రయత్నంలో సాహిత్యాన్ని సమరశీల ఆయుధంగా చేసుకోవడంతో పాటు, జన బాహుళ్యానికి ఆలోచనలను పంచే ప్రయత్నం కూడా దిగ్విజయంగా కొనసాగాలని కోరుకుందాం.


**సెల్ : 7396997910**

**పాంటమ్ కవిత**

# నేల ముక్కలాట !

**- బొల్లిముంత వెంకట రమణారావు**

**సెల్ : 8106713351**



పచ్చని పంటల నేల సాక్షిగా ...
ఇప్పుడు నేలను అనేక ముక్కలుగా కత్తిరించి
కాసుల బేరంతో పంపకాలు జరుగుతున్న సందర్భం
ఊరి చివరన బీడుపడ్డ నేల ఎదురుచూపులు

ఇప్పుడు నేలను అనేక ముక్కలుగా కత్తిరించి
కాగితాల మీద పరచి పాట పాడుతున్నారు
ఊరి చివరన బీడుపడ్డ నేల ఎదురుచూపులు
ఎవరో సొంతం కోసం చూపుల బేరం చేస్తారు

కాగితాల మీద పరచి పాట పాడుతున్నారు
ధరలు ఆకాశానికి నిచ్చెనలు వేస్తాయి
ఎవరో సొంతం కోసం చూపుల బేరం చేస్తారు
భవిష్యత్తులో భూమి బంగారు పంట పండుతుందని

ధరలు ఆకాశానికి నిచ్చెనలు వేస్తాయి
కాసుల బేరంతో పంపకాలు జరుగుతున్న సందర్భం
భవిష్యత్తులో భూమి బంగారు పంట పండుతుందని
సామాన్యుడి కల రుణాల రణం మధ్యన వడ్డీ చెర !

**పాంటమ్ రచనా విధానం ...** *ఈ పాంటమ్ కవితా ప్రక్రియ మలేషియకు చెందినది. ఇది 15 వ శతాబ్దానికి చెందిన ప్రక్రియ. ఈ కవిత నాలుగు భాగాలుగా వుంటుంది. ఒకొక్క భాగం నాలుగు వరుసలు కలిగి వుంటుంది. ప్రతి భాగంలోని రెండవ వాక్యం మలి భాగంలో మొదటి వాక్యంగా మొదలవుతుంది. అలాగే ప్రతి భాగంలోని నాలుగవ వాక్యం మలి భాగంలో మూడవ వాక్యంగా వస్తుంది. కవి భావన శక్తికి అనుగుణంగా ఈ ప్రక్రియ ద్వారా దీర్ఘ కవితగా వ్రాయడానికి ప్రయత్నించ వచ్చు. పై కవిత వాక్య క్రమాన్ని అంకెలలో 1 2 3 4, 2 5 4 6, 5 7 6 8, 7 3 8 9 ఇలా రాయవచ్చు. పాంటమ్ కవిత వరుస క్రమం పైన వివరించడం జరిగింది .*

*గమనిక : ఈ పాంటమ్ కవితా ప్రక్రియను కొందరు ఆంగ్ల కవులు తమ సౌలభ్యం కొసం వాక్య నిర్మాణం మార్చుకొని వ్రాసారు. ఇది మాత్రం అసలు రచన ప్రక్రియ క్రమం.*

---

# బందీ

**- వలందాస్ వెంకటేష్**

**సెల్ : 9490508206**



ఏలికల చేతుల్లో
పత్రికలు...!
సిగ్గులేని రాతలకు
వేదికలు...!
ఫోర్త్ ఎస్టేట్‌ను ఆవరించిన
'నల్ల' మబ్బులు...!
అవి
ప్రజాస్వామ్యానికి
పగుళ్ళు...!

స్వాతంత్ర పిపాసకై
స్వేచ్ఛాగీతం పాడిన
అక్షరం
నేడు అక్రమార్కుల చేతిలో
"బందీ"

అయ్యో...!
పత్రికా స్వేచ్ఛకు
ఎంత కష్టం... ఎంత కష్టం
"అక్షరం" అనంత జ్ఞాన భాండాగారం కావాలి
పత్రికలు చైతన్య కరదీపికలు కావాలి
అవి ప్రజాస్వామ్యానికి ప్రాణం పోయాలి
పది కాలాలు పదిలంగా ఉండాలి

**(పెట్టుబడిదారీ చేతుల్లో పత్రికా వ్యవస్థ బందీ అయిన స్థితిపై స్పందిస్తూ)**

కథ

# భూతవైద్యం



- డా॥ రోశయ్య

**ఒ**క ఊరు. అది చిన్నది కాదు. చుట్టూ పది గ్రామాల మధ్య వెడల్పయిన రోడ్డుకు తూర్పుముఖంగా రెండు దూలాల నడ్డి ఇల్లు. గోడలు మట్టితో నిర్మించి గిలాబు చేసి ఉన్నయ్యి. అందులో ఒక వర్తకుడు పేరు కొండయ్య చిల్లర దుకాణం పెట్టినాడు. కొండయ్య అధిక లాభాపేక్ష లేకుండా పచారి సామానులు అమ్మేవాడు. చిన్నపిల్లలు తల్లులతో వచ్చి మారాము చేస్తుంటే వాళ్ళ చేతిలో చిన్న బెల్లం గడ్డ పెట్టి తినరా అనేవాడు. ఆయనకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు. కొండయ్య భార్య మాలక్ష్మమ్మ కూడా మంచి స్వభావం గలది. దుకాణానికి వచ్చిన వాళ్ళతో భర్త లేనపుడు అన్నా ఏమి కావాలి, వదినా ఏమి కావాలి అని ఆప్యాయంగా మాట్లాడి వాళ్ళకు కావలసిన వస్తువులు ఇచ్చేది. ఆ రోజుల్లో జొన్నలు, సజ్జలు పండేవి. రైతుల వద్ద డబ్బుగా నాణేలు ఉండటం తక్కువ. ప్రతి వస్తువు కొనాలనుకుంటే వస్తుమార్పిడి పద్ధతే ఉండేది. జొన్నలు, సజ్జలు ఇచ్చి తమకు కావలసిన చిల్లర సరుకులు తీసుకొనేవారు.

గ్రామంలో మూఢ విశ్వాసాలు అధికంగా ఉండేవి. ఎవరైనా చనిపోతే వాళ్ళు దెయ్యాలయి పొరుగు వాళ్ళను పీడిస్తారనే పుకార్లు అన్ని చోట్ల వ్యాపించి వున్న రోజులు. ఆ వీధిలో వెంకాయమ్మ అనే నలభై సంవత్సరాల స్త్రీ జబ్బు చేసి రెండు మాసాలు కృశించి చనిపోయింది. సాతాని రామాంజయ్య కుప్పికట్టు ఆయుర్వేద మందులు తప్ప హాస్పిటల్స్ లేవు. చేయి నాడి చూసి వాత మనో – పిత్త మనో జ్వరం తగ్గుద్ది అని ఏవో గోలీలు ఇచ్చి లంఖణం అంటూ అన్నం పెట్టవద్దు అని చెప్పడమో, సొంటి గంధం కళ్ళల్లో వేసి జబ్బు తగ్గిపోద్ది అని చెప్పడం తప్ప మరో గత్యంతరం లేదు.

వెంకాయమ్మ దెయ్యమై ఊరిలో తిరుగుతుందని, నడిరేయి తెల్లని చీరెగట్టి ఇల్లు ఇల్లు తిరిగి ఎవరినన్నా ఆవహిస్తూ ఉంటుందని పుకార్లు షికార్లు ఎక్కువైనాయి.

కొండయ్య భార్యకు రాత్రి పూట కలలో వెంకాయమ్మ వచ్చి ఎదురు రొమ్ము మీద కూర్చున్నట్లు – ఛాతి బరువై కేకలు వేస్తూ మంచం మీద నుంచి లేచి ఏడుపు ప్రారంభించింది. కొండయ్య మీద పిడుగు పడినట్లయింది. తెల్లవార్లు ఆమెకు ధైర్యం చెబుతూ ఓదార్చే ప్రయత్నం చేశాడు. బిడ్డలు, కొడుకులు తల్లి బాధ చూసి దుఃఖంలో మునిగిపోయారు. మాలక్ష్మమ్మ తెల్లవారినా వెర్రిచూపులు చూస్తూ, పిచ్చి పిచ్చి మాటలు వాగుతుంది. తాను వెంకాయమ్మనని, తనకు ఇద్దరు పిల్లలని వాపోతుంది. అంతే చనిపోయిన వెంకాయమ్మకు

ఇద్దరు పిల్లలు ఉన్నారు. జనం వెంకాయమ్మ పట్టిందని మాలక్ష్మమ్మకు ముంత నిండ కణకణలాడే నిప్పులు పోసి అందులో సాంబ్రాణి పొడి గుప్పెడు గుప్పించి ఆమె ముందుపెట్టి "నీకు ఏమి కావాలో చెప్పు వెంకాయమ్మా!" అని వేపమండలతో విసరడం ప్రారంభించారు. ఇంటిలో మాలక్ష్మమ్మ పిల్లలు తల్లి అవస్థ చూసి గుండెలు బాదుకుంటూ ఏడుపులు – కొండయ్యకు ఏమీ పాలుపోవటంలా. ఇలా నెలరోజులు గడిచిపోయినాయి. పచారి దుకాణం అటకెక్కింది. మాలక్ష్మమ్మ రోజు రోజు కృశించిపోతుంది. బలవంతంగా బిడ్డలు అన్నం తినిపిస్తున్నారు.

ఇక ఊళ్ళో వాళ్ళు కొండయ్యకు దెయ్యాలను వదిలించే మంత్రగాళ్ళు ఫలానా ఊళ్ళో వున్నారని వాళ్ళల్లో ఒకళ్ళను పిలిచి బాగు చేయిస్తే మంచిదని సలహాల మీద సలహాలు గుప్పించడం జరిగింది. కొండయ్యకు ఏమీ పాలుపోక బావమరుదులను పొరుగూరు నుంచి పిలిపించాడు. ముందు పిల్లలను చిన్నవాళ్ళను తీసుకెళ్ళమని పెద్దపిల్లను తన వద్ద ఉంచుకుంటానని చెప్పాడు. పెద్దదాన్ని అక్కడ వదలి తక్కిన పిల్లలను తీసుకొని బావమరుదులు వెళ్ళిపోయారు.



ఊరివాళ్ళ సలహా మీద దెయ్యాలు వదిలించే ఒక మాంత్రికుడిని పిలవడం జరిగింది. మాంత్రికుడు గెడ్డం పెద్దగా పెరిగి మెలితిప్పిన మీసాలు, నుదుట రూపాయి వెడల్పు ఎర్రని కుంకుమబొట్టు, కాలికి అందె, చేతికి పెద్ద మురుగులు దండ చేతికి రాగి కడియం, చేతిలో దుడ్డుకర్ర, ఇత్తడి పొన్నుగల దానితో అక్కడకు వచ్చాడు. దయ్యాన్ని పారగొట్టే పూచి తనదన్నాడు. కావలసిన సామానులు లిస్టు ఇచ్చి తనకు అయిదు వందలు ఇవ్వాలని చెప్పాడు. ముందుగానే అయిదు వందల రూపాయలు కొండయ్య వద్ద వసూలు చేశాడు.

అమావాస్య ఆదివారం ముహుర్తం, నాల్గు రోజుల వ్యవధిలోనే ఆ ఆదివారం అమావాస్య వచ్చింది. కొండయ్య ఇంటిలో మధ్య హాలు సామానులు లేకుండా వెనుక గదుల్లోకి పెట్టించాడు. ఆవు పేడతో పగలే అలికించాడు. సాయంత్రానికి ఇల్లు తడి ఆరిపోయింది. బుట్ట ముగ్గు – వీసెడు కుంకుమ – వేపమండలు – పసుపు తెప్పించాడు. ఇల్లు లోపలి భాగం నాల్గు వైపుల ముగ్గుతో కర్రలు మధ్యలో భేతాళుడి బొమ్మ భయంకరంగా ముగ్గు, పసుపు కుంకుమతో తీర్చిదిద్దేడు. కాళికాదేవి బొమ్మను మూడు రంగులతో తయారు చేశాడు. పెద్ద కోడిగ్రుడ్లంత కళ్ళు, జానెడు పొడుగున నాలుక, పళ్ళు, కోరలు బయటికి కనబడేటట్లు బొమ్మల ఆకారాలు. చూసేవాళ్ళ గుండెలు గుభేలుమనేట్లు ఇంటి లోపలి భాగం.

మాలక్ష్మమ్మను తలంటించి వెంట్రుకలు ఆరబోయించి రాత్రి పన్నెండు గంటలప్పుడు ఆమెను లోపల కాళీ భేతాళులు కనబడేటట్లు ముగ్గుమీద కూర్చోబెట్టాడు.

రెండు ఇత్తడి బిందెల్లో కొద్దిగా నీళ్ళు పోసి ఇద్దరిని గుమ్మం బయట రెండు వైపులా కూర్చోపెట్టాడు. జొన్నకర్రల చివర ఊచలు ఎండి వున్న వాటిని మూరెడు పొడుగువి ఒక డజను పుల్లలు వాళ్ళకిచ్చాడు. నీళ్ళ బిందె అంచుమీద దంటు పుల్లను ఆనపెట్టి బిందెలోని నీళ్ళు చేతులతో తడిపి జొన్నదంటును పై నుంచి క్రిందకి వేళ్ళతో లాగేట్లు చేశాడు. రెండు బిందెల నుంచి పెద్ద ధ్వనులు తూముల ధ్వనులుగా అలల్లా ఇల్లు దాటి ఊరి నగానికి శబ్దాలు వ్యాపించినై. జనం దెయ్యాన్ని పారదోలుతున్నాడని ఎవరిళ్ళల్లో వాళ్ళు భయంగా ఉండిపోయారు. కొండయ్య ఏడుస్తూ ఇంటి ముందు వసారాలో కూర్చుండి పోయాడు.

లోపల మంత్రగాడు ఉచ్ఛస్వరంతో ఓం హ్రీం అంటూ గావుకేకలతో కొరడాతో మాలక్ష్మమ్మను కొట్టసాగాడు. "పారిపో", "పారిపో" అనే శబ్దాలు మధ్య మధ్యగా వినిపిస్తున్నాయి. రాత్రి రెండు గంటలు దాటింది. మాలక్ష్మమ్మ 'పోతున్నా', 'పోతున్నా' అంటూ దిశమొలతో తలుపు నెట్టుకొని బయటకు వచ్చింది. 'పోతన్నా' అని కేకలు వేస్తూ వీధిలో అటు ఇటు పరుగెత్తుతుంటే మొండిమొలతో రాత్రిపూట పరుగుపెడుతున్న భార్య స్థితిని చూడలేక కొండయ్య మూర్ఛపడి పోయాడు. పెద్దబిడ్డ తండ్రి మీద పడి ఏడవసాగింది.

మాలక్ష్మమ్మ ఎటుపోయిందీ ఎవరికి తెలియదు. బయటకి వచ్చి చూసినవాళ్ళు లేరు. తెల్లవారింది. నీళ్ళకు మంచినీరు బావికి వెళ్ళిన వాళ్ళు బావిలో శవం తేలడం చూశారు. శవం మహలక్ష్మమ్మది. మంత్రగాడు ఎటుపోయింది తెలియదు. తెల్లవారి పోలీసులు వచ్చి శవాన్ని బయటకు తీసి పంచనామా చేశారు. హాస్పిటల్ పోస్టుమార్టంలో మానభంగం జరిగినట్లు రిపోర్టు.

**సెల్ : 9390279127**

## కవిత

# రెక్కలు

- గోపాలుని వెంకటేశ్వర్లు



తెమ్మెర స్పర్శకు
పులకించి
ఒక్కొక్కటిగా రాలుతూ
పారిజాతాలు -

అనుభవం
పరిమళ సమీరం

సుఖ మరణం
కోరుకుంటే వస్తుందా?
అర్థాంతరపు చావు
వద్దంటే ఆగుతుందా? -

చితి మంటలతో
చలి కాచుకోలేం కదా!

అంత మధురంగా
పాడాలని
ఎలకోయిలకు
గానం ఎవరు నేర్పారో? -

ప్రకృతి
కమ్మని శృతి

ఊహల్లో
జీవిస్తూ
నిజంలో
బతుకుతుంటాం! -

జీవితం
నాటక రంగం

గర్భగుడిలో
అడుగు వేయాలంటే
జాగ్రత్తగా
తలవంచాల్సిందే -

ప్రతి సన్నివేశం
ఒక పాఠమే

వసంతాన్నైతే
అందంగా వర్ణించడం
శిశిరాన్నైతే
విషాదంగా గానం చేయడం -

కవిత్వపు లోతుల్లోనే
తత్వ శిఖరాలు

అహం
అడకత్తెరలో
నలిగిపోతూ
అనురాగం -

ఎంతో చిన్నది
జీవితం

పరువాల చేలపై
పాలపిట్టలు ఎగురుతుంటే
పకపక నవ్వుతూ
పాలకంకులు -

జీవితం
మోహనరాగం

# మట్టి మనిషి

- అచ్చుల
సెల్ : 9704889494




మట్టి మనిషి
ఈ పేరు వినటానికి
ఈసడింపుగా ఉంది కదూ
అసలు
మనిషికి మట్టికి
అనుబంధం
ఈనాటిది కాదు.
సృష్టి ఆరంభం నుండి ఉన్నదే.
మట్టిని నమ్మినవాడు
మట్టిని కొలిచినవాడు
మట్టితోనే మమేకమైనవాడు
మట్టి లేకుండా బ్రతకలేనివాడు
ఇప్పుడు
మట్టికి ధర కట్టి
అమ్మేస్తున్నాడు.
తిండి గింజలు మొదలు
తినే పాత్రల వరకు
మట్టినే గదా
ఆనాడు ఉపయోగించుకొంది

మట్టిని అమ్మలా
చూసుకొన్న చరిత్ర నేపథ్యంలో
మట్టిని అమ్మటమంటే
తల్లిని అమ్ముకున్నట్లేగా.
మనిషి కింత తిండి పెట్టిన మట్టి
రియల్ ఎస్టేట్ వ్యాపారంలో
అంగడి సరుకుగా
రియల్ బిక్కుబిక్కుమంటోంది.
వాస్తవంగా
మట్టితో మనిషికి బంధం
పరస్పరం అవిచ్ఛేదం, అవినాభాజ్యం
మనిషి
ఊపిరి పోసుకున్నది మొదలు
ఊపిరున్నంతవరకు

చివరకు
ఊపిరి విడిచిన తర్వాత కూడ
మట్టిమీదే
మట్టితోనే
మట్టిలోనే
అంతమయ్యేది.
మట్టి ఉంటేనే మనిషి.
మట్టికి
రెక్కలు తొడుగుతున్న
వర్తమానంలో
అన్నదాతలకు
అందకుండా పోతోంది.
మట్టి
వ్యాపారంలో
పెట్టుబడిగా మారి
వ్యాపారుల చేతులో
వస్తువుగా మారుతోంది
మట్టిని జననిలా చూసుకోకపోతే
మనిషిలేదు
మనుగడ లేదు

# నిజరూపాల నిరూపణ, కొనసాగిన కార్యాచరణ



**- తెలకపల్లి రవి**

***ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలు ప్రజలకు ఎంత చేటు తెచ్చిందీ దాచేస్తే దాగని సత్యంలా రుజువు కావడం ఈ ఏడాది ప్రత్యేకత. అవినీతి భారతం అంతు తేల్చాలనే ఆగ్రహావేశాలు సగటు భారతీయుల్లో సర్వసాధారణ మయ్యాయి. ఈ కారణంగానే అన్నా హజారే లోక్‌పాల్ బిల్లుకై నిరాహారదీక్ష ప్రారంభించినపుడు ప్రజలు వేనోళ్ళ హర్షించారు. అయితే ఆయన ఉద్యమానికి వున్న పరిమితులు, కొన్ని పాక్షిక ధోరణులు కూడా గమనించారు. ఎట్టకేలకు ఒక లోక్‌పాల్ బిల్లు ముసాయిదా ప్రవేశపెట్టవలసిన పరిస్థితి పాలక పక్షానికి ఎదురైంది.***

**2011 రౌండప్**

**కా**లగతిలో కరిగిపోతున్న 2011 చివరి ఘట్టం. సమీక్షకూ, సమాలోచనకు సందర్భం. సంవత్సరం పొడుగునా చూసిన సమస్యలు, సవాళ్ళు, సంవాదాలు, సమరాలు, సంచలనాలు సంతోష విషాదాలను బేరీజు వేసుకోవడానికి సరైన సందర్భం. కాలం ముందుకే పోతుంది తప్ప వెనక్కు నడవదు. గడియారాలు ఆగిపోవచ్చు గాని ఘడియలు ఆగవు. పరిణామ క్రమం కూడా అంతే. ప్రతికూలతలను ప్రతిఘటిస్తూ ముందుకు సాగడమే మానవాళి స్వభావం. కట్టుకథలు పటాపంచలు చేసి కఠోర సత్యాలను కళ్ళకు కట్టడం, కల్పనలనూ, కట్టుకథలను కుప్పకూల్చి కఠినతర పరీక్షలకు ప్రజా రాశులను సమాయత్త పర్చడం కాలసూత్రం.

2011నే తీసుకోండి. ధర్నా చౌక్ నుంచి వాల్‌స్ట్రీట్ వరకూ ప్రతి చోటా కనిపించిన దృశ్యం ప్రతిఘటనే. సంస్కరణల పేరిట నల్లేరు మీద బండిలా నడిపించుకుపోవాలన్న నయవంచక పథకాలకు వామపక్ష ప్రజాస్వామిక శక్తుల నుంచి అడుగడుగునా నిరసన వ్యక్తమవుతూ వచ్చింది. అదికూడా పరిమితులలో ఆగిపోకుండా అంతకంతకూ విస్తారమవుతూ వచ్చింది. ఇన్ని సమస్యల మధ్యనా సాధించుకున్న కోర్కెలు నిలువరించిన ప్రమాదాలు చాలా వున్నాయి. వీటిని చూసి బెంబేలెత్తిన సామ్రాజ్యవాదం మరింత తీవ్రంగా విరుచుకుపడుతున్న స్థితి. 2007లో సద్దాం హుస్సేన్ ఉరితీతతో ముగిసిపోతే 2011 కల్నల్ గడాఫీని కడతేర్చడంతో ముగిసింది. అయితే అప్పటికీ, ఇప్పటికీ చాలా తేడాలు. ఇరాక్‌లో తిష్టవేసిన సైన్యాలు ఇంటి దారి పడితే అరబ్ దేశాలలో అనుకున్నట్టల్లా ఆడటానికి అనేక అటంకాలను ఎదుర్కొనవలసిన స్థితి అమెరికాకు ఎదురవుతున్నది. ఆఖరుకు ఉపగ్రహం వంటి పాకిస్తాన్ సైనిక కూటమి కూడా పూర్తిగా లొంగిపోవడానికి నిరాకరించడంతో ఉద్రిక్తత పెరుగుతున్నది. ఇరాక్‌పైన దురాక్రమణ సమయంలో కన్నా ఇప్పుడు ప్రపంచం అమెరికా అసలు వ్యూహాలను అర్థం చేసుకోగలుగుతున్నది. లిబియా తర్వాత ఏ దేశం పైన దాడి చేస్తారో అని ప్రతివారూ ముందస్తుగానే గమనిస్తున్నారు. ప్రపంచాన్ని సముద్ధరించే సత్తా తమకే వుందన్న అగ్రరాజ్యం అప్పులు తెచ్చుకునే పరిమితిపై అంగీకారం కుదరక అస్థిరత్వంలో కూరుకుపోయి ఆఖరులో బయటపడింది. అయితే ఇంతటికీ కారణమైన గుత్త పెట్టుబడిదారీ బహుళజాతి సంస్థల ఆధిపత్యాన్ని ఆక్షేపిస్తూ వారికి గుండెకాయ వంటి వాల్‌స్ట్రీట్‌నే ముట్టడించిన సంఘర్షణాత్మక సన్నివేశం సద్దుమణగలేదు. 2011 పొడుగునా ప్రపంచం చూసిన ప్రతిఘటనలకు ఒక విధంగా అది తలమానికమని చెప్పొచ్చు.

నిన్న అమెరికాకు ధీటుగా నిలిచిన సోషలిస్టు దుర్గం సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై పోయిన తర్వాత ఏర్పడిన రష్యాలోనూ ఇదే పరిస్థితి. తిరుగులేని నాయకుడిగా ప్రచారం పొందిన వ్లదిమీర్ పుతిన్ ప్రజాదరణలో వెనుకబడిపోతే కమ్యూనిస్టులు బలం పెంచుకోవడం కనిపిస్తుంది. చైనా ఆర్థిక సామర్థ్యం పెంచుకుంటూ సంక్షోభాలను, సవాళ్ళను అధిగమిస్తూ తన స్థానాన్ని నిలబెట్టుకోగలిగింది.

లాటిన్ అమెరికాలోనూ ప్రగతిశీల శక్తుల ప్రస్థానం కొనసాగుతూనే వుంది. అన్నిటినీ మించి అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల శిఖరాగ్ర సభ నూతనోత్సాహాన్ని ఇచ్చే విధంగా గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో జయప్రదంగా జరిగింది.

అమెరికాను అంటకాగడం కోసం మన పాలకులు రుద్దిన అణు ఒప్పందం అసలు రంగు కూడా ఈ ఏడాది బయటపడింది. జపాన్‌లో సునామీ తర్వాత అణు విద్యుత్ గురించిన ఆందోళన ప్రపంచమంతటా దట్టంగా అలుముకుంది. పైగా ఒప్పందంలో వున్న షరతులకైనా కట్టుబడకుండా ఇండియాను మరింత లొంగదీసుకునే అమెరికా ఒత్తిడి ప్రభుత్వానికి కూడా ఇరకాటంగా పరిణమించింది. వామపక్షాలు నాడు చేసిన హెచ్చరికలు నిజమయ్యాయని ప్రతివారూ ఒప్పుకోక తప్పని స్థితి. నాడు అణు ఒప్పందం విషయంలో పట్టుపట్టినట్టే ఇప్పుడు చిల్లర వ్యాపారంలో ఎఫ్‌డిఐల ప్రవేశానికి కూడా ప్రధాని మన్మోహన్‌సింగ్ మొండి పట్టుపట్టడం, పార్లమెంట్‌లో చర్చలేకుండానే దాన్ని దేశంపై రుద్దడం తీవ్ర నిరసనకు దారితీసింది. తాత్కాలికంగా పక్కకు పెట్టినా ఏ క్షణంలోనైనా దాన్ని పైకి తీసేందుకు ప్రభుత్వం ఇప్పటికీ సిద్ధంగా వుంది. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు చర్యలు తీసుకోకపోగా చిల్లర బతుకులను కూడా ఛిద్రం చేసే ప్రమాదాన్ని ఈ ఏడాది ఎత్తి చూపించింది. ఈ చివరి ఘట్టంలోనే రూపాయి విలువ పతనం పాలకుల గొప్పలను పటాపంచలు చేసింది. ఆఖరుకు మన్మోహన్‌సింగ్ దేశ పారిశ్రామికవేత్తలను సమావేశపర్చి పెట్టుబడులకు దేశం అనుకూలం కాదన్న అభిప్రాయాన్ని తొలగించాలని వేడుకుంటే ముఖేష్ అంబానీ తాను 70వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడతానని ప్రకటించాడట.

కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కయిన పాలకులు అవినీతికి తలుపులు తెరచి ప్రజా ధనాన్ని, ప్రకృతి వనరులను కూడా ధారాదత్తం చేస్తున్న వైనం అనేక విధాల బహిర్గతమైంది. టుజి స్పెక్ట్రం, కామన్వెల్త్, ఆదర్శ్, ఓబుళాపురం గనులు వగైరా అనేకానేక కుంభకోణాలు అక్రమ వ్యవహారాలు దేశాన్ని కలవరపర్చాయి. ఘనత వహించిన మంత్రులు, ఎంపిలు, ఎంఎల్ఎలు, పరిశ్రమాధిపతులు, అశ్రిత పెట్టుబడిదారులు కన్నంలో దొరికిపోయి కటకటాలు లెక్కపెట్టాల్సి వచ్చింది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలు ప్రజలకు ఎంత చేటు తెచ్చిందీ దాచేస్తే దాగని సత్యంలా రుజువు కావడం ఈ ఏడాది ప్రత్యేకత. అవినీతి భారతం అంతు తేల్చాలనే ఆగ్రహావేశాలు సగటు భారతీయుల్లో సర్వసాధారణ మయ్యాయి. ఈ కారణంగానే అన్నా హజారే లోక్‌పాల్ బిల్లుకై నిరాహారదీక్ష ప్రారంభించినపుడు ప్రజలు వేనోళ్ళ హర్షించారు. అయితే ఆయన ఉద్యమానికి వున్న పరిమితులు, కొన్ని పాక్షిక ధోరణులు కూడా గమనించారు. ఎట్టకేలకు ఒక లోక్‌పాల్ బిల్లు ముసాయిదా ప్రవేశపెట్టవలసిన పరిస్థితి పాలక పక్షానికి ఎదురైంది. పార్లమెంటులో దానిపై జరిగే చర్చతో ఈ తతంగం సమాప్తం కానుంది. బహుశా సమగ్ర రూపంలో ఆమోదించడం తర్వాతి ఏడాదిలో జరగొచ్చు. ఈ సమయంలోనే అన్నా నిరాహారదీక్ష కార్యక్రమంపై ముంబాయి హైకోర్టు చేసిన వ్యాఖ్యలు కూడా గమనించదగ్గవి. పైన చెప్పుకున్న నేపథ్యంలో కార్పొరేట్ చొరబాటును పట్టించుకోకుండా ఆదర్శ సూత్రాల్లా అవినీతి వ్యతిరేకత వల్లించడం వల్ల ప్రయోజనం వుండదని కూడా పుట్ట పగులుతున్న అవినీతి వ్యవహారాలు తేటతెల్లం చేస్తున్నాయి.

ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ దేశ రాజకీయ పటంలో ప్రత్యేక స్థానం సంపాదించింది. వైఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అనేక సంతర్పణలపై న్యాయ స్థానాలు దర్యాప్తునకు ఆదేశించడం సంచలనం కలిగించింది. ఈ కేసులన్ని వాస్తవానికి సరళీకరణ విధానాల దుష్ఫలితాలే. వైఎస్ జగన్‌పై రాజకీయంగా ప్రభావం ఏమిటని ఆలోచిస్తున్నంతగా చాలామంది వీటి వెనుక వున్న విధానపరమైన అంశాలను పట్టించుకోవడం లేదు. ఇవి జగన్‌కే పరిమితమైనవి కాదు. తర్వాత దశలో చంద్రబాబు హయాంలోని లావాదేవీలపైన సిబిఐ దర్యాప్తునకు ఆదేశాలు రావడంతో పూర్తిగా రాజకీయ వాదోపవాదాలు పెరిగి దీని వెనుక వున్న విధానపరమైన అంశాలు మరుగునపడ్డాయి. ఇప్పుడు చంద్రబాబు తదితరులపై దర్యాప్తు తాత్కాలికంగా నిలిచిపోగా మిగిలినవి కొనసాగుతున్నాయి. సిబిఐ గనుక నిజంగా వాస్తవాలు వెలికి తీయగలిగితే, ప్రైవేటీకరణ భజనపరులకు అనేక విలువైన పాఠాలు లభిస్తాయి.

రాష్ట్ర రాజకీయాలలోనూ ఈ ఏడాది అనేక మలుపులు వచ్చాయి. పాలక పక్షం అస్తిత్వ సమస్యలు, ప్రాంతీయ సమస్య కొనసాగింపు వాటిలో ముఖ్యమైనవి. జగన్ స్వంత పార్టీ ప్రకటించుకుని కడప ఉప ఎన్నికలలో విజయం సాధించడంతో ఒక ఘట్టం పూర్తయింది. తర్వాత శాసనసభలో అవిశ్వాస తీర్మానం సందర్భంలో ఆయన బలం వెల్లడైంది. ఇక ఆయన వెంట నడిచిన ఎంఎల్ఎల నియోజకవర్గాల్లో తెలంగాణాలో పార్టీల నుంచి రాజీనామా చేసిన కాంగ్రెస్ తెలుగు దేశం స్థానాల్లో ఉప ఎన్నికలు ఇప్పుడు జరగాల్సి వుంది. దాన్ని బట్టి భవిష్యత్ రాజకీయాలు ఎలా వుంటాయో సూచనప్రాయంగా తెలుస్తుంది. అవిశ్వాస తీర్మానం వీగిపోయిన తర్వాత అధికార పక్షంలో అంతర్గత కలహాలు తీవ్రమవడం, మరీ ముఖ్యంగా మంత్రివర్గంలో ప్రతిబింబించడం ఏడాది చివరలో ప్రస్ఫుటమైంది. ప్రాంతీయ వివాదాలకు సంబంధించి పరిపరివిధాల పాచికలు విసురుతూ గడువులు ప్రకటిస్తూ వచ్చిన కేంద్రం, దానిపై నమ్మకం కలిగించేలా మాట్లాడిన టిఆర్ఎస్‌ల మాటలు నిజం కాలేదు. సకల జనుల సమ్మె తర్వాత కొంత స్థిమితం ఏర్పడింది. 2009లో రగిలిన రావణ కాష్టం చల్లారకుండానే 2011 ముగిసిపోతున్నది. కాకపోతే ఈ అనుభవం ప్రజలకు ఎవరేమిటో తెలియడానికి బాగా ఉపయోగపడింది.

ఇన్ని సవాళ్ళ మధ్యనా వామపక్షాలు ప్రజా సంఘాలు ఉద్యోగ కార్మిక సంఘాలు సమస్యలపై పోరాటాలు సాగించాయి. పలు కోర్కెలు సాధించుకున్నాయి కూడా. అవాంఛనీయ ఉద్రేకాలను పెంచిన పార్టీలే సంక్షోభంలో పడిపోగా భాషా రాష్ట్రాల సూత్రానికి కట్టుబడిన సిపియం ఖచ్చితమైన వైఖరిని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఈ కాలంలో నిరంతరాయంగా జరిగిన ఉద్యమాలకు ప్రచారం రాకపోయినా సంబంధిత తరగతులను కదిలించగలిగాయి. సబ్ ప్లాన్‌కై పోరాటంతో

## కవిత

# ఓ కూనలమ్మా

- ఎస్.ఆర్. పృథ్వి
సెల్ : 9989223245



రైతు వెన్నుకు చీడ
కరువు కాటక నీడ
కూలిపోయె మేడ
ఓ కూనలమ్మా!

పెదాల నవ్వు చెదిరె
పదాల దారి మారె
నిజాల దండజారె
ఓ కూనలమ్మా!

కంటికి కాంతి లేదు
పలుకగ మాటలేదు
మనుగడ జాడలేదు
ఓ కూనలమ్మా!

ఆశలు మొలకలుగ
స్వార్థం మానులుగ
పేదలు ఎద్దులుగా
ఓ కూనలమ్మా!

కాలుష్యం పెరిగె
పచ్చదనం ఒరిగె
మనిషి బతుకు చిరిగె
ఓ కూనలమ్మా!

మోసాలు దండిగ
హృదయాలు మండగ
అవుతుంద పండగ
ఓ కూనలమ్మా!

కలల సౌధాలు కూలె
నిజం నిలువున కాలె
మనిషి రెండుగ చీలె
ఓ కూనలమ్మా!

ప్రణయం బాలలాగ
మోసం జ్వాలలాగ
భవితేమో కలలాగ
ఓ కూనలమ్మా!

సన్యాసిరంగు మారింది
సరసాల పొందుకోరింది
నమ్మకం నీరు కారింది
ఓ కూనలమ్మా!

# రెక్కలు

- మోపిదేవి రాధాకృష్ణ
సెల్ : 9849349516



శ్రమజీవికి
చెమట చుక్కలే
కొండంత
బలం –
నడుం బిగింపులోనే
జీవన సౌరభం

రోజూ
పండుగే
తాగుబోతు
మగడికి –
పూట గడిస్తే
పర్వదినం ఇల్లాలికి!

అందరూ
క్షేమంగా ఉంటే
సమాజం
ఆరోగ్యశ్రీయే –
సరైన వ్రేళ్ళతోనే
ఉక్కు పిడికిలి

లోకంలో
అతి ఖరీదైన
వస్తువు
శాంతం –
కొనలేరు
చందమామని!

సాంప్రదాయ
వృత్తులే
నాగరికతకి
మూలవిరాట్టులు –
పూర్వుల 'పూ'బాటే
దుర్భేధ్యకోట!

భావం
మెరుపుతో
అక్షర
వర్షం –
పొంగిపొర్లేదే
సాహిత్యం!

---

సామాజిక న్యాయ సమరం కొత్త శక్తి కూర్చుకుంది. ఈ సమయంలో కూడా 104 ఉద్యోగుల కోర్కెలపై నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి.

జాతీయంగానూ పశ్చిమ బెంగాల్‌లో సుదీర్ఘ వామపక్ష పాలన తర్వాత ఎన్నికల పరాజయం ఎదురైనా మమతా బెనర్జీ పాలన తొలి దశలోనే విద్దూరపు పోకడలు విదితమైనాయి. కలసి కత్తి కట్టిన మావోయిస్టుల పైనే దాడులు చేసి కిషన్‌జీని హతమార్చడం వంటి ఘటనలు అమానుష రాజకీయాల అనివార్య ఫలితాలను తేటతెల్లం చేశాయి. కేరళలోనూ బొటాబొటీగా గద్దెక్కిన యుడిఎఫ్ పరిస్థితి సజావుగా లేదు. మతతత్వ బిజెపి కొత్తగా కోలుకున్నది. లేకపోగా రకరకాల విభేదాలు గందరగోళాలు దాన్ని వెంటాడుతున్నాయి. కర్ణాటక గనుల భాగోతం, ముఖ్యమంత్రి యద్యూరప్ప అరెస్టు అందుకు పరాకాష్ట. యుపితో సహా అయిదు రాష్ట్రాలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల పోరాటం కూడా దేశ రాజకీయాలను తదుపరి పార్లమెంట్ ఎన్నికల తీరును సూచించనున్నది. కొత్త ఏడాది మొదట్లోనే జరిగే ఆ ఎన్నికలకు ముందస్తుగా యుపిని నాలుగు రాష్ట్రాలుగా విభజించాలన్న ముఖ్యమంత్రి మాయవతి ప్రతిపాదనపై కాంగ్రెస్ బిజెపిల స్పందన వాటి ద్వంద్వ నీతికి అద్దం పట్టింది. భారతదేశంలో భాషా రాష్ట్రాల నిర్నిబంధ పునర్విభజన అంత సులభంగా జరిగేది కాదని అర్థమైంది.

సాంస్కృతికంగానూ, సామాజికంగానూ కలిగిన పరిణామాలు కూడా చెప్పుకోదగినవే. పుట్టపర్తి సాయిబాబా మరణం, అంతకు ముందు సాగిన వివాదాలు, ఆధ్యాత్మికత పేరిట అల్లుకుపోయిన మాయా జగతి మర్మాలను వెల్లడించాయి. ఇప్పుడు అక్కడ సందడి కూడా తగ్గు ముఖం పట్టగా సందేహాలే మిగిలాయి. వస్తు వినిమయ సంస్కృతి పెంచిన వికృతాలకు, నేరస్థ పోకడలకు మహిళపై అత్యాచారాలకు తీవ్ర నిరసన వ్యక్తమైంది. రకరకాల మాఫియాల బారినుంచి మత ఛాందసాల నుంచి సామాజిక జీవితాన్ని రక్షించుకోవాలన్న మెళకువ పెరిగింది. ఈ క్రమంలో మీడియా, న్యాయ వ్యవస్థ వంటివి కూడా విమర్శల బారి నుంచి తప్పించుకోలేకపోయాయి.


అందుకే కఠోర సత్యాలను నిరూపించిన కాలంగా, కార్యాచరణను నొక్కి చెప్పిన కాలంగా 2011ను చెప్పుకోవచ్చు. ఈ అవగాహన రాబోయే ఏడాదిలో కర్తవ్యాలను మరింత బాగా నెరవేర్చడానికి దోహదం చేస్తుందని ఆశించాలి.

■

కథ

# లేళ్ళ మెరక

- దాట్ల దేవదానం రాజు



**వానంటే అసహ్యం.... వానంటే వెగటు.... వానంటే... కడుపులో తిరుగుతున్న గాభరా.... దిక్కుమాలిన వాన.... తోచనివ్వదు... తోచింది చెయ్యనివ్వదు... ఇంకా కొంపలు మునిగినట్లు... ఉరుములు... మెరుపులు.**

భయం... ఒకటే భయం. అర్జున... ఫల్గుణ... గుండెపై ఉమ్మి తుంపరలు.

తను తప్పు చేస్తున్నాడా? కొడుకు మాటల్లో నిజముందా?

వెంకటపతిరాజు ఆలోచిస్తున్నాడు. తెగని ఆలోచనలు దు:ఖానికి దగ్గర దారి.. అయినా సరే... ఆలోచనల పరంపర.

మట్టిని నమ్ముకునే రోజులు పోయాయి. విశ్వాసాలు మట్టి కొట్టుకుపోతున్నాయి. మట్టిని ఒంటికి పూసుకోవడం... మట్టి మట్టి.. అంటూ కలవరించడం..... అనవసరమేమో. మట్టి బంగారం అనుకున్నాడు ఒకనాడు. తరతరాల సేద్యం చేటు చేస్తుందనుకున్నపుడు కొనసాగించడం తప్పే అంటున్నాడు కొడుకు.

చేను వెంబడి తిరిగిన ప్రతిక్షణం అమృత ఘడియే. ఋతువుల భ్రమణం కొత్త ఉత్సాహమై వెలిగేది. దేశం కడుపు నింపే కార్యంలో తనొక గింజనని తలచాడు.

వ్యవసాయం లోని ప్రతిదశ తనకు నేర్పిందెవరు? వయసుతో బాటు అనుభవం కలిగింది. అనుభవాలు పెరిగేకొలది ఎదురుదెబ్బలు తట్టుకునే శక్తి అలవడింది.

విత్తనం జాగ్రత్త చేయడం.... నారుపోసి ఆకుమడి సిద్ధం చేయడం... కన్నబిడ్డలా సాకి ఊడ్చి... పురుగుపుట్రా త్రోలి... కోత కోసి.... పనలు మోపుకట్టి... నెత్తిన మోసి.... కుప్పేసి... నూర్పులు నూర్చి.... సంచులు నింపి .... ఒక తొలకరి.... మరొక దాళ్వాగా... విరామమెరుగని.... ఉరుకులు.... పరుగులు....

కట్టెను కొట్ట పొయ్యిలో పెట్ట అన్నట్టు... అప్పు చెయ్యడం తీర్చడం... ఇంకా మిగిలిపోయే బాకీలు. అయినా తప్పదు. దూకించాల్సిందే బతుకు రథాన్ని. సాంప్రదాయ జీవనాధారం... ఎపుడో మెరుస్తుందనే గంపెడాశ... రైతే రాజనే అభిమానధనం... కొంగ్ర కలిగినవాడే కోటీశ్వరుడు... వట్టిదే... అంతా అబద్ధం.... ఆత్మవంచన.


“చెప్పింది వినవు. నీ మాట నీదే. మొండిపట్టు. కాస్త నిదానించి లోకమెలాగుందో చూడండి. వ్యవసాయం ఇపుడు అక్షరాల జూదంగా మారిపోయింది. ఇది నేను చెబుతున్న మాటకాదు. శ్రమకు తగ్గ ఫలం ఉండదు. రేయింబవళ్ళు ఒకటే టెన్షన్. ఎందుకొచ్చిన తిప్పలు?” కొడుకు రామరాజు పొడుస్తూనే ఉన్నాడు.

పొలం పేరు లేళ్ళమెరక. పని గుర్తింపు కోసం పొలాలకు పేర్లుంటాయి. నందనవనంగా పేరు మారుద్దామనుకున్నాడు.

ఒకప్పుడు ఇచ్చట లేళ్ళు స్వేచ్ఛగా తిరిగేవట. బీళ్ళుగా మారితే రేపట్నుంచి నక్కలు తిరుగుతాయి. చిన్న చెరువు.... గట్టు మీద వరుసగా కొబ్బరిచెట్లు... ఆనుకుని పొలం. అనువంశికంగా వచ్చిన వారసత్వపు నజరానా. బతుకు వెళ్ళదీయడానికీ కొడుకు చదువుకీ ఇదే ఆధారమయ్యింది. హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న కొడుకు... చెవిలో ఇళ్ళు కట్టుకుని ఒకటే పోరు, పొలం అమ్మి తనతో వచ్చి ఉండమని. భార్య లక్ష్మీ వంతపాడింది. తను కోపగించి కసిరితే ఊరుకుంది.

వాడన్నట్లుగానే రెండేళ్ళుగా చేను పరీక్ష పెడుతున్న మాట వాస్తవమే. పరీక్షల్లో నెగ్గినపుడే విజయానందం. పిరికివాడిలా పారిపోతే ఎలా?

ఆకుపచ్చని సౌందర్యం కళ్ళముందు సాక్షాత్కరించే తూర్పుగోదావరి లోని ఈ పరిస్థితి కనీవినీ ఎరుగనిది. చూడగలిగే కళ్ళకు ఇక్కడొక తెలంగాణ ఒక రాయలసీమ ఒక ఉత్తరాంధ్ర కనబడతాయి. అంతటా భూసార విలువల వైవిధ్యమే. ఇక్కడి రైతు సమస్యలు కొట్టిపారవేయదగ్గవి కావు. ఋజువు తానే. ఈ ఏడాది వరి పంట ముప్పూతిప్పులు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించింది. మీట నొక్కగానే బల్బు వెలిగినంత సులువుగా చేలోకి నీరు పోతుంది. కాదన్న వారెవ్వరు? అసలు జరిగిందేమిటి?



పాడు వాన.... పనికిమాలిన వాన.... జావకారు వాన..... అతివృష్టి శాపం....

చేతికందే ఫలం... నిరాశ మిగిల్చిన వైనం.... ప్రకృతి ఆగ్రహం....

తొలకరి పంట పొట్ట మీదుండగా అకాల వర్షం. పంట దిగుబడి తగ్గింది. అంతేనా?

ఆకాశం నిర్మలంగా ఉంది కదా అని కోతలు పూర్తి చేస్తే పిలవకుండానే వచ్చింది వాన. పనలు నీట తేలేంత కుండపోత. ఈడ్చి కొట్టినట్లయింది. గుండె గుభేల్మంది. దిక్కు తోచలేదు. కక్ష సాధింపు అక్కడితో ఆగలేదు. గుండె చిక్కబట్టుకుని నీరు గమ్మున పోయేందుకు సేళ్ళు వేసి చేలో నీటిని దింపాడు. రెండు రోజులు పొడి ఎండ. పన తిరగేశాడు. మర్నాడు కట్టేత పురమాయించాడు. గట్టుకు తెద్దామనుకునేంతలో మళ్ళీ కొట్టింది. మొక్క మొలవకుండా ఉప్పు నీళ్ళు జల్లించాల్సి వచ్చింది.

దిక్కుమాలిన వాన... వానంటే గగుర్పాటు... వానంటే కలవరం... వానంటే గుండె ఒత్తిడి... విరక్తి... చిరాకు..

దిగాలు పడిపోయాడు. నెమ్మదిగా కళ్ళు ఎరుపెక్కుతున్నాయి.

జట్టు కట్టే లేమి లోంచి... ఆశక్తత లోంచి... అయోమయంలోంచి... తన మీద తనకే కోపం...

గడ్డిలో తేమ నిలవ వుండటం వల్ల కుప్ప వేయలేం. మరో దారిలేక కుప్పేస్తే గింజకు పాయ తగిలిందంటే రేటు అడ్డంగా పడిపోతుంది. గిట్టుబాటు లేకపోయినా గత్యంతరం లేక అమ్మడానికి సిద్ధపడితే ధాన్యం బేరగాడు ఇచ్చినపుడే సొమ్ము దక్కుతుంది. నెలల తరబడి అరువుకు తోలాలి. ఈ లోపులో అవసరాలు తోసుకొస్తుంటాయి. డబ్బుకోసం వెతుకులాట. విష వలయ పంజా.. ఇదంతా దండగమారి వ్యవహారంగా తయారయింది. కూలి ఐదొందలు ఇస్తే చేలో వంగుంటాడు. రెండు బస్తాల ధరకు ముగ్గురు కూలోళ్ళు... కొరత... కొరత... మానవ వనరుల కొరత. ఇబ్బడి ముబ్బడిగా ఇతర పెట్టుబడులు.. పెరుగుతూ... సహనం చిట్లిపోతూ....

కూలోడు మెట్టు దిగడు. వర్షం వస్తే ఇంకాను.. ఎవడి ఆతృత వాడిది.

మిల్లోడు మెట్టు దిగే కొంటాడు. దిగుబడి పెరిగితే ఇంకాను. ఎవడైనా జేబు బరువుకే ఆలోచిస్తాడు.

సడలిపోతున్న నమ్మకాల మధ్య... రైతు.
పగులుతున్న విశ్వాసాల నడుమ... రైతు.

...

అస్తమిస్తున్న సూర్యుడు మరీ కాంతివంతంగా వున్నాడు. మేఘాల అంచులు జరీపూతతో మెరుస్తున్నాయి. మామిడిచెట్టు మొదలులో గోనె సంచి పరచుకుని కూర్చున్నాడు వెంకటపతిరాజు. అతని చూపు ధాన్యం రాశి మీద పడింది. కింద బాగా మెత్త వేసి రాశి పోసిన ధాన్యం. ఒత్తుగా గడ్డితో కప్పి పైన కొబ్బరి ఆకుల బరువుంచాడు. తూకం అయ్యాకనే రూపాయల్లో మారకపు విలువ తెలుస్తుంది. అంతదాక కంటి ఉజ్జాయింపుతో ఉత్తుత్తి అంచనాతో లెక్కలు కట్టుకోవడమే. గింజల పోగు గుప్పెడు నోట్లుగా మారిపోతాయి.

వెంకటపతిరాజు సుడులు తిరిగిన గాలికి చెదిరిన గడ్డిని సరిచేసి చేతికర్రతో బలంగా ఒత్తాడు. చేలో గుంపులుగా కొంగలు. వెంకటపతిరాజు పొలం గట్టు దిగాడు. మొలకల చిరునవ్వయ్యే జీవధాతువుని అందించే మట్టిని గుప్పెటలోకి తీసుకున్నాడు. మట్టిలోంచి సన్నగా వినబడే ఊసులుంటాయి. వాటిని వినే ప్రయత్నం చేశాడు. గత రాత్రే ఊరి నుండి వచ్చిన రామరాజు అక్కడకు చేరి తండ్రి వెనుకవైపు నిలబడ్డాడు. తండ్రి చేస్తున్న పనిని గమనించసాగాడు. దూరంగా ఉన్న చెట్టు మీంచి పిట్టలు సామూహిక బృందగానం చేస్తున్నాయి.

వెంకటపతిరాజు అరచేతుల్లోని మట్టి వింత శోభతో ఉంది. ఆ వెలుగు రామరాజు కళ్ళను తాకినట్లనిపించింది.

మెలకువ దాడితో కలలోని అనుభవం మాయమైనట్లు... అంతా భ్రమే.

"ఏం చేస్తున్నావు. నాన్నా అమ్ముడుపోని ధాన్యం ముందు ఎందుకిలా కూర్చున్నావు. వయస్సుకు మించిన శ్రమను నిన్నెవరు చేయమన్నారు? హాయిగా ఇంటి దగ్గర కాలక్షేపం చేసుకుంటే పోలా? అని ఎదురుగా వున్న గట్టు మీద కూర్చుంటూ రామరాజు అన్నాడు.


"రాత్రి నీవు మాట్లాడిన మాటలు నన్నెంతో కలవరపెట్టాయి. నీవన్నది నిజమే కావచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో నూటికి నూరుపాళ్ళు

అంగీకరించే మాటే. అయినా నా మనసుకి సర్ది చెప్పలేకపోతున్నాను. అందుకే నీ బుద్ధి మారాలని మట్టిని ప్రార్థిస్తున్నాను. రైతుకు మట్టే కదా దేవుడు" వెంకటపతిరాజు అన్నాడు.

రామరాజు తండ్రి కేసి చూస్తూ ఉండిపోయాడు.

"రాత్రి టివి వార్తల్లో మంత్రిగారి ప్రసంగం విన్నావు కదా. క్రాప్ హాలిడే చేద్దామనుకుంటున్నది రైతు కడుపు మండికాదట. రాజకీయ శక్తులు ఆడిస్తున్న నాటకమట నిరసనలన్నీ. ధైర్యంగా ఉండండి. అండగా మేం ఉన్నాం అంటున్నాడు. అదంతా సరే. ఊళ్ళో గోల నీకు పట్టదా? ఈ సంవత్సరం ఆరునూరైనా క్రాప్ హాలిడే అమలు జరిపి తీరతారట. పంట విరామం చేసి నష్టపరిహారం కోరతారట. ఎవరైనా ఆకుమడి వేస్తే ట్రాక్టర్‌తో దున్నేస్తారట" రామరాజు అన్నాడు.

"ఆయన్నీ జరిగేవి కాదురా. రైతు జట్టు కట్టి ఉద్యమం చేయడం కలలోని మాట. పక్కోడి చేలో నీరు ఊరి వాడి పంట పాడవుతుందని తెలిసినా నీరు కట్టడం మానడు. ఎవడి స్వార్థం వాడిది. చూస్తుండు. ఏమీ జరగదు. పీతల మంగలం లోని పీతదారే రైతుదీను." వెంకటపతిరాజు స్థిరంగా అన్నాడు.



నెమ్మదిగా చీకటి ముసురు కుంటున్నది.

వెంకటపతిరాజు లేచి నిలబడి పంచె దులుపుకున్నాడు. దండి సత్యాగ్రహం సమయంలో గాంధీగారి గుప్పెటలోని ఉప్పులా మట్టి.

"అన్నీ తెలిసినవాడివి. పొలం అమ్మకం గురించి మరోసారి ఆలోచించు నాన్నా. నా జీవితానికి లోటు లేదు. హాయిగా సంతృప్తికరంగా బతికేంత జీతం వస్తుంది నాకు. ఈ ఎకరం అమ్మేసి మంచి కారు కొనుక్కుంటాను. కాలం గతంలోలా లేదు. మారిపోతున్నది. సాధ్యమైనంత వరకు సుఖంగా సౌకర్యవంతంగా ఉండటాన్నే అందరూ ఇష్టపడుతున్నారు. పిల్లల్ని స్కూలుకి దింపడం కష్టమవుతున్నది. అందరికీ కార్లున్నాయని మనకే లేదని పిల్లలు గోలపెడుతున్నారు. వాళ్ళ సరదా కూడా తీర్చినట్లుంటుంది"అని కాసేపాగి–

"ఊళ్ళో సంగతులు నీకేమి తెలిసినట్లు లేదు. రైతులీసారి పట్టుదలగా ఉన్నారు. క్రాప్ హాలిడే తప్పదనుకుంటున్నారు. అదలా ఉంచి వ్యవసాయం వెలగబెడితే వచ్చేదేముంది?" సూటిగా ప్రశ్నించాడు రామరాజు.

"పిల్ల కాకికేం తెలుస్తుంది ఉండేలు దెబ్బ. అన్నీ జరిగి పంట విరామం చేస్తే సారవంతమైన పొలం బంజరు భూమిగా మారుతుంది. అమ్మకం పెట్టినా ఎవడూ కొనడు. తొండలు గుడ్లు పెట్టుకుంటాయి. అపుడెవరికి కావాలి? వ్యవసాయం మీద ఆధారపడి బతికేవోడు మరో పని చేయగలడా? గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే పొద్దు గడవొద్దా?

"అక్కడే వుంది అసలు కిటుకు నాన్నా. ఆ భయం అక్కర్లేదు. గడ్డు పరిస్థితుల్లో కూడా భూమి రేటు నిలకడగానే ఉంటున్నది. అనంతపద్మనాభస్వామి దేవాలయం నేలమాళిగలో దాచినట్లు డబ్బు బంగారం ఎవరూ దాయరు. భూమి కొనుక్కుంటే స్థిర ఆస్తిగా వుంటుంది. అందుకే భూమి మీద మోజు. పోనీలే ఎట్టి పరిస్థితుల్లోను మార్కెట్ రేటుకి తగ్గించి అమ్మొద్దు. అట్లాంటి బేరం వస్తేనే అమ్ముదాం ఇక. ఇంటికి వెళదాం పద నాన్నా" అన్నాడు రామరాజు.

"నువ్వెళ్ళరా నేను తర్వాత వస్తాను."

రామరాజు వెళ్ళిపోయాడు. వెంకటపతిరాజు ఉస్సురని నిట్టూర్చాడు.

"పిదప కాలం పిదప బుద్ధులు" అనుకున్నాడు.

అడవుల్నీ, సముద్రాల్నీ. నదుల్నీ, కాలువల్నీ, పంట పొలాల్నీ, వంతెనల్నీ దాటుకుంటూ ఆకాశంలోంచి ఊడిపడ్డట్టు నినాదాలతో జఢత్వ ప్రాతినిధ్యం కిందికి దిగి వస్తుందా?

కొత్త శక్తితో కదను తొక్కుతూ రైతులంతా ఒక్కటిగా నిలుస్తారా?

అవునో కాదో వెంకటపతిరాజుకు అవసరం లేదు. చేయదగిన పని మీదే పూర్తి నమ్మకం. సానుకూల ఫలితాలు వచ్చి తీరతాయి. శ్రమ నిరంతరంగా కొనసాగాల్సిందే.

కాలం అన్యాయం చెయ్యదు. పరిస్థితులు తప్పక మారతాయి. రైతు మళ్ళీ రాజవుతాడు. దేశ జనం గుండెల్లో కొలువుంటాడు. వెన్నెముకలాంటి రైతు ఎప్పటికీ వంగిపోడు. రైతుని గౌరవించే రోజులొస్తాయి. రైతు పూజలందుకుంటాడు ఆలోచనలు కొండంత బలాన్ని చ్చాయి వెంకటపతిరాజుకు. ఆయన ముఖంలో అనిర్వచనీయమైన ఆనందం. కోటి జ్యోతుల కాంతి. మనసు తేలికపడిన ఛాయలు.

చిరునవ్వుతో తన పొలాన్ని చూసుకున్నాడు. చీకటిలో సైతం హద్దులు కనిపిస్తున్నాయి. పోగొట్టుకున్న చోటే వెతుక్కోకపోతే వాడు మనిషేకాడు. చీకటిలో చేను చుట్టూ తిరిగాడు. గుప్పెటలో మట్టి అలాగే ఉంది. చేతిని సమాంతరంగా చాపి మరోసారి అనుకున్నాడు, మట్టి అన్యాయం చెయ్యదని.

అకస్మాత్తుగా కళ్ళు చెమ్మగిల్లాయి. ఉబికి వస్తున్న కన్నీళ్ళని తువ్వాలుతో తుడుచుకున్నాడు.

ఆఖరిసారిగా ప్రతిజ్ఞ చేస్తున్నట్లుగా అనుకున్నాడు – 'ఇంత భూమీ నాలుగు చక్రాలు తొడిగించుకుని బిరబిరా కదిలి పోతుందా? రోడ్డు మీద తిరిగే వాహనం అవుతుందా? పెట్రోలు నింపుకుని ఊళ్ళు ఊళ్ళు తిరుగుతుందా? లేళ్ళమెరక నా శరీరంలో ఒక అంగం. ఇది నా ఊపిరి వాడి వెర్రి గానీ నా ప్రాణం ఉన్నంత వరకు దీన్ని వస్తుమార్పిడి చేయడానికి ఒప్పుకోను. నేనూ నా పొలం ఒకరికొకరంగా కాలాన్ని ఈదుతాం."

వెన్నెల్లో వెంకటపతిరాజు చూపు పట్టపగలులా కనబడుతున్నది. ఉల్లాసంగా ఇంటి ముఖం పట్టాడు.

**(సెల్ : 94401 05987)**

## ఆధునిక ఇటలీ కవులు

- సౌభాగ్య
సెల్ : 9848157909



# పియర్ పావొలో పాసోలినీ

## (Pier Paolo Pasoline)

**1922-1975**

**పి**యర్ పావొలో పాసోలినీ నవలా రచయిత, నాటక రచిత, అనువాదకుడు, స్క్రీన్‌ప్లే రచయిత, నటుడు, విమర్శకుడు, సినిమా దర్శకుడు, సెలబ్రిటీ.

ఇన్ని లక్షణాలతో ఈ కవి సుప్రసిద్ధుడు. ఆధునిక ఇటలీ సంస్కృతిలో విశ్వరూప ప్రదర్శకుడు. అంతేకాదు ప్రమాదకారి కూడా.

బాలోగ్నా నగరంలో పుట్టి అక్కడి యూనివర్శిటీలో చదువుకున్నాడు. యుద్ధానంతరం యువకుడుగా వున్న ఈ కవి ఉత్తర ఇటలీ మాండలికంలో రచనలు చేశాడు. మొదట్నుంచీ పేదల పట్ల సానుభూతి వున్నవాడు. అతని మొదటి నవల 'రాగజ్జి'. వీధుల్లో తిరిగే అనాధ అయిన అల్లరి కుర్రాడి జీవితం అందులో ఇతివృత్తం. తీవ్ర సంచలనం కలిగించిన నవల అది. అతని నవలల్లో, సినిమాల్లో ఇతివృత్తాలన్నీ రాజకీయాలతో ముడిపడి తీవ్ర వైరుధ్యాలకు, చర్చలకు ఆస్కారమిచ్చేవి.

పాసోలినీ 'నేను జాలిని నమ్మను' అన్నాడు. అతని కవిత లయాత్మకమైంది. 1957లో 'ద యాషెస్ ఆఫ్ గ్రామ్‌స్కీ' అన్న అతని మొదటి కవితా సంపుటి వెలువడింది. అందులో రాజకీయ ప్రేరణ వుంది. తరువాతి రచనల్లో వ్యక్తిగత విషయాలు, సామాజిక లైంగిక వైరుధ్యాలు వస్తువులుగా వున్నాయి.

1970లో ఎంపిక చేసిన తన కవితల సంపుటికి ముందుమాట రాస్తూ 'నేను దుఃఖాన్ని వ్యతిరేకించడానికే నా కవితల్ని ఉద్దేశించాను. బాధలకు వ్యతిరేకంగా రాయడానికి ప్రయత్నించాను. భాషలో కూడా దుఃఖముంది. దానికి కూడా వ్యతిరేకంగా రాశాను. అదే కొందర్ని నేను దృష్టిలో పెట్టుకుని ఉంటే, అంటే అట్లా కొందర్ని దృష్టిలో పెట్టుకుని రాసి వుంటే వాళ్ళు నన్ను గాఢంగా అభిమానించేవాళ్ళు. ఈ రకంగా నన్ను విమర్శించే వాళ్ళు కారు, ద్వేషించేవాళ్ళు కారు' అని వాపోయాడు.

## నా తల్లి గురించిన ప్రార్థన

కొడుకు మాటల్లో చెప్పాలంటే చాలా కష్టం
నేను నా హృదయంలాగా చాలా చిన్నవాణ్ణి
ప్రపంచంలో అన్నిటికన్నా ముందు నాకు తెలిసిన దానివి నువ్వు
అన్ని ప్రేమల కన్నా ముందు నాకు అందిన ప్రేమ నువ్వు
కాబట్టి ఒక దారుణమైన సంగతి నీకు తెలపాలనుకుంటున్నాను
నీ అనురాగం నించే నా ఆగ్రహం ఎదుగుతూ వచ్చింది
నీకు ప్రత్యామ్నాయం లేదు
నీ వల్ల నాకు వచ్చిన జీవితం ఒంటరితనాన్నిచ్చింది
నాకు ఒంటరిగా వుండటం ఇష్టం లేదు
ప్రేమ కోసం నేను పరితపిస్తున్నాను
ఆత్మల్లేని శరీరాల కోసం అల్లాడుతున్నాను
ఆత్మ నీలో వుంది, నీ లోపల వుంది, అది నువ్వే
అయితే నువ్వు నా తల్లివి
నువ్వు నా బానిసత్వాన్ని ప్రేమిస్తావు
జీవితాన్ని నేను బానిసత్వం నుంచే చూడాల్సి వచ్చేది
అదంతా ఇప్పుడు అంతమైంది
మనం బతికి బట్టకట్టాం
జీవన అయోమయంలో హేతువుకు బయట పునర్జన్మించాం
నేను ప్రార్థిస్తున్నా... చనిపోవడాన్ని కోరుకోకు
నేనిక్కడ ఒంటరిగా వున్నాను, నీతో వున్నాను.

## కవిత

# ప్రయాణం



- కె. ఆనందాచారి
సెల్ : 9948787660

ప్రయాణమెప్పుడూ ముందుకే
నది నేలను వొరుసుకు పోతున్నట్టుగా
సంఘర్షణ, సంగ్రామాలతో నిరంతరం
సాగుతూనే వుంటుంది!

చినుకు చినుకు పారి
కాలువలై చేరిన నదీ ప్రవాహంలా
జీవితమూ ఓ ప్రవాహయానం!
ప్రవాహంలో నీరు స్వచ్ఛమైనట్లుగా
నిత్య ప్రయాణంలో
మనిషి మనిషిగా రూపెత్తుతాడు!

ఉపద్రవాలెన్ని ఉప్పెనలెత్తినా
ఉగ్రమై ఉప్పొంగుతూ
నది కదిలేది – వడివడిగా ముందుకే
ఎదురుపడ్డవాళ్ళను
ఎదుర్కొనే ధైర్యపుటాయుధాలతో
మనిషి ప్రయాణంలా!

పార్ధ నిత్య చలన గమనాల్లో... రాపిడిలో...
శబ్దించి ఉద్భవించిన విశ్వరూపంలా
కణ ప్రయాణ ఘటనయే కదా
అండాకృతిలో చైతన్య రూపానికి
ప్రాణం పోసింది!

ఈ పృథ్వీ ప్రయాణమే చీకటి వెలుగుల
ఋతురాగాల్ని రసాన్వితం చేసింది!
లేలేత చేతులను, నేలపై నిడుకొని శిశువు
వేసిన తప్పటడుగుల ప్రయత్నాల ముద్రలు
తొలి ప్రయాణ పొద్దు గుర్తులేగా!

ప్రయాణమే కదా పాదాలకు
యీ రూపం తొడిగింది
ఎన్నో ప్రయాణాలలో.... కాలాలలో
పోగుపడ్డ జ్ఞాన సముదాయం
నాగరికతా నిర్మాణాలలో
యెన్ని మైలురాళ్ళను దాటలేదు?

పొద్దుటే నిద్దుర లేచిన కూలీ చేతులు
పలుగు పారతో చేసిన ప్రయాణమే కదా!
శ్రమ సుందరమై సంపద రాశులు పోసింది!
ప్రయాణమే అనుభవాల పాఠాలను
అక్షీకరించింది!
విజ్ఞాన శిఖరాలను అధిరోహించింది!

ఎవరో మొదలేసింది కాదు
ఈ ప్రయాణ చలనం
ఎవరూ ఆపలేరు దీని గమనం!

ప్రయాణం నిత్య యవ్వన ఝరి!
ప్రయాణం నవ్య సంగీత మంజరి!
ప్రయాణంలోనే కాలం పురుడు పోసుకుంది!
వేగం కొలత గీసుకుంది!
ప్రయాణంలోనే స్నేహం ఎదను
తడుతుంది!
ప్రయాణంలోనే ప్రేమ పదిలపడుతుంది!

మన ఉనికి ప్రయాణమైనపుడు
నిరంతర ప్రయాణంలోనే మనం–
కాలపు శ్వేతపత్రాలపై
ఆశల, ఆశయాల కలల్ని
వర్ణాలతో చిత్రిస్తూ, రచిస్తూ
ముందుకే – మున్ముందుకే పయనిస్తాం!





# నేను మరణించే రోజు

ఏదో ఒక నగరంలో
'ట్రస్టీ'లో కావచ్చు, 'యుడినీ'లో కావచ్చు
వసంతంలో ఆకులు వాటి వర్ణాన్ని మార్చుకున్నప్పుడు
మండే సూర్యుడి కింద నా మరణాన్ని వొదిలి పెట్టాను
నా కళ్ళు మూసుకుని
ఆకాశాన్ని దాని కాంతికి దాన్ని వొదిలిపెట్టాను
వెచ్చని ఆకుపచ్చని నిమ్మ చెట్టుకింద
నా మరణపు చీకటిలో నేను పడిపోయాను
నేను కోల్పోయిన కాంతిలో, ఉంగరాల ముంగురుల్తో
అందమైన పసివాళ్ళు స్కూలు నుంచీ పరుగెడుతూ పోతున్నారు


శక్తివంతమైన పనిముట్టు రోదన నుంచి
పర్వతం అంచులో చిన్నిపిల్లిలాగా
నగరానికి దూరదూరంగా దుమ్ములో నేను నివసిస్తాను

అది గ్రామీణ వాతావరణం
ప్రతి దినం అక్కడ నెమ్మదిగా కదుల్తుంది
చావు శబ్దంతో బస్సులు పోతూ వుంటాయి
ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని వదలి వెళుతూ వుంటాయి
దట్టంగా వున్న పొగమంచులో దడ పుట్టిస్తూ వెళతాయి
వాటి వెనకే కాగితాలు పరుగెడతాయి
బస్సులు ఇరుకు సందుల్లో, బురద నేలలో సాగుతాయి
బస్సులు వెళ్ళినప్పుడల్లా
పలకరించడానికన్నట్లు కర్టెన్లు కదుల్తాయి
పళ్ళమ్మేవాడు, చిత్తు కాగితాల వాడు
వెళుతూ వుంటారు
బస్సు ఒక మురికివాడ నించీ
యింకో మురికివాడ వేపు వెళుతుంది

- పియర్ పావొలో పాసోలినీ



## నచ్చిన పుస్తకం




# చీకటి రోజుల వెలుతురు జాడలు

**- డా॥ బి.వి.ఎన్. స్వామి**

**బ**యటి దేశాల వల్ల, ఆంతరంగిక అభద్రత వల్ల దేశ సార్వభౌమత్వానికి ముప్పు ఏర్పడే పరిస్థితులు వచ్చాయని తలచినప్పుడు విధించేది అత్యవసర పరిస్థితి లేదా ఎమర్జెన్సీ. ఈ సాకుతోనే ఇందిరాగాంధీ ప్రభుత్వం 1975లో ఎమర్జెన్సీ విధించింది. లోతుల్లోకి వెళితే తన అధికారం కోసం దేశ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఫణంగా పెట్టిందని అర్థం అవుతుంది. ఆ రోజుల్లో సంపూర్ణ విప్లవ రాజకీయాలు దేశమంతా వీస్తుంటే, సాయుధ విప్లవ పోరాటాలు తెలంగాణాను అతలాకుతలం చేశాయి. ఎమర్జెన్సీ పేరు మీద ఢిల్లీ అధికార పీఠం ప్రజలపై ఉక్కుపాదాన్ని మోపింది. ప్రాథమిక హక్కులు పత్తా లేకుండా పోయాయి. తెలంగాణాలోని విప్లవకారులకు, సానుభూతిపరులకు నిత్య నిర్బంధం సహజ విషయమైంది. ఎమర్జెన్సీ వల్ల వచ్చిన అధికారం నిర్బంధ హింసను చట్టబద్ధం చేసింది. దాంతో తెలంగాణాలోని రచయితలు, బుద్ధిజీవులు డిటెన్యూలుగా జైళ్ళలో మగ్గిపోయారు. ఈ విషయాల్ని నేపథ్యంగా చేసుకొని వచ్చిన సాహిత్యం తక్కువ. నవీన్ నవల చీకటి రోజులు, కొంత కవిత్వం తప్ప ఎక్కువ సాహిత్యం తెలంగాణాలో రాలేదు. ఆ ఖాళీని తాడిగిరి పోతరాజు రాసిన "కెటిల్" (ఎమర్జెన్సీ కథలు) పూరించింది.

కెటిల్‌లో ఎనిమిది కథలున్నాయి. మొదటి, చివరి కథ తప్ప మిగతావి జైలు లోపలి కథలు. మొదటిది లాకప్ జైలు కథ. లాకప్‌లోను జైలులోను జరగని అజ్ఞాత ఉద్యమ జీవి ఆత్మహత్యను ఆకలి నేపథ్యంగా చివరి కథ చిత్రించింది. ఎమర్జెన్సీ వల్ల జైల్లో మగ్గిన వారికి, వారి కుటుంబ సభ్యులకు చేదు అనుభవాలున్నాయి. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ప్రజల ఆచరణ ఈ కథలకు నేపథ్యాన్ని సమకూర్చింది. డిటెన్యూగా ఉన్న భర్త కోసం వచ్చి, అత్యాచార యత్నానికి గురైన భార్య, కొడుకును చూడటానికి వచ్చి కాయితం ఎట్లా రాయించాలో తెలియక, ఇంటర్వ్యూ దొరకక ఇంటికెళ్ళి పలవరించి, పలవరించి తనువు చాలించిన తల్లి ఆవేదనలు ఆనాటి పరిస్థితులకు సాక్షీభూతాలు.

కన్న కొడుకును ఏ పోలీస్ స్టేషన్‌కు తరలించారో తెలియక, తెలియని హైదరాబాద్ మొత్తం తిరిగి, కొడుకును చూడలేకపోయిన తండ్రి పక్షవాతంతో మంచం పట్టడం, కొడుకులు ఎన్‌కౌంటర్ అయ్యారని తెలిసిన తండ్రులు, తమ పిల్లల్ని ఏకంగా స్థూపంలో చూసుకున్న తల్లులు, జైల్లో ఉన్న కుటుంబ సభ్యుణ్ణి చూడాలని ఆసక్తి వున్నా, చూడ శక్తి చాలక, అతణ్ణి కోల్పోయామనే భావనలో మనసు చంపుకున్న పరివారం కథల నిండా కనపడతారు. జైలులో ఉన్నవారు తల్లి, దండ్రి, భార్య, భర్త పిల్లలతో మాట్లాడుతున్నపుడు నిఘా కోసం పోలీసులు వారి మధ్యలో ఉండటం వల్ల జైలు బయటి వారికి కూడా జైలు అంటే ఎంత దుఃఖమో తెలిసి వస్తుంది. జైలు లోపల, బయటా మొత్తం దేశం అంతా జైలుగా మారిన స్థితిని కథలు విడమరుస్తాయి. విప్లవ రాజకీయాలతో సంబంధమున్నా వారిని కుదుళ్ళతో సహా పెకిలించడానికి హింసను ఉపయోగించారు. అందులో భాగంగానే ప్రాణంలేని "కెటిల్"ను కూడా నాశనం చేయడం గమనించవచ్చు. ఇవన్నీ ఎమర్జెన్సీ కాలపు ఆనవాళ్ళు.

దేశానికి ముప్పు వాటిల్లింది. దేశంపై అత్యవసర పరిస్థితి పడగ విప్పుకొంది. దేశం జైలు కెళ్ళింది. నియంత ఆర్డినెన్స్, రాజ్యాంగ సవరణలు ఉచ్చులల్లుతోంది. అవి స్వతంత్ర భారతదేశంలో జైళ్ళు కళకళలాడుతున్న మహోజ్వలమైన రోజులు. ఇవన్నీ ఎమర్జెన్సీ గురించిన విశేషణాలు... ఈ వాక్యాల్లో రచయిత ఆవేదన తొంగిచూస్తుంది. స్వయంగా రచయిత కూడా బాధితుడే కనుక నాటి విషయాలను, చైతన్యాన్ని, నిబద్ధత గల వ్యక్తులను, రాజకీయాలను, పెరోల్ కోసం పడే పాట్లను, విప్లవ సానుభూతిపరుల ఏర్పాట్లను, సమాజమే సంకెలగా మారిన విధానాన్ని కథలలో చూపించాడు. కథల్లో కనిపించిన ఉత్తరాల్లో నాటి ప్రజా జీవితం ప్రతిబింబిస్తుంది. కొన్ని కథల్లో కథారంభపు, ముగింపు వాక్యాలు ఒక్కటిగా ఉండటం యాదృచ్ఛికం కాదు. అవి కథ పటిష్టత కోసం కథకుడు అనుసరించిన మార్గం. "బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి" లాంటి పాటలు సందర్భోచితంగా కనిపిస్తాయి. తాడిగిరి పోతరాజు చేయి తిరిగిన రచయిత కనుక నిష్ఠుర నిజాలను కళాత్మకంగా చెప్పి పాఠకులకు చరిత్రను సుబోధకంగా అందించారు. కథల్లో వర్ణనల ద్వారా భౌతిక పరిసరాలను, మానసిక వేదనలను ఆవిష్కరించారు. మొత్తంగా నాటి ప్రజా జీవితాన్ని రూపు కట్టించారు.

**సెల్ : 92478 17732**

## వైరాతలు (నానీలు)

- డా॥ వై. రామకృష్ణారావు

సెల్ : 8985743964



హృదయం
స్ఫటికమైతే బాగుండు
అన్ని రంగులూ
బైటపడతాయి

దేవుళ్ళందరి చేతుల్లో
ఆయుధాలు
లైసెన్సులిచ్చిన
అధికారెవరు?

కొండ
భోరున ఏడుస్తోంది
మెరుపు కొరడా
తగలిందేమో!

ముంగురులపై ముత్యం
పెదవి మీద పగడం
ఉనికిని బట్టి
చినుకు

బాల్యం
ఖర్చయిపోయింది
మళ్ళీ అప్పుగా ఇమ్మని
కాలాన్ని వేడుకొంటున్నా

## నిశ్శబ్ద నేస్తం

- బి.బి. సుబ్రహ్మణ్యం

సెల్ : 9490012215




ఎన్నో
పుటల సారాంశం
ప్రతి అడుక్కి
పరిచిన ఎర్రతివాచి
ఒంటరితనాన్ని
ఒలిచి..
నిరంతరం సంభాషించే
నిశ్శబ్ద నేస్తం..
నడిపించే అదృశ్య హస్తమే
కరదీపిక..
ఆదివారం...
అబిడ్స్‌లో దొరికిన
అపురూప గ్రంథం
నెత్తిన కిరీటమవుతుంది
పుస్తకం...

పాతదైతే
తల్లి ఒడిలోని
పసిపిల్లవుతుంది
పఠనమే వ్యసనమై
రెప్పవాల్చిన గుండెపై
జోలపాటగా మారుతుంది
కానీ,
గతాన్ని నెమరేస్తూ..
ఈ దుష్టత్వ సమాజం
ప్రసవించిన
నాగరికతలో
పాఠకులు లేక
ఎడారిలా
కుమిలిపోతున్నది
పుస్తకం..

## శ్వాసించే విగ్రహం...

- సంగెవేని రవీంద్ర



వాడు ఆకలి కత్తంచున
వేలాడుతున్నాడు...
మాంత్రికుడి ప్రాణం చిలకలో ఉన్నట్లు
వాడెక్కడున్నా జీవమంతా
ఖాళీపేగుల ఖైదులో చిక్కిన
తన వారి చుట్టే...!
కదిలి కదిలి కరిగి కరిగి
పోరాడి, వేటాడి కరిగిపోయిన
మైనం ముద్దలా వాడిప్పుడు
శ్వాసించే విగ్రహమయ్యాడు...
దేహాల వనాల్ని బహిష్కరించిన
వాడి గుండెలో నిప్పుల పొదలు...
చూపుల్ని స్థిరంగా పాతుకున్న
వాడి కళ్ళల్లో కనిపించని సునామీలు..
జనం చేసే వెకిలిగింతలు, వెధవ జోకులు
వాడికి కనబడతాయి... వినబడతాయి...
వాడు స్పందించడు...
ఆకలితో వాడు చేసే యుద్ధంలో
కదలకపోవడమే పదునైన ఆయుధం...
వాడ్ని కదిలించి ఓడించేందుకు
చలువ అద్దాల వాడు మనల్ని
శిఖండిగా వాడి ముందు నిలబెడతాడు...
వాడు కాస్త కదిలితే మనం గెలుస్తామేమో...
కానీ వాడు కదలడు...
వాడూ, వాడి కుటుంబం చుట్టూ ఆకలి పహరా...
గడేసిన బతుకు గదుల్లో
లోలకంలా కదులుతున్న మనల్ని చూసి
వాడు జాలిపడతాడు...
బాంబు పక్కన పడినా కదలని
ఆకలి విజయం వాడిది.
చీమ చిటుక్కుమన్నా ప్రాణభయంతో
పరుగెత్తే వెకిలి ఓటమి మనది...!
వాడికీ కదలాలనే ఉంటుంది...
కానీ... ఓడాలని లేదు...
అందుకే వాడు కదలడు...!

**(అమ్యూజ్‌మెంట్ పార్కుల్లో 'శ్వాసించే విగ్రహాలు' (Living Statue)గా కొందర్ని గంటల వారీగా జీతాలిచ్చి వినోదం కోసం నిలబెడతారు. వారిని తాకకుండా మనం ఎంత గింజుకున్నా వాళ్ళలో కదలికలు ఉండవు. వాళ్ళను కదిలించినవారికి పార్కు వాళ్ళు బహుమతులిస్తారు. కదిలితే ఆ బహుమతుల మొత్తాన్ని వారి జీతాల్నుండి కోస్తారు... అందుకే వాళ్ళు కదలరు...)**

## స్పందన

# సమాజయజ్ఞం స్వేదర్శి కాళీపట్నం

**- రామతీర్థ**


కాళీపట్నం రామారావు

**తన వ్యాసం ఆరంభం నుంచీ ఇంతకు ముందు తెలియని కొత్త విషయాలు  తాను చెప్తున్నానన్న ఎరుక విద్యాసాగర్ బలంగా కలిగి వున్న విషయం స్పష్టంగా తెలుస్తూనే వుంది. ఈ తెలివిడి ఈవ్యాసం ద్వారా ఏం సాధించిందీ అన్న ప్రశ్న, సాహిత్య పరిశీలనా, లేక విమర్శా ప్రమాణాలు మెరుగుపడ్డాయీ అన్న ఆలోచనా సాహిత్య స్పృహ గల పాఠక లోకానికి తలఎత్తడమూ సహజమే.**

"**యజ్ఞం**పై మరోసారి" విద్యాసాగర్ సుదీర్ఘ వ్యాసం (నవంబర్, 2011 సాహిత్య ప్రస్థానం సంచికలో) విషయం చెప్పిన తీరులో, కథా రచయిత అయిన కాళీపట్నం రామారావు (కారా మాస్టారు) పట్ల కనీస ఆదరణ లేకుండా రాసిన తీరు విస్మయానికి గురి చేసింది. వ్యాసం మొత్తంలో ఎక్కడా కారా మాష్టార్ని పేరుతో ప్రస్తావించకుండా, తాను నిర్దేశించుకున్న తీరాలకు, తన కాగితపు కత్తిపడవ నడుపుకుంటూ వెళ్ళిన యువకుడిలా విద్యాసాగర్ కన్పిస్తాడు. వ్యాసం పూర్తి చేశాక దాదాపు యాభై ఏళ్ళ వయస్సు గల కథ గురించి, అంత వయసు లేని యువతరం శ్రద్ధ వహించి తమ అవగాహనను ప్రకటించడం స్వాగతించదగ్గ విషయం.

తన వ్యాసం ఆరంభం నుంచీ ఇంతకు ముందు తెలియని కొత్త విషయాలు  తాను చెప్తున్నానన్న ఎరుక విద్యాసాగర్ బలంగా కలిగి వున్న విషయం స్పష్టంగా తెలుస్తూనే వుంది. ఈ తెలివిడి ఈవ్యాసం ద్వారా ఏం సాధించిందీ అన్న ప్రశ్న, సాహిత్య పరిశీలనా, లేక విమర్శా ప్రమాణాలు మెరుగుపడ్డాయీ అన్న ఆలోచనా సాహిత్య స్పృహ గల పాఠక లోకానికి తలఎత్తడమూ సహజమే.

విద్యాసాగర్ తన వ్యాసంలో "ఇలాంటి కథ" "ఏవో ప్రయోజనాల కొరకు సూత్రీకరణలు కథలో జరిగాయి" "గతం బాగుందని చెప్పడం ఏ ప్రయోజనాల కోసం?" "రచయిత ప్రవేశపెట్టిన విరుద్ధ వ్యాఖ్యానాలు" "వర్గం అనే పదానికి సరైన భాష్యం కథలో లేదు." తప్పుడు భాష్యాలు, తప్పుడు పరిష్కారాలు వచ్చాయి." ప్రమాదకర సూత్రీకరణలున్నాయి.'' అవిద్యను సమర్థిస్తూ ఉపాధ్యాయవృత్తిలో వున్న రచయిత మరో గ్రామం నుంచి వచ్చిన జ్ఞాని చేత పలికించాడు." "దేశ నమూనా ఏ దశల గుండా సాగి తీరుతుందనే సూత్రాల పట్ల అవగాహన లేకపోవడం" బతుకు తెరువు కోసం నూతన మార్గాలను అన్వేషించాలని తలచుకునే వారికి కూడా అలా తలచుకో కూడదని బోధించే తిరోగమన అంశాలు" 1962 నాటికే రియల్ ఎస్టేట్ బూమ్ కథలో ప్రవేశపెట్టడం." "రచయిత నగరజీవి కావడం వల్ల పల్లెటూరి జీవితం అంతగా తెలియకపోవడం" "జిల్లాలో జరుగుతున్న పరిణామాలను గమనించే, అధ్యయనం చేసే ప్రయత్నం చేయకపోవడం" తప్పుడు చైతన్యాన్ని పాత్రలోకి కృత్రిమంగా ప్రవేశపెట్టారు. ఇది అత్యంత దురదృష్టకరమైన చర్య'', 'సీతారావుడు, శీరావులు నాయుడ్ని 'ఎర్రిపీరు'వి అన్నదానిపై రచయిత ఏ వ్యాఖ్యానమూ చేయకపోవడం" "ముగింపు ప్రతిపాదన సామాజిక చలన క్రమాన్ని తిరగరాసే ప్రయత్నంగా వుంది." పాత మంచిదనుకునే వాళ్ళూ, పాత పాతర్లు తవ్వుకునే వాళ్ళూ లేకపోలేదు. వాళ్ళకు అనుగుణంగానే కథ జరిగిందన్నది విద్యాసాగర్ ఆఖరి వాక్యం ఈ పెద్ద వ్యాసంలో.

ఇవన్నీ 'యజ్ఞం' కథపై తన పరిశీలనలో విద్యాసాగర్ వాడిన అస్త్రాలు చూడబోతే అమ్ములపొది దాదాపు ఖాళీ అయ్యేలా ఎడాపెడా శరసంధానం చేసిన లాఘవం పాఠకులు గమనిస్తారు. తను రాసింది చదవగానే ఇంత అభివృద్ధి నిరోధకమైన కథా ఇది అన్నట్టు చదివినవారు తలచాలని విద్యాసాగర్ తాపత్రయం. ఇంకా కొంచెం లోతుగా పరిశీలిస్తే ఈ వ్యాసం కేవలం  'యజ్ఞం' కథ గురించే కాక, తెరిచిన పుస్తకం వంటి కారా మాస్టారి సార్వత్రిక ప్రగతిశీలతా, దశాబ్దాల సాహిత్య నిబద్ధతా, ప్రజలకు ప్రయోజనకరమైన రచనా సంకల్పసిద్ధీ. అన్నిటిపై నీలినీడలు ప్రసరించాలనీ, ప్రశ్న గుర్తులు ఉదయించాలనీ "యజ్ఞంపై మరోసారి" వ్యాసంలో తన ముందరితరం వారయిన రంగనాయకమ్మ, జ్వాలాముఖి, వెల్చేరు నారాయణరావు ఎవరూ చేయని కొత్త ప్రయత్నం చేసాడు వ్యాసకర్త. అదేమిటంటే గణాంక వివరాలతో పాఠకుల్ని గందరగోళానికి గురిచేయడం గణాంక ఖచ్చితత్వం (స్టాటిస్టికల్ లేదా డాక్యుమెంటేషన్ ఎక్యురసీ) సాహిత్య సృజనకు ముంగాళ్ళ బంధమూ, చేతిసంకెలా, మెడలో గుదిబండ కాదని, కాలేదని  గుర్తించలేకపోవడమే.

ఇది కారణంగానే ఒక వందేళ్ళ క్రితం గెజెట్ రికార్డులు (బ్రిటిష్ వారు రాసినవి) ఆధారంగా స్వీకరించి, ఈ గణాంక వివరాలకు ఒడంబడి, "యజ్ఞం" కథ లేదు అని తన ఆవిష్కరణగా ప్రకటించాడు.

ఆ గెజిట్ కానీ, ఇప్పుడు విద్యాసాగర్ చెప్పేది కానీ ఏమిటంటే వందేళ్ళ క్రితం దళితులకు స్వంతభూములు లేవు. ఇటువంటి మౌలిక విషయాన్ని విస్మరించి ఎలా కారా మాస్టారు కథ రాసారన్నది విద్యాసాగర్ అర్థోక్తి.

యజ్ఞం కథా కాలంలో అప్పల్రాయుడికి డెబ్భైఏళ్ళు మించి వయసు (కథ రాసింది 1964లో) అంటే అప్పల్రాయుడు 1894 ప్రాంతంలో పుట్టివుండవచ్చు, అతడు చెప్తున్నది అంతకు ముందు అంటే మరో యాభైఏళ్ళు వెనక్కి అంటే 1845 ప్రాంతాల్లోని తమ తండ్రి గురించి ఆ తండ్రి ముసలి వయసు దాకా బతికేడు. అతను అప్పల్రాయుడి ఇరవయ్యో ఏట చనిపోతూ (అంటే 1914 ప్రాంతాలలో) "ఐదెకరాల పల్లం, యేడెకరాల మెట్ట ఇడిసిపెట్టి ఎల్లిపోనాడు."

అప్పల్రాయుడే కాదు. అతని తండ్రి కూడా మాలల్లో ముఖ్యుడై వుండాలి. ఎందుకంటే అప్పల్రాయుడి కాలానికే ఆయన సుందరపాలెం పంచాయితీ మెంబరు. ఆ పాత్రను పరిచయం చేస్తూ కారా మాస్టారు రాసిందిది.

"అప్పల్రాయుడంటే ఆ ఊరి పంచాయితీలో హరిజన మెంబరు, మాలలకు కులపెద్దే కాక, మాలలందరిలో వయసు మళ్ళిన వాడు. అతడంటే ఆ ఊరిజనంలో మూడొంతుల ముప్పాతిక మందికి సదభిప్రాయం వుంది. మాటకు నిలబడేవాడూ, మర్యాదగా బతకాలనుకునేవాడూ మాలల్లో అతనొక్కడేనని అందరూ చెప్తారు. తగవుల్లో పేదా, రోదా అంటే సానుభూతి కలవాడని కొందరికభిమానం."

**ఆ గెజిట్ కానీ, ఇప్పుడు విద్యాసాగర్ చెప్పేది కానీ ఏమిటంటే వందేళ్ళ క్రితం దళితులకు స్వంతభూములు లేవు. ఇటువంటి మౌలిక విషయాన్ని విస్మరించి ఎలా కారా మాస్టారు కథ రాసారన్నది విద్యాసాగర్ అర్థోక్తి.**



1845 కాలానికి, అప్పటి విరామ సమాజ అవసరాలు, వ్యక్తుల ప్రాముఖ్యతల్ని బట్టి, భూములు రాజులే ఇవ్వాలి. అలాంటిదేమీ మాలలు, ఇంకా ఇతర కులాల వారి పట్ల జరిగివుండరాదన్న నియమం ఏమీ లేదు. తాము తమ భూములు, లేదా బతికి, బతికించే వ్యవస్థ (తమ అవసరాల కోసం ఏ వర్గాలాచరించినా) ఇవన్నీ మారిపోతున్న కాలంలో, తను ముప్పయి అయిదేళ్ళ క్రితం తీసుకొన్న అప్పు విషయంలో ఇన్నాళ్ళు కట్టిన వడ్డీల వల్ల అది తీరిపోయినట్టే అని పంచాయితీ తరపున శీరావులు నాయుడు అంటాడని అప్పల్రాయుడు ఆశించాడు. కొడుకుల్తో చెప్పాడు ఇలా

"నాయన్లారా! యీ ముప్పయి ముప్పయి అయిదేళ్ళ ఇచ్చిపుచ్చుకోడాల్లోను, వడ్డీలు వాసల్లోనూ, సావుకారి సొమ్మును మనమే తిన్నామో, మన సొమ్ము సావుకారే తిన్నాడో యీనాటికి అప్పంటూ ఇది తేలింది" అంటూ తాము ఇన్నేళ్ళుగా కట్టిన వడ్డీల గురించి ఎత్తుతాడు. ఇదే తలంపుతో పంచాయితీ మొదలయ్యాక ఇది న్యాయమైన అప్పు కాదని పంచాయితీ పెద్ద అయిన శీరావులు నాయుడి చేత చెప్పించే ప్రయత్నం చేస్తాడిలా.

"బాబూ! లచ్చుం నాయుడు! యీ ముండ కొడుకు ఇంత కాలానికి చిక్కేడన్నిట్టు నువ్వా మాటలన్నావు. నిజానికి నానెప్పుడు తప్పించుకు పోయింది లేదు. నానా బాబు మాటలకు నాడూ, నేడు కట్టుబడేవున్నాను. ఆ బాబు నోటిమీదుగా యిది నాయవైన అప్పేనని ఒక్కపాలి సెప్పించు! అణా పైసలతో ఒక్క ఎర్రని ఏగానీ మాఫీ అడక్కుండా నానీ అప్పంతా తీరుస్తాను. అలా తీర్చన్నాడు ఈ మాలయదవ ఓ అమ్మా, అబ్బలకు పుట్టలేదు."

ఇలా అనడంలో ఇది ముప్పయి అయిదేళ్ళ నాటి అప్పు అనీ, ఎంతో వడ్డీ కట్టా పచ్చామనీ, అప్పు ఇచ్చిన గోపన్నకు, పంచాయితీ పెద్దగా శీరావులు నాయుడు అతనిచ్చిన అప్పూ, అతనికి ఇన్నాళ్ళూగా ముట్టిన సొమ్మూ ఎంతో బోధపరచి, నచ్చచెప్పి, అప్పు మాఫీ చేయిస్తాడన్న ఆశ వుంటే, అది తన వర్గ స్వభావసిద్ధంగా, విరుద్ధమైన పని అవుతుంది కనుక, ఒకింత సంయమనం కోల్పోయిన శీరావులు నాయుడు.

"ఇది అప్పే!! అప్పే!! అప్పే!!" అని అరుస్తాడు. అప్పుడు తను చదువుకున్న వారి కుటిలత చూపిస్తాడు. కాస్త తమాయించుకుని.

"వాళ్ళయినా, నేనైనా ఇంకొకరైనా దీనిని అప్పుకాదని ఎలా అంటాడో, అలా అనగలరని వీళ్ళెలా ఆశిస్తున్నారో నాకు బోధపడటం లేదు."

ఈ మాటలతో శీరావులు నాయుడు ఏం తీర్పు ఇస్తాడో గ్రహించాడు అప్పల్రాయుడు. ఇక్కడ గల ఆత్మగౌరవ సమస్యను, వెల్చేరు నారాయణరావు స్పష్టంగా చర్చించారు. "కాళీపట్నం రామారావు రచనలు"కు తన ముందుమాటలో. విద్యాసాగర్ ఇక్కడ దళితులకు ఆ కాలంలో భూమి వుండే అవకాశం లేదు అన్నదానితో నిజానికి యిక్కడ కార్యకారణ సంబంధం ఏమీలేదు. తనకు భూమి వున్నా, లేకున్నా దళితుడున్నాడు, అతను తీసుకున్న అప్పు వుంది. దానికి ముప్పయి అయిదేళ్ళుగా కడ్తున్న వడ్డీ వుంది. ఇంకా అప్పు తీరలేదని చెప్పడానికి చదువుకున్న వారి పంచాయితీ వుంది. అది చేస్తున్న అన్యాయం కథలో సాక్షాత్కరించి నప్పుడు, సీతారావుడు ఎత్తే బీభత్స రసవాకారం వుంది.

ఇక్కడ తమకంటూ వున్న ఒకే ఒక్క ఆధారాన్ని అన్యాయంగా కోల్పోతున్నప్పుడు ఏ సంచనలమైన ముగింపు ఘట్టానికి కథ ప్రయాణిస్తోందో దానికి చెందినది. అప్పల్రాయుడి చిన్నపాటి పొలం. ఇది వారికి లేదు అన్నది ఒకవేళ గణాంకాల ప్రకారం నిజమే అయినా, కథా కల్పనకు, ఈ డాక్యుమెంటేషన్ ఖచ్చితత్వానికి సంబంధం వుండి వుండాల్సిన అవసరం లేదు.

అయితే మాలలు పాతకాలపు రోజుల్లోని విరామ సమాజంలో ఇప్పటికన్నా సరళమైన ఒత్తిళ్ళల్లో, బతికారు. కొందరు మంచిరోజుల్ని చూసారు. మంచిరోజులు అంటే ప్రస్తుత కథాకాలం కన్నా తక్కువ రకాల ఒత్తిళ్ళను చూసారు. ఒకరి మీద ఒకరు ఆధారపడి జీవించే గ్రామీణ జీవన చిత్రంలో ప్రతి కులానికి ఒక అవసరమైన పాత్ర వుంది. అందువల్ల, కథాకాలం అయిన అప్పల్రాయుడి యవ్వన కాలానికి ఆయనకు భూమి సొంతదారుగా వుండే అవకాశం లేదు అన్నది కథా గమనానికి తీవ్ర అభ్యంతరం కాలేదు.

1964లో కారామాస్టారు రాసిన కథ కన్నా ముందు 1936లో ప్రేమ్‌చంద్ (తన పరిణత వయస్సులో) రాసిన కథ 'కఫన్'! ఇదే ఆయన రాసిన ఆఖరు కథ. 1936లోనే ప్రేమ్‌చంద్ కన్ను మూసారు. ఈ కథలో ప్రేమ్‌చంద్ ఘిసు అనే చమార్ జాతి/ కులం వ్యక్తిచేత "బాగున్నా రోజుల్లో గతంలో మా పూర్వీకులు కులపెద్దలు గాను, గ్రామపెద్దలు గానూ వుండేవారు" అని వివరిస్తాడు. ఈ కులపెద్దలు, గ్రామపెద్దలు సొంతంగా భూమి కలిగిలేరని అనుకోలేము.

ఉత్తర భారతదేశ గ్రామీణ జీవన స్థితిగతులు తెలీకుండా, ప్రేమ్‌చంద్ ఇలా రాసి వుండరు.

ఉత్తర భారతదేశానికి సంబంధించిన ఒక గెజిట్ పుస్తకం సంపాదించి, అందులో వున్న దాఖలాలు ప్రకారం, ఆ కాలంలో చమార్ జాతి వారు కులపెద్దలు, గ్రామపెద్దలు కారనో, వారికి స్వంతానికి భూములు లేవనో తెలియ చేయడం, ఎలా "కఫన్" కథను పలుచన చేయదో, అలానే "యజ్ఞం"లో అప్పల్రాయుడి యవ్వన కాలం అయిన రోజులకు ఆయనకు సొంతభూమి వుండే అవకాశం లేదన్న వాదనా, కథపై ప్రభావం చూపదు. సత్యం ఏమిటంటే తనకు భూమున్నా లేకున్నా దళితుడున్నాడు, అతను, తన కుటుంబం తీర్చలేని ఒక అమానవీయమైన లెక్కల గారడీ అప్పు వుంది. పంచాయితీ మెంబరుగా కుల ప్రాతినిధ్యం వహిస్తున్నా, మారుతున్న కాలంలో అప్పు తీర్చలేని దయనీయ స్థితిలో అప్పల్రాయుడెలా సతమతమవుతున్నాడో, అప్పు ఇచ్చిన గొప్పన్న షావుకారుదీ ఇంచుమించు అదే పరిస్థితి. ఏమిటీ వ్యవస్థ అప్పు పుచ్చుకున్న అప్పల్రాయుడ్ని, అప్పు ఇచ్చిన గోపన్ననూ ఒకేలా కుదేలు చేస్తున్నాడన్న విషయం తెలుసుకోవడమే కథలో "యజ్ఞం". ఈ కథను ఒక పొరలో/ స్తరంలో/ లేయర్‌లో మాత్రం అర్థం చేసుకుంటూ విద్యాసాగర్ వ్యాసంలో ఒకదాని తర్వాత ఒకటిగా వ్యాఖ్యలు చోటు చేసుకున్నాయి.

**విద్యాసాగర్ తన వ్యాసాన్ని మొదలుపెట్టిన తీరు ప్రకారం గణాంక ఖచ్చితత్వమే కథకు ముఖ్య నేపథ్య భూమిక అని భావిస్తే, కఫన్ కథలో ప్రేమ్‌చంద్ చమార్ జాతివాడైన ఘిసు 'గతంలో మావారు కులపెద్దలుగా, గ్రామపెద్దలుగా వున్నారు" అన్న దాన్ని సైతం ఏ ఉత్తరప్రదేశ్ గెజిట్ నేపథ్యంలోంచో, పరిశీలించుకుని, ప్రేమ్‌చంద్ కథ అరకొర సమాచారంపై ఆధారపడి లేదని తెల్సుకోవాల్సి వస్తుంది.**

గతంలో సమాజం యంత్ర యుగం పూర్తిగా ప్రవేశించని కాలంలో, అన్నిటికీ మూలమైన మనుషుల శ్రమపై ఆధారపడినందువల్ల, అన్ని కులాల, వృత్తుల వారు ఒకరికొకరు అవసరమయ్యే సహజ చట్రంలో, ప్రతివారూ తాము ఎంతో కొంతమేరకు సమాజానికి ఉపయోగపడు తున్నామనే భావనతో బతికేవారనీ ఆనాటి సమాజం ఇంతగా చెదిరిపోలేదని చెప్పేందుకు కారా మాస్టారు రాసిన దాన్ని "గతం బాగుందని చెప్పడం ఏ ప్రయోజనాల కోసం?" అని ప్రశ్న వేయడం, " ఏవో ప్రయోజనాల కొరకు కథలో సూత్రీకరణలు జరిగాయి" అని నిర్ధారణకు రావడమూ, విద్యాసాగర్ ప్రదర్శించిన Jumping to Conclusions ధోరణికి నిదర్శనాలు.

గణాంక వివరాల ఖచ్చితత్వం ఏ కథా సృజనకూ అడ్డుకాదు మొదటే ఈ డాక్యుమెంటేషన్ ఎక్యురసీని పొందుపరిచి విద్యాసాగర్ కనుక "ఇలాంటి కథ" రాయడానికి అవసరమైన వివరాలు తెలీకుండానే కారా మాస్టారు ఈ రచన చేసారన్న Insinuation చేస్తున్నాడు. ఇది స్పష్టంగానే తన వ్యాసంలో అగుపిస్తున్నది. ఒకవేళ గణాంక వివరాల ఖచ్చితత్వం వేరుగా వుండే Data ను చూపిస్తున్నా, కల్పనా స్వేచ్ఛ గల సృజన కారుడిగా ఈ ఖచ్చితత్వం కథకుడ్ని Condition చేయవలసిన అవసరం లేదు.

విద్యాసాగర్ తన వ్యాసాన్ని మొదలుపెట్టిన తీరు ప్రకారం గణాంక ఖచ్చితత్వమే కథకు ముఖ్య నేపథ్య భూమిక అని భావిస్తే, కఫన్ కథలో ప్రేమ్‌చంద్ చమార్ జాతివాడైన ఘిసు 'గతంలో మావారు కులపెద్దలుగా, గ్రామపెద్దలుగా వున్నారు" అన్న దాన్ని సైతం ఏ ఉత్తరప్రదేశ్ గెజిట్ నేపథ్యంలోంచో, పరిశీలించుకుని, ప్రేమ్‌చంద్ కథ అరకొర సమాచారంపై ఆధారపడి లేదని తెల్సుకోవాల్సి వస్తుంది.

అలానే 1952లో పాలగుమ్మి పద్మరాజు రాసిన "గాలివాన" కథా ఆ కథా ప్రాంతంలో 1950లో గాలివానలు వచ్చాయా, లేదా అన్న వాతావరణ కార్యాలయపు గణాంక వివరాలు బట్టి మాత్రమే కథకు డాక్యుమెంటేషన్ ఎక్యురసీ వుందా లేదా అని నిర్ధారించాల్సి వుంటుంది.

తన కథా రచన విషయంలో తగు కల్పనకు కథకుడికి స్వేచ్ఛ, అవకాశం వుందని దానికి అనుగుణంగానే కథా రచన జరుగుతుందన్న ప్రాథమిక వాస్తవం గమనించకుండా, ఇదేదో సాహిత్య విమర్శలో కొత్త కోణం అనుకుంటున్న విద్యాసాగర్ ధోరణికి ఉదాహరణ ఈ వ్యాసం ఆరంభంలో ఆధారం చేసుకున్న కార్‌మైకెల్ గారి గెజెట్.

ఈ లెక్కన పొడిగిస్తే, గొగోల్ రాసిన "ఓవరుకోటు" కథలో అకాకి అకాకియెవిచ్, జారు ఆస్థానంలో నకళ్ళు రాసే ఒక గుమాస్తా. టైపురైటర్లు లేని కాలంలో రాజాస్థాన ఉద్యోగులు, ఎన్నో రాజాజ్ఞలకు, అధికార ఉత్తర ప్రత్యుత్తరాలకు కాపీలు / నకళ్ళు రాస్తుండేవారు. ఇదీ ఆ దిగువ మధ్యతరగతి ఉద్యోగి చేసే వృత్తి. దీన్ని 1842లో గొగోల్ రాసాడు. అయితే మన విద్యాసాగర్ ధోరణిని అనుసరిస్తే, 1808లోనే కార్బన్‌పేపర్ తయారయిందని, సాంకేతిక ఆవిష్కరణలు చెప్తుండగా, టైపురైటర్ యొక్క తొలిరూపాలు 1808 కే కనిపెట్టగా 1842లో చేత్తో కాపీలు రాసే ఉద్యోగం, అంత గొప్ప జారుచక్రవర్తి గారి ఆస్థానంలో వుండే అవకాశం లేదని సూత్రీకరించాల్సి వస్తుంది. ఇదెంత అడ్డగోలు సూత్రీకరణో, పెద్దగా ఆలోచించ కుండానే అర్థమవు తుంది. వెరసి ఇటువంటి రంధ్రాన్వేషణ సాహిత్య విమర్శ కాదు అని చెప్పడమే ఈ విపుల ప్రస్తావన లక్ష్యం.

1964లలో డైబ్బై ఏళ్ళ వయస్సువాడైన అప్పల్రాయుడు 1894లో పుట్టి వుంటే, అంతకు ముందో యాభైఏళ్ళు వెనక్కి వెళ్తే అంటే 1844లో భూముల పరిస్థితి, ఎవరు సొంతదారులు అనేది 1910లో వచ్చిన కార్‌మైకేల్ రిపోర్టు విశదపర్చదు. అప్పల్రాయుడి తండ్రికి 1844లో గానీ ఆ తర్వాత గానీ కొంత భూమి వుండే అవకాశం, చమారాలు వారి జీవితాలతో కొంత ఉన్నతంగా కులపెద్దలుగా, గ్రామ పెద్దలుగా వుండే అవకాశం (ప్రేమ్‌చంద్ చెప్పినది), వుంది లేదా లేదు అనేది కేవలం CONJECTURE మాత్రమే. అన్ని కులాల వారివలె (ఏ మెట్ట పొలాలలోనో) వాడూ కొంతభూమికీ హక్కుదారులై వుండవచ్చు అన్న పాజిబులిటీని విస్మరించి కార్ మైకేల్ గెజిట్‌తో కారామాస్టారి కథపై తను చేయదల్చిన దాడికి ఆరంభం చేసుకోవడమే, ఇక్కడ అసలు విషయం సాహిత్య విమర్శకాదనీ, "వేరే ప్రయోజనాల కొరకు ఇటువంటి నిర్ధారణలు వ్యాసంలో జరిగాయి" అనీ, సెన్సిబులిటీ వున్న పాఠకులు గ్రహిస్తారు.

"గతంలో బాగుందని చెప్పడం ఏ ప్రయోజనాలు కోసం?" అన్నది యజ్ఞం కథపై ఉపరితల అవగాహనతో వేసిన ప్రశ్నగానే కన్పిస్తుంది తప్ప, కథాకాలంలోకి విద్యాసాగర్ ఒక తత్పరత గల దృష్టితో చూసి నట్టు తోచదు. కారా మాస్టారు గతమే బాగుండదను కుంటే యజ్ఞంతో పాటు ఇంకా ఎన్నో కథలు తాను రాయాల్సిన అవసరం లేదు.

కారా మాస్టారు యజ్ఞం రాసిన (1964)కు మూడేళ్ళ తరువాత 1967లో నక్సల్‌బరి ఉదంతం జరిగింది. 1970కి గాని

విప్లవ రచయితల సంఘం ఏర్పడలేదు. ఈ కథలో బహుశా తెలుగు సాహిత్యంలో తొలిసారిగా ఏ ఆధారమూ లేనివారిగా పేదలు గోడకు నొక్కిపెట్టబడితే ఆందోళిత చిత్తులవుతారు, ఈ దురవస్థ నుంచి విముక్తికై సాయుధమౌతారు. అయితే సాయుధమయ్యే క్రమంలో ఎవర్ని ఏం చెయ్యాలో తెలీక ఆ ఆయుధాన్నీ తమపైనే ఉపయోగించుకుంటారనే క్రమ పరిణామ చిత్రం వుంది. దీన్ని ఆత్మవిధ్వంసం అనే అంటారు.

తన పరిణతవత్సరాలలో, ఇటువంటి ఇద్దరు మానవాథముల్ని చిత్రించి ప్రేమ్‌చంద్ ఏం చెప్పగలిగాడు? వీరి కటిక పేదరికం కారణంగా, యజ్ఞం కథలో సీతారాముడి కన్నా ఇంకా ఎన్నో రెట్లు దిగువన గల బికారులు వీళ్ళు. వారికి తెలియకుండానే వారు ముదిరిపోయిన ఆత్మ విధ్వంస క్రమంలో వున్నారు. వారు నాశనమౌతారు, తమకు దగ్గరి వారిని నిలువెల్లా విధ్వంసిస్తారు' ఆశ్చర్యమేమిటంటే వారికి స్పృహా వుండదు. వీరికన్నా 'యజ్ఞం'లోని దళిత కుటుంబం స్థితి కొంత మెరుగే.

సుందరపాలెం గ్రామం సంగతి కొద్దాము. ఈ ఊరి పరిస్థితి గురించి రచయిత ప్రవేశపెట్టిన విరుద్ధ వ్యాఖ్యానాలు'' అని వ్యాఖ్యానించాడు విద్యాసాగర్. పంచవర్ష ప్రణాళికలు అమలు జరుగుతూ, "టౌను పక్కకెళ్ళొద్దురా డింగరీ" వంటి సినిమా పాటల ద్వారా సమాజంలో గ్రామీణులకు పట్నం అంటే గల మోజు, భయమూ 1960ల్లో నమోదు అవుతున్నాయి. అటువంటి కాలంలో పల్లె లక్షణాలు కోల్పోతూ, పూర్తిగా పట్నంగా మారని సుందరపాలెం గురించి ఒకే రకం వ్యాఖ్యానం వుండే వీలు లేదు. బహిరంగంగా తమ ఊరికి గల ప్రాముఖ్యత, హంగు, పొంగూ, అదే కాలంలో జీవికలకు దురమవుతున్న గ్రామ ప్రజల గుండె బెదురూ, ఇవి చెప్పే క్రమంలో సుందరపాలెం సుందరంగా వుందా అంటే బయటికి వుంది, కానీ లోపల కుతకుత ఊడుకుతుంది. దీన్ని తెలియజేసే కారా మాస్టారి మాటలు, పరస్పర విరుద్ధ వ్యాఖ్యానాలుగా విద్యాసాగర్‌కు అన్పించడం, నిశ్శబ్దంగా మారిపోతున్న భారత గ్రామీణ ముఖచిత్రం గురించీ, దాని స్థానిక కోణం గురించీ, అది సుందరపాలెం గ్రామం విషయంగా చిత్రితమైన తీరు గురించీ, ప్రాథమిక పరిజ్ఞానం లేకపోవడమే.

**విద్యాసాగర్ గమనించాల్సిందేమంటే యజ్ఞం కథకి ఒక వర్గ స్వభావం వుంది. కథలో గల వర్గాలు తాము ఆ వర్గాలకు చెందినవారమే అన్న ఎరుక లేకున్నా పరస్పరం సంఘర్షిస్తున్నది, తామెవరమో తమకే స్పష్టత లేని తమ వర్గ ప్రయోజనాల కోసమే విప్పి చెప్పడం కన్నా కప్పి చెప్పడం కళ అని తెలిస్తే, విద్యాసాగర్ యజ్ఞం కథలో వర్గం అనే పదానికి సరైన భాష్యం లేదు" అని వుండేవాడు కాడు.**

కారా మాస్టారు 1964లో 'యజ్ఞం' రాసినప్పుడు కథలో ఒక షాకింగ్ ఎలిమెంట్ వుంది. జడత్వం జడిసిపోయి, అమాంతం పారిపోవాల్సినంతంగా షెడీల్మాని తగిలే లెంపకాయకు వ్యాకరణం ఏముంటుంది? ఒక దిగ్భ్రాంతి నుంచి ఒక ఆలోచన ఊదయిస్తే, అదొక విద్యుత్ చికిత్స అయితే ఇది ప్రేమ్‌చంద్ కథలో 1936లోనే వుంది. ఇది జాతీయ స్థాయి సాహిత్య సమాంతర సమాచారం.

'యజ్ఞం' కథలో ఏ విద్యుత్ చికిత్స జరిగిందో, అది కథల్లో అయినా, కవిత్వంలో అయినా, తొలి సందర్భం. 1965లో గానీ దిగంబర కవిత్వం తుఫాను వేగంతో తెలుగువారి నిరీహను, నిర్వ్యాపారతను తాకలేదు.

'యజ్ఞం' కథలో అసలు యజ్ఞం ఏమిటి? ఎవరు బలి పశువులు? దీనికి పలు స్తరాలలో సమాధానాలున్నాయి. వెతుక్కున్న వారికి వెతుక్కున్నంతగా 'విప్లవ ప్రతీఘాతక కల్పన'గా గాటకట్టిన స్పందనలు, ముగింపు పరిశీలనాంశంగా, మంచి సాహిత్య సంస్కారంతో వెలువర్చిన రంగనాయకమ్మ, జ్వాలాముఖీ వంటి వారు వున్నారు. వెరసీ నక్సల్‌బరీ కన్నా మూడేళ్ళ ముందు, దిగంబర కవిత్వం కన్నా ఏడాది ముందు, విరసం ఆవిర్భావం కన్నా ఆరేళ్ళముందు కారా మాస్టారి కథ వెలువడింది.

ఒక భారతీయ గ్రామ చైతన్య స్థాయిలో రాసిన కథ గురించి 'వర్గం అనే పదానికి సరైన అర్థం/ భాష్యం కథలో లేదు" అని విద్యాసాగర్ గమనించిన దానికి, కథా లక్ష్య యాత్రకు ఏ పొంతనా లేదు. వర్గాలు ఎవరికి వారు సరిహద్దులు గీసుకుని, ఇదిగో ఇది మా గుర్తింపుల గీత, దాటితే జాగ్రత్త అని బహిరంగంగా హెచ్చరికలు చేసుకుంటూ కూర్చోవు.

విద్యాసాగర్ గమనించాల్సిందేమంటే యజ్ఞం కథకి ఒక వర్గ స్వభావం వుంది. కథలో గల వర్గాలు తాము ఆ వర్గాలకు చెందినవారమే అన్న ఎరుక లేకున్నా పరస్పరం సంఘర్షిస్తున్నది, తామెవరమో తమకే స్పష్టత లేని తమ వర్గ ప్రయోజనాల కోసమే విప్పి చెప్పడం కన్నా కప్పి చెప్పడం కళ అని తెలిస్తే, విద్యాసాగర్ యజ్ఞం కథలో వర్గం అనే పదానికి సరైన భాష్యం లేదు" అని వుండేవాడు కాడు.

ఇప్పుడు కొన్ని ప్రశ్నలు వేసుకుందాము. "యజ్ఞం" దేనికి సంకేతం? ఇది కేవలం సుందరపాలెంలోనే జరుగు తోందా? భారతదేశం మొత్తంలో జరుగుతుందా? బలిపశువులు స్థానికులు మాత్రమేనా లేక కోట్లాది దేశీయులా? ఏ విషాద భూతం అప్పిచ్చిన వాడ్నీ, అప్పు పుచ్చుకున్న వాడ్నీ ఒకే ఆర్థిక స్థాయికి దిగజార్చింది? ఆయన కథలో తెలిపిన రోడ్డు, స్కూలు, అభివృద్ధి గురించి ఎలా అవగాహన చేసుకోవాలి? వీటన్నిటికి అరకొర జవాబులు చెప్పుకుని, అదొక సాహిత్య పరిశీలన, విమర్శ అనుకుంటు న్నాడు విద్యాసాగర్. "వక్రీకరణ" అన్న మాట వాడకపోయినా "ఏ ప్రయోజనాల కోసం ఈ సూత్రీకరణలు?" అని ప్రశ్నించడంలోనే వక్రీకరణలు కథలో జరిగే "తప్పుడు భాష్యాలు, తప్పుడు పరిష్కారాలు వచ్చాయి" అనేవాడు విద్యాసాగర్.

"యజ్ఞం" అంటే పెద్ద క్రతువు. దేశ స్థాయిలో జరుగుతోంది. యంత్రయుగపు బలమైన ధోరణులు గ్రామాల విరామ జీవన చట్రాన్ని చెదరగొడ్తున్నాయి. దీన్నే కొన్నాళ్ళు అటూ ఇటూగా 'చెదిరిన సమాజం'లో చినువా అచిబె చెప్తాడు ఆఫ్రికా దేశాల హృదయ విదారక గాథగా, అప్పు పుచ్చుకున్న అప్పల్రాయుడు, అప్పిచ్చిన గోపన్న, తీర్పు చెప్తున్న శీరావులు నాయుడు అందరూ బలిపశువులే. వారి వారి స్థల కాలాలలో, వీటిలో ఒక్క బాహ్యాచరణకు పాల్పడిన వాడు ఆవేశాంతరంగుడు సీతారావుడు. వీడు ఆగ్రహించి వున్నాడు సాయుధుడై వున్నాడు. వాడ్ని ఈ దశకు తోసిన సమాజయజ్ఞం మన కనుల ముందర వుంది.

గొప్ప నాగరికతగా, పరిపాలక సంస్కృతిగా ఒక చేత బైబిల్, మరొక చేత తుపాకి ధరించి వచ్చిన సామ్రాజ్య వాద క్రైస్తవం ఆఫ్రికా దేశాలలో ఏం చేసిందో సాహిత్యం నిజాయితీగా నమోదు చేసింది. "బ్రోకెన్ యాడ్" నవలలో చినువా అచిబె, గ్రామ పెద్ద అయిన నీగ్రో జాతీయ తెగ నాయకుడితో ఇలా అన్పిస్తాడు. తను ప్రశ్నిస్తాడు ఏమిటా మోగుతున్న గంట అది. తమ గూడెంలో క్రైస్తవ కూటమి ఏర్పాటు చేసి, ప్రతి ఆదివారం చర్చికి రమ్మంటూ, వారికి సువార్తలు, తినుబండారాలు అందించే, తెల్లవారు మోగిస్తున్న పిలుపు గంట అది అని, ఆయన కొడుకు చెప్తాడు. "అయితే మన సంస్కృతికి చావు

గంట మోగిందన్నమాట!" అంటాడు గ్రామ పెద్ద.

అలా కనిపించని మార్పు భారతీయ గ్రామాలను కబళిస్తున్నపుడు ఈ నరబలుల, జంతు బలుల, సమాజ బలుల యజ్ఞం గురించి, కారా మాష్టారు ఆవిష్కరించిన, నెత్తురోడే బూడిదరంగు చిత్రం ఈ కథ. దీన్ని అవగాహన చేసుకోవడంలో తన పొరపాట్లన్నీ ఈ తొందరపాటు వ్యాసంలో పదిలపర్చాడు విద్యాసాగర్.

ఏదైనా రచన పట్ల విభిన్నమైన అభిప్రాయాలుండటం ఒక మౌలిక ప్రజాస్వామ్య లక్షణం అయితే రచయిత పట్ల తీవ్ర అయిష్టతగా మార్చుకోవడం ఒక విపరీత ధోరణి. ఇటువంటిది విద్యాసాగర్ ప్రకటించడం దురదృష్టకరం. చాలా గంభీరమైన విషయాలపై తేలికపాటి వ్యాఖ్యానాలు, నిర్ధారణలు, తీసిపారేయడాలు (Dismissal) వంటి ధోరణులలోనే విద్యాసాగర్ వ్యాసం సాగడం ఇంకా విషాదకరం.

కారా మాష్టారు 'అవిద్య'ను ప్రోత్సహించారు అన్నది ఎప్పట్లాగే మన విద్యాసాగర్ కాస్త స్పష్టంగా చేస్తున్న Insinuation. పైపెచ్చు ఉపాధ్యాయ వృత్తిలో వుండికూడా, ఇలా వృత్తి స్ఫూర్తి విరుద్ధ ధోరణి ఎలా కన్పరచారన్నదీ, విద్య విషయంలో ఆయనకు గల చిత్తశుద్ధిని శంకించడంలో భాగంగా, "అవిద్యను సమర్థిస్తూ" అన్నదీ విద్యాసాగర్ కథా కథన పరిమితుల్లో చేసే అతి వ్యాఖ్యలు.

**ఆంగ్లేయుల పాలనలో వేసిన కలకత్తా – మద్రాసు రైలు మార్గము. ఇది కేవలం ఆ రోజుల్లో సత్వరమే సైనిక పటాలాల రవాణాకే ఉద్దేశించబడింది. అయితే కాలగతిలో దేశ జీవితంలో ఒక ముఖ్య ప్రయాణ మార్గమయింది. ఈ రైలు మార్గం ఇలా ఎంతో ప్రయోజన కరమైందిగా రానురానూ రూపొందిన మాట ఒక సంక్లిష్ట వాస్తవం. దీన్ని సరళీకరించి, ఆంగ్లేయుల బహు దూరదృష్టి కలవారని ప్రశంసించనూ లేము.**

యాంత్రిక యుగ నైపుణ్యాలు ఎటువంటి సమాజాన్ని తీసుకు రాబోతున్నాయనేది ప్రస్తావనకు వచ్చే అంశంగా మాష్టారు రాసిందిది. అప్పల్రాయుడితో ఒక పరోక్ష పాత్ర పలుకుతుందిలా.

"అప్పుడు నా బాధ తెలిసి మా యర్రయ్య యింటికి సుట్టపు సూపుగా వచ్చిన పెద్ద మనిషి అన్నాడు.

"ఓయోయ్ బుల్లోళ్ళో" ఆయన్నని నాబం నేదు. జరుగుతున్న దగా యెక్కడో మాకు తెల్నట్టే ఆయనకీ తెలవదు. దీనికంతటికీ కీలకం యిక్కడెక్కడా నేదు. పైనెక్కడ్నుంచో వచ్చిన ముప్పు మనందర్నీ ముంచుతోంది.

"పండిన పంటంతా కామందుల గోదాల కెల్లాల ఎల్లకుండా కూలోడు. అడ్డ తగుల్తున్నాడు. ఎనకట్రోజుల్లో అయితే తన్ని సేయించుకునే వోరు. ఇప్పటి రోజుల్లో ఆ పప్పులుడకవు. కూలోడి అడ్డు వొదిలించుకోవాలంటే మిషీన్లు కావాలి. మెసీన్లు తేవాలంటే యెలట్రిసిటీ, రోడ్లు కావాలి అంతే కాదు. సదువుకున్న కూలోళ్ళు కావాలి. అందుకనే యీ రోడ్లు, యీ యెలట్రిసిటీ ఇయన్నీ మనకోఁసవే అనుకోడం మన బుద్ధి తక్కువ. నీల్లు తోడ్డానికి మిసీన్లొచ్చేసి నాయనే గుంజుకు పోతున్నారు. రేప్పొద్దున దున్నడానికి, ఊడుపులకు, కొప్పులకు, కోతలకు కూడా మిసీన్లు రాబోతున్నాయి. అప్పుడు సూసుకోండి తడాకా..." అన్నాడు.

దీనిపై ఇది అవిద్య గానూ, ఈ మాటలన్న పెద్ద మనిషిని "జ్ఞాని" గానూ (వెటకారం స్పష్టమే) ఈ జ్ఞానిని ఏమీ అనకపోవడం. వీటిపై విద్యాసాగర్ అభ్యంతరం ఇలా ప్రకటించాడు.

సరిగ్గా "అభివృద్ధి"ని వ్యతిరేకించే పేరుతో "విద్య"ను వ్యతిరేకించే అంటే "కూలీలను తయారుచేసే విద్య" అంటూ ఒక సత్యాన్ని ఆవిష్కరిస్తాడు. గ్రామీణ ప్రాంతాలలో 1990వ దశకం వరకూ ఈ జిల్లాలో సాగిన విచక్షణా రహిత దోపిడీకి ఈ 'అవిద్య' కారణంగా వుంది. అసలు ఉపాధ్యాయ వృత్తిలో వున్న రచయిత మరో గ్రామంలో నుంచి వచ్చిన "జ్ఞాని" చేత ఈ పలుకులు పలికించడం, దానిపైన అనేక సందర్భాలలో అనేక వ్యాఖ్యలు చేసిన రచయిత ఈ "జ్ఞాని" మాటలపై ఏ వ్యాఖ్యానం చేయకపోవడం విచిత్రంగా వుంటుంది. ఇలాంటి "జ్ఞానుల" మాటల ఫలితంగానే అనేకమంది విప్లవ గేయ రచయితలు" ఈ బతుకులేని చదువులకు బందీ కాకురా" అని తర్వాత రాయగలిగారు. అది వేరే దగ్గర చర్చిద్దాం."

కారా మాష్టారు "మా యర్రయ్య ఇంటికి సుట్టపు సూపుగా వచ్చిన పెద్దమనిషి" అన్నారే కానీ ఇంకే అదనపు వివరం ఇవ్వలేదు. అనేకమంది గ్రామీణుల జీవనానుభవం నుండి ఆ పెద్దమనిషి మాట్లాడుతున్నాడని పాఠకులకు ఇట్టే అర్థమవుతుంది. విద్యాసాగర్ మాత్రం "జ్ఞాని" అని ముందు ఏకవచనంలోనూ, తర్వాత కారా మాష్టారు అతన్ని ఏమీ కథలో అనలేదంటూ తెలిపి ఇలాంటి "జ్ఞానులు" అన్నప్పుడు ఎవర్ని కలగలిపి మాట్లాడుతున్నారో స్పష్టమే వెటకారం, ఎద్దేవా, ఎత్తిపొడుపు ఇది సాహిత్య విమర్శలు కావు. సాహిత్య విమర్శంటూ మొదలైన రచనలో ఇటువంటి అక్కసుతో కూడిన మాటలు. ఏ సాహిత్యేతర ప్రయోజనాల్ని ఉద్దేశించి ఈ ప్రయత్నం జరిగిందా అనే ప్రశ్నలకు తావిస్తాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ, పాలక వ్యవస్థ తమను నియంత్రించే వర్గాలు / వ్యక్తుల / శక్తుల, ఆసక్తుల పరిరక్షణకే పనిచేస్తాయి. కొన్ని బృహత్తరమైన నిర్మాణాలు / పనులు రాజరికపు సమాజమైనా, తన ఉపయోగం / ప్రయోజనాల కోసమే చేస్తుందని మనమందరమూ ఎరిగిందే అయితే అటువంటి మేజర్ వర్క్ ద్వారా పక్కపక్కనే (In the sidelines or collateral effects) గా వాటివల్ల జనప్రయోజనమూ, ఆ వెంటనే కొద్దిగానూ, తదుపరి కాలగతిలో పూర్తిగా జనాలకీ ఉపయోగపడటమూ, ఒక వ్యవస్థ వికాసంతో అవిభాజ్య అంశాలు ఉదాహరణగా ఆంగ్లేయుల పాలనలో వేసిన కలకత్తా – మద్రాసు రైలు మార్గము. ఇది కేవలం ఆ రోజుల్లో సత్వరమే సైనిక పటాలాల రవాణాకే ఉద్దేశించబడింది. అయితే కాలగతిలో దేశ జీవితంలో ఒక ముఖ్య ప్రయాణ మార్గమయింది. ఈ రైలు మార్గం ఇలా ఎంతో ప్రయోజన కరమైందిగా రానురానూ రూపొందిన మాట ఒక సంక్లిష్ట వాస్తవం. దీన్ని సరళీకరించి, ఆంగ్లేయుల బహు దూరదృష్టి కలవారని ప్రశంసించనూ లేము. ఆ రోజుల్లో ఈ రైలు మార్గానికై తమ భూములు కోల్పోయిన రైతుల వేదనను "అవిద్య"గా తోసిపారేయలేము.

ఆంగ్లేయుల రాజరికం కలకాలం వర్ధిల్లాలని, అవసరమైనంత మేరకు యంత్రాలను ప్రవేశపెట్టడం, గుమస్తాలను నేర్పే విద్యగా, ఒక కొత్తతరం భారతీయులు ఆంగ్లమెరిగినవారుగా ఎదిగితే, వారివల్ల రాజ్య పరిపాలన సులభమవుతుందన్న మెకాలే దృష్టీ, ఈ దేశపు రెండు ప్రధాన మతాల ప్రజలను విభజించి వుంచే వారి నీతి, వీటి గురించి ఒక సమ్యక్ అవగాహనను, బ్రిటిష్‌వారి కాలం నుంచి, పారిశ్రామిక యుగం మానవ శ్రమ కేంద్రకమైన సమాజంపై రుద్దిన "యంత్ర భూతముల మృత్యు స్పర్శ" గురించి, స్వాతంత్ర్యం వచ్చిన పదిహేనేళ్ళకు, ఒక శ్రీకాకుళపు గ్రామీణ భారతీయుడు వెళ్ళకక్కిన

వేదనను, ఎంత విశాలంగా అర్ధం చేసుకోవాలో ఆ ప్రయత్నం కనీసం మొదలు పెట్టకుండా, ఆ పెద్దమనిషిని "జ్ఞాని" అని, అతన్నేమీ అనని రచయితను కూడా కలిపి "జ్ఞానులు" అని వ్యవహరించడం ద్వారా విద్యాసాగర్ తన అవగాహనకు గల విపరీతమైన పరిమితుల్ని బయట పెట్టుకున్నాడు.

హైస్కూలు, రోడ్డు, కరెంట్, వీటివల్ల మనుష్యులపై అధారితమైన పక్కా పల్లెటూరి సమాజంలో ఉపాధి కొరత ఎలా దృశ్యాదృశ్యంగా అభివృద్ధి పేరిట ముంచెత్తనున్నదో, 1964 నాటి తొత్తుల సమాజపు చెదరిపాటును, ఆరు లక్షల భారతీయ గ్రామాల బతుకుల తీరు తరపును తెలుగులో కారా మాష్టారు రాసిన 'యజ్ఞం' కథ లోతుకు విద్యాసాగర్ వంటివారు ఎందుకు ఉద్రేకపడుతున్నారో తెలీని యువకులకు అందేది కాదు. ఎంత ఎక్కువగా ఈ వ్యాసం రాశాడో అంతే స్థాయిలో తన అపరిణతిని, అపరిపక్వతను బయట పెట్టుకున్నాడు విద్యాసాగర్.

ప్రపంచ సమాజాల ముందు 1850ల నుంచి బలం పుంజుకున్న పారిశ్రామిక యుగపు సవాళ్ళు బహుళం. ప్రతి పనినీ మనుషులే చేస్కుంటూ, ఆ చేసుకునే / చేయగల నైపుణ్యాన్ని వృత్తిగానో, కులంగానో, కులవృత్తిగానో భావనలు వేలాది ఏళ్ళ మానవ సమాజ క్రమంలో స్థిరపడి, ఆ వృత్తి ద్వారా పూర్తిగా మాన్యుయల్ లేబర్ మరియు పెంపుడు పశువుల సహాయంపై ఆధారపడిన జీవన స్థితిగతులు యంత్రాల ఆవిష్కరణ, పలు రంగాలలో ప్రదేశంతో చెదిరిపోయాయి అన్నది నిశిత పరిశీలనకు అందే వాస్తవం. శారీరక శ్రమ నుంచి యాంత్రీకరణ, మానవులను విముక్తం చేసినా, ఈ మానవులకు ప్రత్యామ్నాయ ఉపాధిదాయక ఏర్పాట్లు, సమాజంలో లేకపోవడం మూలాన, ప్రతి యాంత్రిక యుగ శాస్త్రీయ సాంకేతిక ప్రగతి, మనుష్యులను క్రమేపీ ఉద్యోగాల నుంచి, ఉపాధి మార్గాల నుంచి దూరం చేస్తున్న బలవత్తర వాస్తవపు ప్రాథమికమనే కారా మాస్టారి పెద్దమనిషి రొద. దీన్ని 'అవిద్య'గా అపహాస్యం చేయడం సామాజిక విజ్ఞత గల వారు చేసే పని కాదు.

ఇప్పటికీ ప్రపంచం నలుమూలలా, పలు ప్రపంచ భాషలలో ప్రపంచ సాధారణ మానవులు వేస్తున్న ప్రశ్న ఒక్కటే. "నేను చేస్తున్న పని నుండి నన్ను దూరం చేశాక, నేను గౌరవంగా బతికేందుకు నాకే జీవిక లభ్యంగా వుంది?" దీనికి సంపన్న వర్గాలు నడిపే ప్రపంచ సమాజాల జవాబు చాలా శాంతియుతంగా, ప్రాణాంతక హుందాతనంతో – "నువ్వు ఖర్చు రాసేయదగ్గ వ్యర్ధ పదార్ధానివి! మీలో కొందరు మా సమాజ అవసరాలకు అనుగుణంగా మలుచుకోగలవారు మాకు కావాలి. మిగతా వారికి శుభాకాంక్షలతో మా వీడ్కోలు" అనే పింక్ స్లిప్పులు పెట్టుబడిదారీ సమాజం అందిస్తోంది ప్రజలకు. ఇది ప్రజలకు అభ్యంతరకరం. ఏ సిద్ధాంతం పేరుతోనైనా సమస్త ప్రజలను ప్రగతి యాత్రలో భాగస్వాములను, ఉత్పాదక భాగస్వాములను, వినిమయ భాగస్వాములను చేయగలిగే సమాజం కోసం ప్రపంచంలో బహుముఖీన పోరాటాలు జరుగుతున్నాయి. అవి వివిధ దశల్లో వున్నాయి ఏ సిద్ధాంతం మీద ఆధారపడిన సమాజం ఈ పోరాట క్రమానికి అతీతం కాదు. ఈ పోరాట క్రమాలు అవసరం లేని సర్వే సర్వత్రా, నూటికి నూరుమందికి, నూటికి నూరుపాళ్ళు ఉపయుక్తమైన, లబ్ధికారకమైన, ప్రయోజనదాయకమైన మానవ సమాజం. ఇంతవరకూ ఎక్కడా భూమిపై ఏర్పడలేదు. ఈ కోవకు చెందిన సమాజం ఒక సుదూర స్వప్నమైనా, మానవుడు ఈ లక్ష్యం నుంచి విరమించలేదు.

**ఒక సాదా సీదా పల్లెటూరు, ఓ మోస్తరు టౌనై, టౌను ప్రజల బతుకు రీతులు ఒకటొకటే దిగుమతై, అటు పూర్తిగా పట్నం కాలేక, ఇటు పల్లెగా మిగల్లేక ఎలా సతమతమవుతుందో, ఆ పరిణామం డెమోక్లిస్ కత్తిలా ఎలా భారతీయ గ్రామీణ విశాలత పై హాయిలొలుకుతూ వేలాడుతున్నదో అందుకున్న ఒక లఘు డాక్యుమెంటరీ ఫిక్షన్ "యజ్ఞం".**

దీన్ని చాలా సరళంగా అర్ధం చేసుకుని వేరుగా, ఉన్నతంగా అర్ధం చేసుకున్న వారిని జ్ఞానులు అని ఇన్వర్టెడ్ కామాల్లో పెట్టి వెటకరించడం ఒక నష్టదాయకమైన అసహనానికి గుర్తు.

ఈ విషయాలు గుర్తెరగకుండానే ఎంత జ్ఞానదర్పం ప్రదర్శిస్తాడంటే విద్యాసాగర్ "దేశ నమూనా ఏ దశల గుండా సాగితీరుతుందనే సూత్రాల పట్ల అవగాహన లేకపోవడం వలన..." కారా మాస్టారు ఈ కథలో ఇలా రాశారు అనేది అభ్యంతరకర వ్యాఖ్యల్లో పతాక స్థాయికి చెందినది. 1947 తర్వాత ఒక గణతంత్ర దేశంగా ఏర్పడిన మనం, ఈ అరవై ఏళ్ళ పై చిలుకు కాలంలో విశాల జన హితం కోరే నమూనాగా వున్నామని, ఎంతోమంది ఏ సిద్ధాంతాలను తమ అత్యున్నత ధర్మాసనాల పిచారి సమర్ధించలేని సుప్రీం కోర్టు న్యాయమూర్తులే ఒప్పుకోవడం లేదు. తాజా ఉదాహరణలు జస్టిస్ బి. సుదర్శనరెడ్డి వెలువరించిన తీర్పులు, జస్టిస్ మార్కండేయ కట్జూ వెలువరించిన తీర్పులు వీరు రచయితలు కారు. వీరికి యజ్ఞం కథ తెలీదు. (తెలుగువారు కనుక జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి గారికి తెలుసు అని నా విశ్వాసం, ఎందుకంటే మన ఊరి కథా రచయిత రామకోటి గారి గురించిన వారి ప్రసంగం విన్నాను కనుక వీరెవ్వరూ (ఇంకా ఎందరో హైకోర్టు మరియు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు) "ఈ దేశపు నమూనా ఏ దశల గుండా సాగి తీరుతుందనే సూత్రాల పట్ల" అవగాహన లేనివారు కాదు. కానీ వారికీ ఈ సోకాల్డ్ నమూనా పట్ల గంభీర స్థాయిలో అభ్యంతరాలు, ప్రత్యామ్నాయ అభిప్రాయాలు వున్నాయి. దేశవ్యాప్తమైన ఈ ప్రగతి 'ఎదుగుదల' 'అభివృద్ధి' అనే మాటలు ప్రాతినిధ్యం వహించే మార్పుల పట్ల, అవగాహన లేకుండా కారా మాస్టారు ఈ కథ రాశాడని విద్యాసాగర్ వ్యాఖ్యానించడం లార్జర్ పిక్చర్‌ని మిస్సయ్యి ఇన్‌సెట్‌లో కన్పించేది (అంతర చిత్రం) చూసి అదే మొత్తం చిత్రం అని భ్రమిస్తున్నట్టుగా వున్నది.

కొత్త ఉపాధి మార్గాలకై బీదల వెంపర్లాట, అందులో వారు పొందే వైఫల్యాలు వాస్తవ చిత్రణే కానీ, కొత్త ఉపాధులకై మానవజాతిప్రయత్నాలను నిరుత్సాహపరిచే, నీరుగార్చే అంశం కాదు. ఆ మాట కొస్తే ఈ కొత్త ఉపాధి మార్గాల వెతుకులాట, గ్రామాలలో అవకాశాలు మూసుకుపోవడం 1930 – 40 కాలంలో శ్రీశ్రీ గీతం బాటసారితోనే మొదలయింది. ఆ గీతం చిత్రణను ఈ ఉద్రేకి అయిన యువకుడు, కారా మాస్టారి కథలోని ప్రస్తావిత ప్రజల కొత్త ఉపాధి మార్గాలకై వెంపర్లాటను, తరలి పోవడం వెనుక గల ప్రమాదాలను ఆయన సూచనప్రాయంగా ప్రస్తావిస్తే "బతుకు తెరువు కోసం నూతన మార్గాలను అన్వేషించాలని తలుచుకునే వారికి కూడా అలా తలుచుకోకూడదని ఛేదించే ఒక తిరోగమన అంశంగా" తనదైన శైలిలో వ్యాఖ్యానించిన విద్యాసాగర్, ఇదే వ్యాఖ్యలను, విపరీత పరిమితులు గల అవగాహనతో శ్రీశ్రీ గీతం బాటసారికీ అన్వయించినా మనం ఆశ్చర్య పోనక్కరలేదు. ఎందుకంటే అది కూడా శ్రీశ్రీ చెప్పినదాన్ని కొంచెం Paraphrage చేస్తే సరిపోతుంది. "కొంతమంది కుర్రవాళ్ళు అక్కసుతో కృద్ధులు."

ఒక సాదా సీదా పల్లెటూరు, ఓ మోస్తరు టౌనై, టౌను ప్రజల బతుకు రీతులు ఒకటొకటే దిగుమతై, అటు పూర్తిగా పట్నం కాలేక, ఇటు పల్లెగా మిగల్లేక ఎలా సతమతమవుతుందో, ఆ పరిణామం

డెమోక్లిస్ కత్తిలా ఎలా భారతీయ గ్రామీణ విశాలత పై హాయిలోలుకుతూ వేలాడుతున్నదో అందుకున్న ఒక లఘు డాక్యుమెంటరీ ఫిక్షన్ "యజ్ఞం". ప్రతి వాక్యానికీ ఆనాటి సమాజంలో నిజంగా ఆధారాలున్నాయా, లేవా, లేకపోతే ఆ రచయిత "జ్ఞాని", "విరుద్ధ వ్యాఖ్యాత", "తప్పుడు పరిష్కర్త", "అవగాహన లేనివాడు" నగరజీవి కావడం వల్ల పల్లెటూరి జీవితంలోకి నగరాల మార్పుల్ని కృత్రిమంగా అద్దే ప్రయత్నం చేశాడు" అంటూ పొసగని అభ్యంతరాల పేకమేడలు గట్టడం, పైపెచ్చు ఒక 'వర్క్ ఆఫ్ ఆర్ట్'కు వుండే స్థల, కాల, ప్రత్యేక స్థితిగతుల నిర్దిష్టతను సాహిత్య విశాలతలో స్వీకరించకుండా, ఒక జిల్లా స్పెషలిస్టుగా మాట్లాడటం విచిత్రమైన అంశంగా తోస్తుంది.

ఇక ముగింపు కొస్తూ విద్యాసాగర్ తన వ్యాఖ్యల్ని తామరతంపరగా చేసిన తీరు గమనిస్తాము. తన మార్కు వ్యాఖ్యే ఇది. "తప్పుడు చైతన్యాన్ని పాత్రలోకి కృత్రిమంగా ప్రవేశపెట్టారు. ఇది అత్యంత దురదృష్టకరమైన చర్య. శీరావులు నాయుడిచ్చిన తీర్పుని కాదని సీతారావుడిచ్చిన తీర్పు తెలుగు సాహిత్యంలో దాదాపు యాభై ఏళ్ళుగా సుప్రసిద్ధం! వివాదభరితం! జ్వాలాముఖి, రంగనాయకమ్మలు వ్యతిరేకించిన దానికన్నా, కొత్తగా విద్యాసాగర్ తెలిపినదేమీ లేదు. ఈ వ్యాఖ్య ద్వారా 'యజ్ఞం' కథ ముగింపుపై తనూ తీర్పుకి కూచున్నానని, తీర్పరి గొంతుకతో జడ్జిమెంటల్‌గా విద్యాసాగర్ స్పందించాడు. దానికి ముందర తను ఓపికతో కట్టిన అభ్యంతరాల పేక మేడ ఎలానూ ఉంది.

**1964లో కారా మాస్టారు రాసిన 'యజ్ఞం' కథ వెలువడింది. తెలుగు సాహిత్యంలో ఈ కథకున్న స్థానం, విలువ నలుగురూ ఎరిగినదే. కావాలంటే కథకు అర్ధ శతాబ్ది పునర్మూల్యాంకనం 2014లో చేసుకుందాము కానీ, ప్రస్తుతానికి ఈ కథను ఈ వ్యాసంలో నేనూ, నా వ్యాసంలో విద్యాసాగర్ విశ్లేషించి చర్చించాము కనుక ఆ విపులీకరణలను భవిష్యత్తుకై కేటాయించి, ఈ కథలో చావుకు ముగింపులో సీతారావుడి పాత్ర ద్వారా ప్రవేశపెట్టిన తీరును ప్రేమ్‌చంద్ "కఫన్"తో పోల్చి మన సెన్సిబిలిటీస్‌ను సంపన్నం చేసుకుందాము.**

'యజ్ఞం' కథపై ఆ కథకు, తెలుగు సమాజానికి సంబంధించి వెనుకటితరం సాహితీవేత్తలు మాట్లాడితే చెల్లుబాటయినట్టు, గౌరవ వివాద ప్రతిపత్తి లభించినట్టు 2011లో ఈ తరంలో కనీసం సాహిత్య విమర్శ చేస్తున్నాననుకునేవారు ఎవరైనా మాట్లాడితే చెల్లుబాటు కాదు. కారణం విస్తృతంగా అందుబాటులో వున్న సంబంధిత, దేశీయ, అంతర్దేశీయ సాహిత్య సమాచారం. ఇది ఎరుకలోకి తెచ్చుకోకుండా ఎవరు మాట్లాడినా, వెనుకటి తరం సాహితీవేత్తలకు దక్కిన గౌరవం సైతం దూరమవుతుంది. అంతేగాక ఒక అవుట్ డేటెడ్ పద్ధతిలో వర్తమానంలో స్పందించిన దాఖలా మిగులుతుంది.

'యజ్ఞం' కథ గురించి, ఇది మానవ సమాజపు సమిష్టి అనుభవంలో ఒక భాగం అనుకుంటే, ఇతర భాగస్వామ్య సాహిత్య సృజనలు, యజ్ఞానికి సమాంతరమైన రచనలు, ఎత్తుబడులు, ముగింపులు, ఆరంభాలు వున్నాయా అని తెలుసుకోవాలి. అవి నేటి సాహిత్య పరిశీలకుడికి అత్యవసర సామగ్రి. అలా తెలుసుకోలేని వేళ ఎటువంటి రచనలొస్తాయనేదానికి విద్యాసాగర్ వ్యాసం ఒక ఉదాహరణ.

'యజ్ఞం' కథకు ముందు 1936లో ప్రేమచంద్ రాసిన కథలో (కఫన్) తమ పట్టనితనం (అలసత్వం) కారణంగా ఇప్పుడు లుంపెన్ పాత్రలు తండ్రి, కొడుకూ చేజేతులారా తమ ఇంటికి చెందిన మహిళ (ఒకరికి భార్య, మరొకరికి కోడలు)ను చావుకొదిలేసిన విదారక దృశ్యం వుంది. ముందే చెప్పుకున్నట్టు తన నిండు వయస్సులో ప్రేమ్‌చంద్ ఈ కథ రాశారు. ఇదే ఆయన రాసిన ఆఖరు కథ. ఈ కథలో మరణం ప్రసవ వేదనలో వున్న నిస్సహాయ స్త్రీపై రుద్దబడింది. ఇది సీతారావుడు చేసిందాని కన్నా తీవ్రమైనది అయినా హిందీ సాహిత్యంలో, ప్రపంచ సాహిత్యంలో (ఎందుకంటే ఈ కథ విస్తారంగా అనువాదం అయ్యింది, చలన చిత్రంగా వెలువడింది, నాటకంగా ప్రదర్శిత మయింది). ఎవరూ ఈ కథలో అమానవీయతను, తప్పుడు చైతన్యాన్ని వెదకలేదు.

1964లో కారా మాస్టారు రాసిన 'యజ్ఞం' కథ వెలువడింది. తెలుగు సాహిత్యంలో ఈ కథకున్న స్థానం, విలువ నలుగురూ ఎరిగినదే. కావాలంటే కథకు అర్ధ శతాబ్ది పునర్మూల్యాంకనం 2014లో చేసుకుందాము కానీ, ప్రస్తుతానికి ఈ కథను ఈ వ్యాసంలో నేనూ, నా వ్యాసంలో విద్యాసాగర్ విశ్లేషించి చర్చించాము కనుక ఆ విపులీకరణలను భవిష్యత్తుకై కేటాయించి, ఈ కథలో చావుకు ముగింపులో సీతారావుడి పాత్ర ద్వారా ప్రవేశపెట్టిన తీరును ప్రేమ్‌చంద్ "కఫన్"తో పోల్చి మన సెన్సిబిలిటీస్‌ను సంపన్నం చేసుకుందాము. అనేక పురాలలో జరుగుతున్న మార్పుల ప్రక్రియ, పరిమార్చే ప్రక్రియ ''యజ్ఞం''. కనిపించిన బలిపశువు సీతారావుడి కొడుకు. నిజానికి ఆ కథలో పాత్రలందరూ కాబోయే బలిపశువులే సమాజ యజ్ఞంలో.

ప్రేమ్‌చంద్ కథకు, కారా మాస్టారి కథకు పోలిక పడిపోలేదు అనే వితండవాదులు, విభిన్నవాదులు. ఈ స్థానిక, జాతీయ సృజన రూపాల సమాచారం జీవన దర్శనం, సమాజ స్వభావం సంతృప్తినివ్వకపోతే వారికి నా అభినందనలు. వారికోసమే ఈ అంతర్జాతీయ ప్రస్తావన. అయితే ఈమె మన కారా కన్నా వెనుకగా చాలా ఏళ్ళకు రాసింది. ఆమెకు ప్రేమ్‌చంద్ కథ తెలిసే అవకాశం వుంది. కానీ కారా "యజ్ఞం" తెలిసే అవకాశం లేదు. ఆమె ఎవరు?

1987లో "ది బిలవ్‌డ్" నవల రచించిన టోనీ మారిషన్. ఆమె నీగ్రో బానిసల జీవితాల గురించి, 1873లో జరిగిన వాస్తవ గాథకు అనుసారంగా, బానిస స్త్రీ సెథె తన పిల్లలతో పారిపోయి వేరే రాష్ట్రానికి తలదాచుకోను పోతే, ఆమెను వెంటాడుతూ వస్తారు తెల్ల యజమానులు. నడక వచ్చిన పిల్లలు చెల్లాచెదురు కాగా, తన చేతులలోని ఏడాదిన్నర పిల్లను, ఎక్కడ ఏడిస్తే తన జాడ తెల్సి పోతుందనోనని పీకనొక్కి చంపివేస్తుంది సెథె. ఆ పసిపిల్ల పాత్ర పదే పదే, ఏళ్ళు గడుస్తుంటే ఎదిగి తనింట్లోనే మరో పిల్లగా వచ్చినట్టు భ్రమలో వుంటుంది ఈ తల్లిమనసు. కారా మాస్టారి యజ్ఞం కథ ఎక్కడ ముగుస్తుందో అక్కడ మొదలవుతుంది టోని మారిసన్ ది బిలవ్‌డ్! దీన్ని చాలాకాలం క్రితమే 'సూర్య' దినపత్రిక 'అక్షరం'లో ప్రత్యేక వ్యాసంగా తెలియపరిచాను. నేను ఈయనతో పాటు ఇంకో అయిదుగురు తెలుగు

రచయితలు, కవయిత్రులు ఎలా జాతీయ, అంతర్జాతీయ రచయితల కన్నా ముందుగా తామీ అడుగు వేశారో తెలిపిన వ్యాసం అది. మాన్యుల మెప్పు పొందింది.

టోని మారిసన్‌కు ఈ నవలకు గాను 1988లో పులిట్జర్ బహుమతి లభించింది. ఆమె యావత్తు సాహిత్య కృషికి గాను, 1993లో నోబెల్ బహుమతి అందుకున్న తొలి నల్లజాతి మహిళ, సాహితీవేత్త టోని మారిసన్.

ఆమె నవల "ది బిలవ్డ్"ను ది డార్క్ నావెల్‌గా ఆమె పేర్కొంటూ మరణించిన ఎందరో మిలియన్ల నల్లజాతి ప్రజల కోసం నా ఈ నవల అని అంకితం ఇచ్చింది. మరి ఆమె నవలను దాని ఆరంభ ప్రతిపాదనను మొత్తం ప్రపంచ సాహిత్యంలో ఎవరూ 'సామాజిక చలన క్రమాన్ని తిరగరాసే ప్రయత్నంగా వుంది' అని కారా మాస్టారి 'యజ్ఞం' గురించి మన విద్యాసాగర్ అన్నట్టుగా ఈ పాతికేళ్ళ కాలంలో అనలేదు.

కారా మాస్టారు రాసిన 'యజ్ఞం' కథకు ముందు జాతీయ సాహిత్యంలో ప్రేమ్‌చంద్ 'కఫన్' వుంది. తరువాత అంతర్జాతీయ సాహిత్యంలో టోని మారిసన్ రాసిన 'ది బిలవ్డ్" వుంది. వీటిని సమాంతరంగా పరిశీలించడం నేటి సాంకేతిక సమాచార యుగపు సాహిత్యకారుడికి వుండాల్సిన ముఖ్య లక్షణం. సాహిత్యం ఏ భాషకూ, ఏ ప్రాంతానికీ, ఏ జాతికీ, పరిమితమైన, ప్రత్యేక వస్తువు కాదు. ఈ ఎరుకత, అనేక సిద్ధాంతాలు, ఉద్యమాలు వెనుకడుగువేసి, ప్రపంచవ్యాప్తంగా ప్రజానుకూల శక్తుల పునర్నిర్వచనం, పునఃరూపకల్పన జరుగు తున్న కాలంలో ఒంటెత్తు పోకడలకూ, ఏక కథా పరిమిత ప్రచలనాలకూ, ఏకదంపుడు వ్యాసాలకు వర్తమాన సాహిత్య యుగ స్వభావంలో స్థానం లేదు.

**కొ.కు గొప్పవాడా, కారా గొప్పవాడా, రావిశాస్త్రి, చాసో ఎంతసేపు వీళ్ళేనా ఉత్తరాంధ్ర కథ అంటే అని అనుకొంటున్న వారు లేకపోలేదు. అసలు ఈ నలుగురు కానీ, ఇంకెందరు కానీ వారి మధ్య పోలికలు వెదికి అభిమాన, దురభిమాన బృందాలుగా ఏర్పడటం ఒక అనారోగ్యకారక మనస్తత్వం.**

ఇక పెట్టుబడి గురించి ఈ వ్యాసంలో మాటలో మాటగా విద్యాసాగర్ వెలిబుచ్చిన అభిప్రాయాలు అత్యంత అభ్యంతరకరం. ప్రజలు ఓడిపోతారు, పెట్టుబడి గెలుస్తుందనే ఆత్మ విధ్వంసకర సరళీకరణ చేసిన విద్యాసాగర్ యజ్ఞం కథలో సీతారావుడి కన్నా, ప్రేమ్‌చంద్ కథలోకి దురదృష్టవంతుల కన్నా, టోని మారిసన్ పాత్ర సెథె కన్నా వీరు చైతన్యం గలవాడూ, గొప్పవాడూ ఎలా అవుతాడు. ఈ వ్యాఖ్యలు, పెట్టుబడి – ప్రజలు అనే మరో విస్తృత వ్యాసానికి దారితీస్తాయి అని భావిస్తూ తన అపార మేధను ప్రత్యేకించి శక్తిని ప్రజాపరం చేసే యజ్ఞంలో సహనశీల సంస్కృతితో, మహోన్నత సంస్కారంతో వినియోగించి, ప్రజలకు ఉపయుక్తమై వుండే విలువైన వనరుగా మారే క్రమంలో కృషి కొనసాగించవలసిందిగా యువకుడూ, సాహిత్య, పరిశీలనా దక్షత గలవాడిగా ఎదగవలసిన వాడూ అయిన విద్యాసాగర్‌ను కోరుతున్నాను.

మారుతున్న కాలాన్ని బట్టి మారే ప్రజల ఆలోచనల్ని గుర్తెరగలేకపోయాడు కాబట్టే శీరావులు నాయుడ్ని, సీతారావుడు ఎర్రిపీరువి అన్నాడు. ఎందుకంటే ముగింపులో జరిగిన సంఘటన తర్వాత శీరావులు నాయుడు సుందరపాలెంలో మునుపటి గౌరవాల్ని పొందలేదు. అలుడ్ని బలుడు కొడితే బలుడ్ని వాడ్ని మించిన వాడు కొట్టే వ్యవస్థ వచ్చిపడింది. ఈ ఉరవడిలో శీరావులు నాయుడి గ్రామ పెద్దరికమూ, ఇప్పుడో ఇక కొద్దికాలంలోనో "ఖర్చు రాసేయదగ్గ వ్యర్థ పదార్థమే" అతను తదుపరి అవతారంలో ఒక పెట్టుబడిదారు కావచ్చేమో కానీ, గ్రామీణ సమాజానికి సంబంధించినంతవరకూ తనూ చెదిరిపోతాడు. 'రొట్టె ముక్కలు దొరకకపోతే కేకులు తినొచ్చు కదా!" అన్న ఫ్రెంచి రాజవంశీకురాలి మల్లే. ఆమెను గిలటినె చేయబోయే ముందు ఆమె అజ్ఞానానికి జాలిపడిన ఫ్రెంచిప్రజల క్రూరమైన జాలితోనే సీతారాముడు శీరావులు నాయుడ్ని "ఎర్రిపీరు" వన్నాడు. కథలో పాత్రల ఆలోచలనపై మాటలు ఆ కథా రచయితలు వ్యాఖ్యలు (కథాంతర్గతంగానే) చేయాలని విద్యాసాగర్ ఆశిస్తున్నాడు కానీ కథ మొత్తంగా సమాజంపై వ్యాఖ్య అయిన శిల్ప రహస్యం ఇతనికి వంటబట్టినట్టు లేదు.

చివరగా కథ, "పాత మంచిదనుకునే వాళ్ళూ, పాత పాతర్లు తవ్వుకునేవాళ్ళూ" వీరికి సానుకూలంగా నడించిదన్నది విద్యాసాగర్ వ్యాఖ్య. ప్రపంచ సాహిత్యం, జాతీయ సాహిత్యం వీటిలో అంశీభూత రాశి ఏ స్థానిక భాషా రచనైనా సరే పాత పద్ధతులలో రచన జరిగితే, సీతారావుడి సంవేదన ఏ పాపభీతి తోనో, పుణ్యం పట్ల ఆకర్షణ తోనో, కర్మ సిద్ధాంత వైరాగ్యంతోనో ముగిసిపోయేది. అపుడిది కారా మాస్టారే రాయనక్కరలేదు.

పాత సమాజమే పిగిలి పోతున్నపుడు అందులోకి వ్యధార్త జీవుల యధార్థ దృశ్యాలు యజ్ఞంలో వున్నాయి. ఇన్ని మాటలెలాగూ అన్నాను కదా, చివరాఖర్ని ఈ కథ 'పాత మంచిదనుకునే వాళ్ళు కొమ్ము కాసే కథ' అని అర్థం వచ్చే బండరాయి పడేస్తే పోలా అని ఈ పని చేశాడు విద్యాసాగర్. యజ్ఞం కథ స్ఫూర్తి నేపథ్యంలో. ఇంత పేలవమైన, ప్రయోజన శూన్యమైన వ్యాసం ఇంకొకటి రాలేదు. కొ.కు గొప్పవాడా, కారా గొప్పవాడా, రావిశాస్త్రి, చాసో ఎంతసేపు వీళ్ళేనా ఉత్తరాంధ్ర కథ అంటే అని అనుకొంటున్న వారు లేకపోలేదు. అసలు ఈ నలుగురు కానీ, ఇంకెందరు కానీ వారి మధ్య పోలికలు వెదికి అభిమాన, దురభిమాన బృందాలుగా ఏర్పడటం ఒక అనారోగ్యకారక మనస్తత్వం. కారా మాస్టారి రచన 'యజ్ఞం'పై ఈ వ్యాసం వెనుక ఎవరెవరి ఆలోచనలున్నా వారు తెలుసుకోవాల్సిందొక్కటే. గణాంకాల్ని పోగేసి, పాఠకుల్ని సందిగ్ధతలో ముంచి ఏ మంచి కథకుడ్నయినా, అతని కథల్నయినా జనం గుండెలలోంచి చెరిపెయ్యాలనుకునే ప్రయత్నాలు బెడిసికొడతాయి. నలుగుర్నీ కలగలుపుకుని మహాజన వేదికలు నిర్మించాల్సిన ఈ కాలంలో మన ఉత్తమ రచయితల్ని మనమే నిరసించుకునే ధోరణి వల్ల ఇతర సాహిత్య సమాజాల ముందు చిన్నబోతాము.

తెలుగు కథాప్రస్థానంలో "యజ్ఞం" ఒక మైలురాయి. పేదల పక్షాన గొంతు ఎత్తిన సమాజ యజ్ఞపు స్వేదర్షి కాళీపట్నం రామారావుగారు.

**సెల్ : 98402 00385**

అనువాద కథ

# ప్రేమకు కూడా




**తమిళ మూలం : కశ్యపన్**

**హిందీ నుండి తెలుగు : మనస్విని**

**ఉదయం ఏడు గంటలై వుంటుంది. రాఘవన్ సోఫాలో కూర్చుని 'హిందూ' చదువుతూ, చదువుతూ నిద్రపోయాడు.**

**దీపావళి.. ప్రొద్దున నాలుగు గంటలకు లేచి, స్నానం చేసి, కొత్త బట్టలు, మిఠాయిలు, టపాకాయలు... అన్నీ పూర్తయిన తరువాత ఇంట్లో శాంతి ఏర్పడింది.**

ఎవరో వచ్చినట్లనిపించడంతో రాఘవన్ మేలుకున్నాడు. పక్కింటి నుండి దీపావళి మిఠాయిలొచ్చాయి.

"లక్ష్మీ! రాఘవన్ పిలిచాడు. లక్ష్మి వచ్చింది. పక్కింటి అమ్మాయి దగ్గర మిఠాయిలు తీసుకొని లోపలికెళ్తోంది.

"మన మిఠాయిలిచ్చావా?"

"ఒక్కొక్కరికి పంపుతున్నాను" లక్ష్మి చెప్పింది.

"మరియదాస్ ఇంటికి పంపావా?"

"సుందరి తీసుకెళ్ళింది."

సుందరి రాఘవన్ కూతురు. రాఘవన్ గడియారం చూశాడు. ఏడు యాభై. వార్తలు చూసేందుకు టి.వి. ఆన్ చేశాడు.

రామజన్మభూమి సమస్య విషయమై జరుగు సమావేశంలో భా.జ.పా. పాల్గొనడం లేదు.

రాఘవన్ వార్తలు వింటూ వుండగా సుందరి పరుగెత్తుకుంటూ వచ్చింది.

"అప్పా"

"ఎందుకు అరుస్తున్నావు? వార్తలు చూస్తున్నాను. కనిపించడం లేదూ."

సుందరి మొహం చిన్నబోయింది

"లేదు... అప్పా" చెప్తూ చెప్తూ ఏడుపు ముఖం పెట్టింది.

పాపం చిన్నపిల్ల! ఏడాదికి ఒక్కదినం సంతోషకరమైన దినం.

తనను తాను సంభాళించుకొంటూ అడిగాడు. "ఏమిటమ్మా!"

"మరియదాస్ అంకుల్ ఇంటికి తాళం పెట్టి వుంది" సుందరి చెప్పింది.

రాఘవన్‌కు కోపం వచ్చింది. ఎక్కడికి వెళ్ళి వుంటాడు తాళం వేసి?

ఆ కాలనీలో దాదాపు అరవై, డెబ్బై ఇళ్ళుంటాయి. అందరూ ఒకే ఆఫీసులో పని చేసేవారే.

దీపావళి సమయంలో అందరూ మరియదాసు, ముత్తలీఫ్‌ల ఇళ్ళకు మిఠాయిలు పంపిస్తారు. ఆ ఇద్దరూ దీపావళి జరుపుకోరు. క్రిస్మస్ కేక్ మరియదాస్ ఇంటి నుండి అందరి ఇళ్ళకూ వెళ్తుంది. అతడు సుదూర దక్షిణ ప్రాంతంవాడు. రిబ్బన్ పకోడీలు, చంగిలీ మురుకులు పంపిస్తాడతడు.

రంజాన్ సమయంలో ముత్తలీఫ్ ఇంటి నుండి మిఠాయిలొస్తాయి.

మరియదాస్ ఎప్పుడూ సరదాగా చెప్తూ వుంటాడు. "రాఘవ్! దీపావళి రోజు నీవు నీ యింటి మిఠాయిలు మాత్రం తింటావు. కాని నాకు రకరకాలైన పదార్థాలు దొరుకుతాయి తినడానికి" అని.




ఆ కాలనీ వయసు ఇరవై ఏళ్ళు. అప్పటి నుండీ అలాగే జరుగుతోంది. అతనికి బాగా గుర్తుంది. నాలుగేళ్ళ క్రితం మరియదాస్ అన్నాడు. "మిఠాయిలు పంపించకు బ్రదర్! నా కూతుర్లందరూ పెద్దవాళ్ళయ్యారు. అందరిళ్ళకూ మిఠాయిలు తీసుకెళ్ళాలంటే సిగ్గుపడుతున్నారు."

"నీవు క్రిస్మస్ కేక్ ఇస్తావని మేము దీపావళి మిఠాయిలు పంపిస్తున్నామా ఏమి?"

"అలా కాదు. కాని, మొహమాటంగా వుంటుంది కదా!"

"ఇక చాలు. అనవసరంగా మాట్లాడకు." సంభాషణ అంతటితో ముగిసింది.

ఆ సంవత్సరం క్రిస్మస్ ముందురోజు స్వయంగా మరియదాసే వచ్చి కేక్ ఇచ్చి వెళ్ళాడు.

మరుసటి రోజు రాఘవన్ అతన్ని మందలించాడు. "అందరి గడపలూ ఎక్కి, దిగి నీవే ఇవ్వాలా? ఇవ్వలేదని ఎవరన్నారు?"

"అందుకే, దీపావళికి అవన్నీ పంపించవద్దంటాను" దాస్ చెప్పాడు.

"మళ్ళీ అదే మాట?" రాఘవన్ ఆ సంభాషణను అంతటితో ముగించాడు.

గత సంవత్సరం దీపావళికి మిఠాయిలు పంపించినప్పుడు కూడా తలుపులు మూసే వున్నాయి.

మరుసటి రోజు ఆఫీసులో రాఘవన్ మరియదాసును అడుగగా, చిన్నమతూరు వెళ్ళినట్లు చెప్పాడు.

ఈ సంవత్సరం కూడా... ఎక్కడికి వెళ్ళివుంటాడు? రాఘవన్‌కు చటుక్కున గుర్తొచ్చింది. దీపావళి మిఠాయిల నుండి తప్పించుకొనేందుకు... అందుకే... అయివుంటుంది... నా యింటి మిఠాయిలక్కరలేదు... గత సంవత్సరం కూడా... ఆలోచిస్తూ... ఆలోచిస్తూ... కోపాన్నాపుకోలేకపోయాడు.

మరుసటి రోజు రాఘవన్ ఆఫీసుకు వెళ్ళాడు. కేంటిన్‌లో మరియదాసును చూడగానే ఉప్పెనలా విరుచుకుపడ్డాడు.

"ఏమండీ! నా యింటి మిఠాయిలు తమరి గొంతులోకి దిగవు కాబోలు. ఇష్టం లేకపోతే చెప్పొచ్చు కదా! అందుకోసం నూటయాభై రూపాయలు ఖర్చు పెట్టుకొని, కుటుంబంతో సహా చిన్నమనూర్ వెళ్ళాల్సిన పనిలేదు. నా పిల్లలు తినేదే నీ పిల్లలు కూడా తిననీ అని యిస్తాం. నీవు తినవద్దు. సరే! పిల్లలకు ఇవ్వటానిక్కూడా అభ్యంతరమా! నీవు కూడా ఒక మనిషివేనా?"

కేంటిన్‌లో అందరూ తిరిగి చూశారు. తానంత కోపం ప్రదర్శించకుండా వుండవలసిందని రాఘవన్‌కు అనిపించింది.

మరియదాస్ చాలా మృదు స్వభావి. గట్టిగా మాట్లాడటం కూడా ఎరుగడు.

"సారీ బ్రదర్!" అంటూ రాఘవన్ చెయ్యి పట్టుకొని, ఒక మూలకు తీసుకెళ్ళాడు. "సారీ బ్రదర్! నీ మిఠాయిల్ని నా పిల్లలే కాదు నేను కూడా తింటాను."

"అందుకేనా ఇంటికి తాళం వేసి వెళ్ళావు?" రాఘవన్ అడిగాడు నిష్ఠూరంగా.

"మెల్లగా మాట్లాడు బ్రదర్! నన్ను సరిగ్గా అర్థం చేసుకో. కాలనీలో నేను ఒక్కణ్ణి. నాకిచ్చేవాళ్ళు యాభై ఆరు ఇళ్ళ వాళ్ళు. మీ అపరిమిత ప్రేమను తట్టుకొనే శక్తి నాకు లేదు." అతని కళ్ళు నీళ్ళతో నిండి, వర్షించేందుకు సిద్ధంగా వున్నాయి.

కేంటిన్ నుండి మెల్లగా బయటికొచ్చిన మరియదాసు మనసు భారంగా వుంది.

ఇంటిలో రాత్రి టి.వి. చూస్తూ కూర్చున్నాడు రాఘవన్.

ఉత్తరప్రదేశ్‌లోని కొండా జిల్లాలో కర్నల్ గంజ్ గ్రామంలో జరిగిన హత్యాకాండలో స్త్రీలు, పిల్లల్తో సహా అరవై మంది మరణించారు. మరణించిన వాళ్ళందరూ అల్పసంఖ్యాక వర్గానికి చెందినవారు.

రాఘవన్ టి.వి. ఆఫ్ చేసేశాడు. ప్రేమను కూడా సహించలేని అల్ప సంఖ్యాక వర్గీయులు... ఎలా.. ఆక్రమణను సహించగలరు?

ఆ రాత్రి అతడు నిద్రించలేకపోయాడు.

•

# కొత్త పుస్తకాలు




## ముందే మేలుకో...

(వైద్య విజ్ఞాన కథలు)

– వల్లూరు శివప్రసాద్


వెల : రూ.75/– పేజీలు : 135

**ప్రతులకు : 040-24744580**

**(విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు)**

ఈ కథలు విషయ ప్రధానమైనవి. ఈ కథల్లో సంక్లిష్టత కనిపించదు. సంక్షిప్తత, సరళతలే ప్రధానంగా నడిచాయి. శాస్త్రీయత, వాస్తవికతలకు తన అనుభవ జ్ఞానాన్ని జోడించి సంక్షేమ దృష్టితో శివప్రసాద్ రాసిన ప్రయోజనకర కథలివి. పాఠకులలో వైద్య విజ్ఞానాన్ని గురించి ప్రాథమిక అవగాహన కలిగిస్తాయి. ప్రభుత్వ ఆసుపత్రులంటే సమాజంలో నెలకొని వున్న చిన్న చూపును పోగొట్టే ప్రయత్నాన్ని కూడా శివప్రసాద్ ఈ కథల ద్వారా చేశాడు.

**– పెనుగొండ లక్ష్మీనారాయణ**




## అంకురం

(మినీ కవితా సంపుటి)


– మల్లవరపు విజయ

వెల : రూ.50/– పేజీలు : 105

**ప్రతులకు : 9989326248**

అంకురం మినీ కవిత సంపుటిలో రెండొందలకు పైగా వున్న యీ చిన్ని కవితల్లో ఎన్నెన్నో విషయాలు మనకన్నిపిస్తాయి. సమాజాన్ని చదివే అలవాటున్నప్పుడే తప్పటడుగుల గురించి చెప్పడం జరుగుతుంది. కాబట్టి విజయగారి వీక్షణంలో వినూత్నమైన కవిత్వాంశ వుందని చెప్పక తప్పదు మరి.

**– కన్నోజు లక్ష్మీకాంతం**




## భారతదేశంలో పౌర సమాజం

– వాసిరెడ్డి భాస్కరరావు

వెల : రూ.30/– పేజీలు : 98

**ప్రతులకు : 9390101251**

పౌర సమాజం గురించి ఇంగ్లీష్‌లో చాలా రచనలు వున్నాయి. కాని తెలుగు భాషలో పెద్దగా వున్నట్లు లేదు. కనుక తెలుగులో పౌర సమాజం గురించి, ముఖ్యంగా భారతదేశంలో నున్న పౌర సమాజం గురించి కొంత సమాచారం సేకరించి, తెలుగులో ఈ రచన చేశాను.

**– వాసిరెడ్డి భాస్కరరావు**




## కాలస్పర్శ (కవిత్వం)

– ఎరుకలపూడి గోపీనాథరావు

వెల : రూ.50/– పేజీలు : 94

**ప్రతులకు : 98482 93119**

మనిషి యాంత్రిక జీవితంలోకి కూరుకుపోతున్న సందర్భాన్ని గూర్చి గోపీనాథరావు చాలా ఆవేదనను ప్రకటిస్తారు. వాస్తవిక అనుభవాల్ని కవితాత్మకంగా చెప్తారు. ఈ అనుభవాలు ప్రతి వ్యక్తికీ ఏదో ఒక సన్నివేశంలో ఎదురయ్యేవే. కవి చెప్పే తీరులో వైచిత్రి ఉంది.

**– డా॥ అద్దేపల్లి రామమోహనరావు**




## షూలమ్మీతీ... షూలమ్మీతీ. !!

(ప్రణయ కవిత్వం)


– డా॥ కొండెపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్

వెల : రూ.100/– పేజీలు : 64

**ప్రతులకు : 94402 11120**

మగవాడి ప్రేమలోని నిజాయితీకి, సంస్కారానికీ, సున్నితమైన హృదయ సంస్కారానికి సంకేతంగా నిలిచే గీతాలివి. అద్భుతమైన భావచిత్రాలు, పద చిత్రాలు ఈ కవిత్వానికి నిండుదనాన్ని ఇచ్చాయి. సినిమాల కారణంగా ప్రేమ పట్ల దురభిప్రాయాలు చెలామణిలో వున్న ఈ కాలంలో ప్రేమలోని అసలు సారాన్ని, సారాంశాన్ని తెలిపే ఈ కవితల్ని ఆహ్వానించాలి. ప్రేమతత్వాన్ని తెలియజెప్పే ఈ షూలమ్మీతి కవితలు పదుగురికి వినిపించాలి. కవిత్వానికి ఉండాల్సిన సౌందర్యాత్మక గుణాన్ని ఇనుమడింపజేసే విధంగా ఈ గీతాల్ని రచించిన డేవిడ్ లివింగ్‌స్టన్‌కు అభినందనలు.

**– గుడిపాటి**




## మహనీయుల బడిచదువులు

వెల : రూ.60/– పేజీలు : 112


**ప్రతులకు : 040-27608107**

**(ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు)**

ఎంత గొప్ప ప్రయాణమైనా మొదటి అడుగుతోనే ప్రారంభమవుతుందన్నట్టు గానే ఎంతటి మహావ్యక్తుల జీవితాలైనా పాఠశాలలోనే తొలుత రూపు దిద్దుకుంటాయి. వారెన్ని శిఖరాలు అధిరోహించినా మొదట నేర్చిన పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులు తీర్చిదిద్దిన పరిసరాలను మర్చిపోలేరు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ కూడా సుప్రసిద్ధులైన పలువురు నాయకులు, మహాకవులు, రచయితలు, సంస్కర్తలు స్వయంగా అక్షరీకరించిన అనుభవాల సంకలనమే ఈ పుస్తకం.

**– ప్రచురణకర్తలు**

# కొత్త పుస్తకాలు




**ప్రజాపలుకు** (సమకాలీన పరిస్థితులపై కోయదొర రన్నింగ్ కామెంటరీ)

**- వుప్పల నరసింహం**

**వెల : రూ.150/- పేజీలు : 174**

**ప్రతులకు : 99857 81799**

ఈ పుస్తకంలో నాటి సమకాలీన పరిస్థితుల రన్నింగ్ కామెంటరీ కొంత కనిపిస్తుంది. ప్రధానంగా నన్ను నేను ఆవిష్కరించుకున్న వైనం ఎక్కువగా ధ్వనిస్తుంది. ఆనాటి నా స్థితిగతులు చాలావరకు ఇందులో దర్శనమిస్తాయి. కొన్నిచోట్ల కొండమామను నేనే. ఇతర పాత్రలు నేనే... రెండు దశాబ్దాల అనంతరం వీటిని చదివితే గతం గుర్తుకొస్తోంది.

**- వుప్పల నరసింహం**




**డా॥ దేవరాజు మహారాజు**

**ఆవరణం**

**- డి. కృష్ణకుమారి**

**వెల : రూ.200/- పేజీలు : 309**

**ప్రతులకు : 8106819844**

ఒక కవిగా, రచయితగా అప్రతిహతంగా అర్ధశతాబ్ది కాలం పాటు అన్ని ప్రక్రియల్లో కృషి చేస్తూ, అన్నింటిలో తనదైన ముద్ర వేసుకుని, భాషా సాహిత్యాలకు సంబంధం లేని వృత్తిలో వుండి, సారస్వత రంగంలో వేళ్ళూనుకుని వైవిధ్యం ప్రదర్శిస్తూ నిలబడినవారు డాక్టర్ దేవరాజు మహారాజుగారు. వీరి కృషి గురించి గత నలభై యేళ్ళ కాలంలో మహామహులంతా స్పందిస్తూ వచ్చారంటే అది వారి సహృదయత, హృదయ విశాలత్వం... అయితే, రచన పట్ల మహారాజుగారి నిజాయితీ, నిబద్ధతా మరొక కారణం.

**- శ్రీమతి డి. కృష్ణకుమారి**




**పిట్టల కాలనీ** (హైకూలు)

**- డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు**

**వెల : రూ.25/- పేజీలు : 46**

**ప్రతులకు : 9989461939**

నిన్నటిదాకా కురిసింది
వానా?
పచ్చికా?

పెద్దరికపు గద్దింపుకి
పాప తడిచూపు
జ్ఞాపకం లోతున తెగింది

**- డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు**




**భస్మ సింహాసనం** (ఏకాంకిక)

**- సరికొండ నరసింహరాజు**

**వెల : రూ.25/- పేజీలు : 36**

**ప్రతులకు : 94413 64022**

'ఒక విధ్వంసక ముఖచిత్రం'తో సాహిత్య ప్రస్థానాన్ని ఆరంభించిన 'సరికొండ' తొలి ప్రయత్నంలోనే సామాజిక చైతన్యంతో కలాన్ని చేతపట్టి కదం తొక్కారు. బహుముఖ ప్రజ్ఞతో ఎన్నో అవార్డులు పొందారు. 'ఒక్కే ఒక్క సిరా చుక్క'తో జతకట్టి నేడు 'భస్మసింహాసన'మే ఈ భూగోళమంటూ ఒక బీభత్స రస ప్రధానమైన దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించిన తీరు ప్రశంసనీయం.

**- కలిమిశ్రీ**




**రోడ్డు ప్రమాదం** (దీర్ఘకవిత)


**ఉప్పల అప్పలరాజు**

**వెల : రూ.50/- పేజీలు : 52**

**ప్రతులకు : 9849317608**

సెజ్‌లు, ధర్మల్ ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు వగైరాలన్నీ పేదల భూముల్ని ఆక్రమించడంలో, వృత్తుల్ని నాశనం చెయ్యడంలో నిర్ధాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నాయి. బహుళజాతి కంపెనీల దురాక్రమణ భూమి అస్థిత్వాన్ని, చెట్ల అస్థిత్వాన్ని, గాలి అస్థిత్వాన్ని కూడా కలుషితం చేస్తున్నై. పంచభూతాల పట్ల పెనుభూతాలై చెలరేగుతున్న మార్కెట్లు మానవ సంబంధా లన్నింటినీ కలుషితం చేస్తున్నై. ఈ అంశాల్లోని వ్యాపార పరమైన అమానుషత్వ మంతటికీ 'రోడ్డు' ప్రతీక ద్వారా అప్పలరాజు వ్యక్తీకరిస్తున్నాడు.

**- డా॥ అద్దేపల్లి రామమోహనరావు**




**మరో గోళానికి ...** (దీర్ఘకవిత)

**- ఉప్పల అప్పలరాజు**

**వెల : రూ./- పేజీలు : 44**

**ప్రతులకు : 9908875728**

మనిషి ఎటునడుస్తున్నాడు.. ఏమి ఆశిస్తున్నాడు.. ఏమి సాధిస్తున్నాడు... గుండెలపై గులాబీలున్నావారు, బోసినవ్వులు రువ్విన వారు, చూపుడువేలుతో నిలిచిన శిల్పాలు మానవునికేం నేర్పుతున్నాయి... ఎటు వెళుతున్నాడు.. ఏ ఊరికీ ప్రయాణం ... ఏ ఆదర్శం ప్రమాణం... వీచిన భావజాలమంతా కవిత్వంగా పరిమళించేటట్లు" శ్రమించి విరచించిన సుమ గీతిక ఇది. నా మాట నిజమేనని అంగీకరిస్తారు.. చదివిచూడండి..!

**- చందు సుబ్బారావు**

## సమీక్ష


# సాహిత్యరంగం తీరుతెన్నులపై మీరేమంటారు?

*2012 ప్రవేశించింది. వివిధ రంగాలలో గడిచిపోయిన ఏడాదికి సంబంధించిన సమీక్షా వీక్షణాలు జరుగుతున్నట్టే సాహిత్య సాంస్కృతిక రంగాలలోనూ సింహావలోకనం జరుగుతున్నది. అయితే సృజనశీలమైన సాహిత్య రంగంలో గతావలోకనంతో పాటు భవిష్యత్తులోకి తేరిపార చూడవలసిన అవసరం కూడా వుంది. సాహిత్య జీవులుగా మీరు ఆ విషయంలో ఏమనుకుంటున్నారో తెలుసుకోవడానికి ప్రస్థానం ఈ ప్రశ్నావళిని ప్రచురిస్తున్నాం. మీ సమాధానాలు, మరికొందరు ప్రముఖులు భావాలతో పాటు మా స్పందనను కూడా ఫిబ్రవరి సంచికలో ప్రచురించగలం.*

1. 2011లో మీరు ఏయే నవలలు చదివారు? కథలెన్ని చదివారు? ఏమైనా నచ్చాయా? ఎందుకు? మరీ ఎక్కువగా నచ్చిన వాటి పేర్లు, నచ్చని వాటి పేర్లు?
2. కవిత్వమూ, కావ్యాలు చదివారా? కవిత్వం పట్ల మీ స్పందన ఎలా వుంది?
3. సాహిత్య విమర్శలు గమనించారా? పాలుపంచుకున్నారా? వాటిపై మీ ఆలోచనలు ఎలా వున్నాయి?
4. దినపత్రికల సాహిత్య పేజీలు, ఆదివారం అనుబంధాలు, సాహిత్య పత్రికలు ఏవి ఎక్కువగా అనుసరించారు? ఏవి ఎక్కువగా నచ్చాయి?
5. మొత్తంగా మీ సాహిత్య పఠనం పెరిగిందా? తగ్గిందా? యథాతథమేనా?
6. మీ కుటుంబ సభ్యులు బంధు మిత్రులు సన్నిహితుల విషయమేమిటి?
7. నేడున్న సాహిత్యాభిరుచిపై మీ అంచనా ఏమిటి? చూసిన దాన్ని బట్టి చెప్పండి. (కేవలం మీ అభిప్రాయం కాదు)
8. ఇంగ్లీషులో ఎక్కువగా చదివారా?
9. మీరూ ఏమైనా రాశారా?
10. సాహిత్యేతర పుస్తకాల పఠనం ఏ మేరకు చేయగలిగారు?
11. మీకు తెలిసి వివిధ తరాలు (మీకంటే పెద్దవారు, మీ సమకాలికులు, మీకంటే చిన్నవారు) చదువు పట్ల చూపిస్తున్న ఆసక్తి ఎలా వుంటున్నది?
12. మీరు ఈ ఏడాది ఎన్ని పుస్తకాలు కొన్నారు? అందులో సాహిత్య గ్రంథాలెన్ని?
13. మీరు చదవాలనుకుని చదవలేకపోతున్న దొరకని పుస్తకాలేమైనా వున్నాయా?
14. ఫలానా అంశం ఎవరైనా రాస్తే బాగుంటుందని మీరు అనుకున్న సందర్భాలున్నాయా? ఉంటే ఏమిటి?
15. మీరూ కవులు, రచయితలైతే ఈ ఏడాది మీ రచనానుభవాలు ఎలా వున్నాయి? ఎలాంటి స్పందనలు వచ్చాయి? మీ రచనా ప్రణాళికలు నెరవేరాయా?
16. ఈ కాలంలో సాహిత్య రంగంపై రచయితలుగా మీ అభిప్రాయాలేమిటి?
17. కొత్తగా రచనలు మొదలు పెట్టినవారి అనుభవాలేమిటి?
18. ఇంగ్లీషు తెలుగు గాక ఇతర భాషా సాహిత్యాలతో పరిచయం వున్నవారు చెప్పగలిగిన అంశాలేమిటి? వాటితో పోల్చితే తెలుగు సాహిత్యం పరిస్థితి ఎలా వుంది?
19. సాహిత్య సభలు కార్యక్రమాల తీరుతెన్నులు ఎలా వున్నాయి?
20. స్థానిక సాహిత్య సంఘాల గురించి మీ అనుభవాలేమిటి?
21. మొత్తంపైన తెలుగు సాహిత్యం నేటి పరిస్థితులను సమగ్రంగా సవ్యంగా ప్రతిబింబిస్తున్నదని మీరనుకుంటున్నారా?
22. మీరు చదివే సాహిత్య పత్రికలేమిటి? నచ్చే పత్రికలు లేదా శీర్షికలు ఏమిటి?
23. ప్రస్థానం మీరు ఎప్పటి నుంచి చదువుతున్నారు? ఈ కాలంలో దానిపై మీ అభిప్రాయం ఏమిటి?
24. ప్రస్థానంలో ఇంకా ఏయే మార్పులు ఆశిస్తున్నారు?
25. ప్రస్థానం కోసం లేదా సాహిత్యం కోసం మీరేం చేయగలరు?


**'ప్రస్థానం'కు చందా కట్టండి!**

**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!**



ప్రత్యేక తగ్గింపు!

అయిదేళ్లకు : రు. 500 /-
పదేళ్లకు : రు. 1000/-
సంవత్సర చందా (వ్యక్తులకు) : రు. 120/-
సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-
విడి ప్రతి : రు. 10/-



ప్రస్థానం

ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20

వివరాలకు : 040-27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్ : ssprasthanam_@gmail.com ; www. prasthanam.com

## మల్లెమాల కన్నుమూత


సినీరంగంలో రచయితగా, నిర్మాతగా వెలుగొందిన ఎం.ఎస్.రెడ్డి డిసెంబర్ 11న కన్ను మూశారు. మల్లెమాలగా ప్రసిద్ధులు. 5 వేలకు పైగా పాటలు, పద్యాలు రాశారు. 1924, ఆగస్టు 15 మల్లెమాల (సుందర రామిరెడ్డి) నెల్లూరుజిల్లా వెంకటగిరి తాలూకా లోని 'అలిమిలి' అనే మారుమూల గ్రామంలో జన్మించారు. కౌముది ఆర్ట్స్ పిక్చర్స్ స్థాపించి "కన్నెపిల్ల" (డబ్బింగ్) 1966లో విడుదల చేశారు. కొంటెపిల్ల, కాలచక్రం చిత్రాలు విడుదల చేశారు. భాగ్యచక్రం – శోభన్ బాబుతో చేశారు. 'శ్రీకృష్ణ విజయం, ఊరికి ఉపకారి, కోడెనాగు, ఏకలవ్య, వల్నాటి



సింహం, తలంబ్రాలు, ఆహుతి, అంకుశం, అమ్మోరు' చిత్రాలు తీశారు. బాలలతో 'రామాయణం' తీశారు. 'అంకుశం' చిత్రంలో ముఖ్యమంత్రిగా నటించారు. "ఇది చెరగని ప్రేమకు శ్రీకారం" పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. "భాష్పాంజలి" కవితా సంపుటి, వృషభ పురాణం, నిత్యసత్యాలు, తేనెటీగలు, మంచుముత్యాలు, అక్షర శిల్పాలు, ఎందరో మహానుభావులు, వాడని మల్లెలు వంటి పద్య గద్య రచనలు చేశారు "మహిత వినయశీల మల్లెమాల" పేర ఆంధ్రజ్యోతిలోని పద్యాలు ప్రాచుర్యం పొందాయి.

## అక్షరాస్త్రాల 'మహారథి'

మహారథిగా ప్రసిద్ధుడైన త్రిపురనేని బాల గంగాధర తిలక్ డిసెంబర్ 23 ఉదయం హైదరాబాద్ లో కన్నుమూశారు. సినీ రచయితగా ప్రసిద్ధులైన త్రిపురనేని మహారథికి "అల్లూరి సీతారామరాజు" మంచి పేరు తెచ్చిన చిత్రం. "మహారథి" ముచ్చట్లు పుస్తకం బహు ప్రాచుర్యం పొందింది. 1930 ఏప్రిల్ 30న కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా వసుమర్రు గ్రామంలో ఆయన జన్మించారు. వారి



కుటుంబం నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి వలస వచ్చింది. వ్యవసాయంతో పాటు సాహితీ సేద్యాన్ని మహారథి కొనసాగించారు. ఎన్.టి.ఆర్.తో "బందిపోటు" చిత్రం రచయితగా సినీప్రస్థానం ఆరంభించారు. 'కంచుకోట, రణభేరి, పెత్తందార్లు, దేశోద్ధారకులు, పాడిపంటలు, సింహాసనం, దేవుడు చేసిన మనుషులు, మనుషులు చేసిన దొంగలు' లాంటి దాదాపు 25 చిత్రాలకు ఆయన మాటలు రాశారు.'గంగన్న' శతకం, త్రిలింగ శతకం ఆటవెలుదులతో రాశారు. హైదరాబాద్ ఆల్ ఇండియా రేడియోలో వార్తలు చదివే ఉద్యోగం చేశారు. నిజాం వ్యతిరేక పోరాటంలో క్రియాశీలంగా పాల్గొని మద్దతు ఇచ్చారు. ఆయన ప్రగతిశీల అభ్యుదయ రచయిత.



**ఎల్ఐసి ఉద్యోగుల లలిత కళా సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 15న సుందరయ్య కళా నిలయం, హైదరాబాద్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమం. చిత్రంలో సత్కారం పొందిన జి.ఎస్.మూర్తి దంపతులు, సౌత్ సెంట్రల్ జోన్ జి.ఎం. ఎ.కె. సాహూ, ఎన్. నాగరాజు, వి. సుబ్రహ్మణ్యం, వి. సత్యకుమార్**



**డిసెంబర్ 11న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో 'హృదయ కాంక్ష' కవితల సంపుటిని ఆవిష్కరించిన అద్దేపల్లి రామమోహనరావు. చిత్రంలో విహారి, నండూరి రాజగోపాల్, కవయిత్రి కోపూరి పుష్పాదేవి, కొల్లూరి, కాపూరి సత్యవతి**

### గమనిక

డైరీ కాలమ్‌కి సాహిత్య వార్తలు పంపేవారు క్లుప్తంగా రాసి పంపాలి * సభలో పాల్గొన్న వారందరి పేర్లు రిపోర్టులో రాయకూడదు * ఆలస్యమైన వార్తల్ని పంపించకూడదు * తాజా వార్తలకే ప్రచురణకు అవకాశం ఉంటుంది * మాకు చేరుతున్న కొన్నింటిలో తేదీలు రాయడం లేదు * ఫొటో వెనుక తప్పని సరిగా ఆ కార్యక్రమం జరిగిన తేదీ, ప్రాంతం, జిల్లా పేర్లు రాయాలి.

# మంచి పుస్తకాలతోనే మంచి సమాజం




డిసెంబర్ 15న '26వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్' ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి మాణిక్య వరప్రసాద్. చిత్రంలో విద్యావేత్త చుక్కా రామయ్య, బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్షులు సాదినేని శ్రీనివాస్, కార్యదర్శి హనుమంతరావు, రాజు తదితరులు

మంచి పుస్తకాలతోనే మంచి సమాజం, మంచి ఆలోచనలు, మంచి రాజకీయ వ్యవస్థ ఏర్పడుతుందని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డి. మాణిక్య వరప్రసాదరావు చెప్పారు. ప్రతి ఒక్కరిలోనూ పుస్తక పఠనంపై ఆసక్తి పెరగాలని సూచించారు. 26వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌ను డిసెంబర్ 15న హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ఎంతో అవసరమని చెప్పారు. సమాజంలో అవినీతి అంతం కావాలని అన్నా హజారే ఉద్యమంలో పాల్గొన్నంత మాత్రాన అవినీతి అంతం కాదని చెప్పారు. మంచి ఆలోచనలు గాలిలో నుంచి ఊడిపడవని, మంచి పుస్తకాలు చదవడం వల్ల మేధావులతో చర్చించడం వల్ల వస్తాయని అన్నారు. 'నేను మంచి పుస్తకం చదివాను కాబట్టి మంచి సమాజంలో ఉన్నాను. చదవకపోతే ఎక్కడ ఉండేవాడినో' అని మహాకవి టాల్‌స్టాయ్ అన్నారని మంత్రి గుర్తు చేశారు. టాల్‌స్టాయ్ మాటలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పుస్తక పఠనాన్ని వ్యసనంగా అలవాటు చేసుకోవాలని, దీనిని ఓ ప్రచారంగా తీసుకోవాలని కోరారు. మంచి పుస్తకాలతోనే అవినీతి రహిత సమాజం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి సభ్యులు చుక్కా రామయ్య మాట్లాడుతూ పుస్తకాలు ఎన్నో వస్తున్నాయని, సమాజంలో జ్ఞానం పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పుస్తకాలు చదివించడం ఓ సమస్యగా మారిందన్నారు. ఏ లక్ష్యంతో పుస్తకాలు ప్రచురిస్తున్నారో, ఆ సామాజిక లక్ష్యం నెరవేరడం లేదన్నారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడాది 240 స్టాల్స్ వుంటే, ఈ ఏడాది 255 స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రెండు లక్షల వెరైటీ పుస్తకాలున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కార్యదర్శి ఆర్. హనుమంతరావు, కోశాధికారి ఎస్. రాజు, ఉపాధ్యక్షులు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషను బతికించుకోవాలి

తెలుగు పత్రికల్లో సంస్కృత పదాల హోరు పెరిగిపోయిందని, దీన్ని తగ్గించి తెలుగు భాషను బతికించుకునేందుకు తెలుగు పత్రికలు కృషి చేయాలని వక్తలు సూచించారు. తెలుగు బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో తెలుగు దినపత్రికల భాష ఆధునీకరణ, గ్రంథావిష్కరణ సభ డిసెంబర్ 21న నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు పై విధంగా పేర్కొన్నారు. ఈ సభకు ఆచార్య సి. లక్ష్మన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గ్రంథావిష్కరణ చేసి అనంతరం మాట్లాడుతూ పత్రిక భాషలో సంస్కృత పదాల వాడకం విపరీతంగా పెరిగిపోయిన సమయంలో ఈ పుస్తకం రావడం వలన పాత్రికేయులు రాసే భాషలోని లోపాలు తెలుసుకోవచ్చని అన్నారు. అది తెలుగు భాష పరిరక్షణకు దోహదపడుతోందని, అలాంటి పుస్తకం రాయడానికి పగడాల చంద్రశేఖర్ పూనుకోవడం అభినందనీయమని అన్నారు. అనంతరం ప్రముఖ పాత్రికేయులు, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ జీవనంలో భాష భాగమైందని, ఆ భాషే సజీవమైందని తెలిపారు. పత్రిక భాష ప్రసార భాషగా మారి చాలా కాలమైందని, దీనివల్ల పత్రికలు తరచుగా వాడే సంస్కృత పదాలు కూడా వాడుక భాషగా మారాయని అన్నారు. కాబట్టి అలాంటి పదాలు వాడటాన్ని పత్రికలు క్రమంగా తగ్గించాలని, అదే సమయంలో కొత్తగా అన్య భాష పదాల వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని అన్నారు. పత్రికలకు వార్తలను ప్రచురించడానికి చాలా తక్కువ సమయం ఉంటోందని, దీనివల్ల ఇతర భాష నుంచి తెలుగుకు అనువాదాలు చేసేటప్పుడు ఈ సమస్య తలెత్తుతోందని అన్నారు. పత్రిక భాష లోపాలు తెలియజేయడానికి రచయిత చేసిన కృషి అమోఘమైందని అన్నారు. పత్రికలు వాడే భాషపై రచయిత ప్రామాణికమైన పరిశోధన చేసి ఈ పుస్తకం రాశారని పేర్కొన్నారు. ప్రముఖ పాత్రికేయులు ఎబికె ప్రసాద్ మాట్లాడుతూ భాష లోపాలకు సంబంధించిన వివరణలను ఈ పుస్తకంలో పొందుపరిచారని అన్నారు. ఆంగ్ల భాష పదాలను కొన్ని సందర్భాల్లో పత్రికలు నేరుగా వినియోగిస్తున్నాయని, దీన్ని తర్వాతైనా సరళమైన తెలుగు భాషలోకి అనువదించాలని తెలుగు పత్రికల నిర్వాహకులకు సూచించారు. తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె. చెన్నయ్య మాట్లాడుతూ పాత్రికేయులతో పాటు భాష పరిశోధనలు చేసే వారికి ఈ పుస్తకం ఉపయోగపడుతోందని అన్నారు. కార్యక్రమంలో ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ఆచార్య డి. చంద్రశేఖర రెడ్డి, జి.ఎస్. వరదాచారి, పుస్తక రచయిత పగడాల చంద్రశేఖర్ ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు సాహిత్య ప్రియులు పాల్గొన్నారు.




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలకపల్లి రవి. చిత్రంలో భద్రిరాజు, కృష్ణమూర్తి, వరదాచారి, ఎబికె, చంద్రశేఖర్, చెన్నయ్య తదితరులు

## బుక్‌ఫెయిర్

# ఆకట్టుకొన్న "అక్షరాంజలి" ప్రదర్శనశాల



హైదరాబాద్ బుక్‌ఫెయిర్, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో "అక్షరాంజలి" పేరిట ఏర్పాటు చేసిన ప్రసిద్ధ రచయితల ఫొటో ప్రదర్శనశాల

డిసెంబర్ 15 నుండి 25 దాకా హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో (నెక్లెస్ రోడ్) జరిగిన26వ "హైదరాబాద్ బుక్‌ఫెయిర్"లో "సాహితీ స్రవంతి" సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "అక్షరాంజలి" (స్టాల్) ప్రదర్శనశాల పలువుర్ని ఆకట్టుకుంది. దాదాపు 260కి పైగా స్టాల్స్‌తో భారీగా ఏర్పాటు కాబడిన ఈ పుస్తక ప్రదర్శనలో పుస్తకానికి మాతృకకర్తలైన కవులు, రచయితల ఛాయాచిత్రాలు ఒకేచోట 200కి పైగా ప్రదర్శనగా ఓ స్టాల్ (కవుల జనన – మరణాలు, వారి రచనలు – ప్రొఫైల్స్) ఏర్పాటును పాఠక ప్రజానీకం అభినందించారు. వాటిని పుస్తక రూపంలోకి తేవాలనే ఆకాంక్షను – వారు వ్యక్తం చేశారు. నిత్యం 15 నుండి 20 వేల మంది దాకా ఈ స్టాల్ సందర్శించారు. ప్రముఖుల సూక్తులు, పుస్తకంపై ప్రముఖుల అభిప్రాయాలు, తెలుగు శాసనాలు, పలుకుబడులు, చార్టులు విద్యార్థుల్ని, ఉపాధ్యాయుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. వారు శ్రద్ధగా నోట్స్ రాసుకోవడం – స్ఫూర్తి నింపేలా ఉందని పేర్కొనడం ఆనందదాయకం.



హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌కు వచ్చిన సందర్శకులు

అంతర్జాతీయ ఖ్యాతి గల పండిత కవుల దగ్గర నుండి ఇటీవల కాలం దాకా గల ప్రముఖ కవుల చిత్రాల్ని ఈ ప్రదర్శనశాలలో ఏర్పాటు చేయడం ఓ విశేషం.

ఫ్యూజిక్, జె.బి.షా, గోగోలు, బ్రెహ్ట్, బాల్జాక్, గోర్కీ, కాడ్వెల్, సార్త్రే జాక్ లండన్, టాల్‌స్టాయ్, పాటియార్, లూసన్, రోమ్‌రోలా, నెరుడా, పుష్కిన్, మయకోవ్‌స్కీ, మైఖేల్ షోల్‌కోవ్‌లాంటి అంతర్జాతీయ స్థాయి కవులు... భారతదేశ స్థాయిలో ప్రేమ్‌చంద్, సుబ్రహ్మణ్య భారతి, నారాయణ మీనన్, కె.ఎ. అబ్బాస్, శరత్‌బాబు, ఠాగూర్, ఫైజ్ అహ్మద్ ఫైజ్.. లాంటి కవులు, ఇక మన తెలుగునాట, ప్రసిద్ధులైన, కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ, చలం, శేషేంద్ర, విశ్వనాథ, కనపర్తి వరలక్ష్మమ్మ, తిరుమల రామచంద్ర, పుట్టపర్తి, భీమన్న, తాపీ ధర్మారావు, సీతాదేవి, ఇల్లెందుల సరస్వతి, దాశరథి, సురవరం, కాళోజి, ఆరుద్ర, ఆత్రేయ వంటి వారి ఛాయాచిత్రాలు పలువుర్ని ఆకర్షించాయి. ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. అధికారుల నుండి, ఉపాధ్యాయులు, మహిళలు, విద్యార్థులు, పరిశోధకుల్ని సైతం ఈ స్టాల్ విశేషంగా ఆకర్షించింది.

ఈ ప్రదర్శనశాలను బుక్‌ఫెయిర్ సౌజన్యంతో సాహితీ స్రవంతి నిర్వహించింది. సాహితీ సంస్థ రాష్ట్ర బాధ్యులు వొరప్రసాద్, లక్ష్మయ్య, తంగిరాల చక్రవర్తి ఈ స్టాల్ నిర్వహణ బాధ్యతలు చూశారు. డా॥ ఇనాక్, డా॥ ద్వానాశాస్త్రి, తెలకపల్లి రవి, ఫణికుమార్, చిల్లర భవానీదేవి, శరత్ జ్యోత్స్నారాణి, మల్లేపల్లి లక్ష్మయ్య, కర్రి ఎల్లారెడ్డి, బి.ఎస్. రాములు, బైసా దేవదాస్, వి.శ్రీనివాసరావు (పూర్వ సంపాదకులు – ప్రజాశక్తి), స్ఫూర్తి, ఈశ్వరరెడ్డి, భానుప్రకాష్, దేవి, జి.హనుమంతరావు, సినీ దర్శకుడు రమణ, భాస్కర్, శాంతారావు తదితరులు 'అక్షరాంజలి' సందర్శించిన ప్రముఖుల్లో ఉన్నారు.

– తంగిరాల చక్రవర్తి

## కథా విశ్లేషణ పోటీ

అంతర్జాల కథాకథంబం కథాజగత్. కామ్‌లో 200 కథలు ప్రకటించిన సందర్భంలో తెలుగులో బ్లాగులు నడుపుతున్న వారికి పోటీని నిర్వహిస్తున్నట్లు తురుపుముక్క బ్లాగ్ నిర్వాహకులు, రచయిత కొడిహళ్ళి మురళీమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. కథాజగత్ వెబ్‌సైట్‌లోని కథలపై వచ్చిన మంచి విశ్లేషణలకు రూ.2000/–, రూ.1000/–, రూ.500/– విలువగల మూడు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే అందరికీ ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. జనవరి 31 చివరి తేదీ. మిగిలిన వివరాలకు **http://turupumukka.blogspot.com** చూడవచ్చు.



గురజాడ 150వ జయంతి ఉత్సవసభ, హాజరైన సాహిత్యాభిమానులు, విద్యార్థినీ విద్యార్థులు

# సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఘనంగా గురజాడ 150వ జయంతి ఉత్సవం

అనంతపురం నగరంలోని స్థానిక బాలాజీ విద్యాసంస్థల ప్రాంగణంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గురజాడ 150వ జయంతి జరిగింది. ఇదే సందర్భంలో "అవినీతి వ్యతిరేక కలాలు" అంశంతో కవితా పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమానికి డా॥ అంకె రామలింగయ్య అధ్యక్షత వహించారు. ఆయన ప్రసంగిస్తూ మారుతున్న కాలాన్ని బట్టి ఉపాధ్యాయ శిక్షణతో పాటు సామాజిక విలువలు పెంపొందించు కోవాలని తెలియజేశారు. విశిష్ట అతిథులుగా సింగమనేని నారాయణ హాజరై ఆధునిక మహిళల చరిత్రను గురజాడ తిరిగి రాశాడని, తెలుగు సాహిత్యంలో దేశీయతను, ఆధునికతను ప్రవేశపెట్టిన మొట్టమొదటి వ్యక్తి గురజాడని తెలియజేశారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు కుమారస్వామి ప్రసంగిస్తూ ఆధునికత అంటే మోడ్రన్ డ్రస్ వేసుకోవడం కాదని, ఆధునికత అంటే స్త్రీలను, దళితులను, పేదలను గౌరవించడమని తెలియజేశారు. సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కృష్ణయ్య ప్రసంగిస్తూ గురజాడ చెప్పినట్లు కవిత్వం వ్యవహారిక భాషలో వాస్తవికతను తెలియజేస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని తెలియజేశారు. డి.ఇడి. ప్రిన్సిపాల్ డి. భాష ప్రసంగిస్తూ అవినీతి అంతమొందే వరకు ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని తెలియజేశారు. చివరిగా గౌరవ అతిథి ఎస్.కె.యు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎం. బుద్ధన్న ప్రసంగిస్తూ సామాజిక విలువలు పెంపొందించుటకు విద్యార్థులు భాగస్వాములు కావాలని తెలియజేశారు. ఈ సమావేశంలో బి.ఇడి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కవులు ముకుందాపురం పెద్దన్న, మధురశ్రీ, చలపతి, ప్రజ్ఞ సురేష్, శ్రీవాణి, వెంకటేశ్వర రెడ్డి, ప్రకాశం, జయన్న, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## చందాదారులకు ఓ విన్నపం

* ప్రస్థానం చందాదారుని చిరునామా పైన చందా యొక్క కాలపరిమితి సూచిస్తూ నెల - సంవత్సరం ఇస్తున్నాం. అది గమనించి వెంటనే మీ చందాను పునరుద్ధరించుకోగలరు (రెన్యువల్స్).
* కంప్యూటర్‌లోని రికార్డులో చందా ముగియడంతోనే ఆ చందాదారుని పేరు ఆటోమేటిక్‌గా డిలీట్ అవుతుంది. చందా కాలం ముగిసిందని ముందుగానే వారి చిరునామాకు కార్డు రాస్తున్నాం.
* ఆన్‌లైన్‌లో చందాను రెన్యువల్ చేసుకోవచ్చు. ఖాతా పేరు: ప్రస్థానం, ఖాతా నెం. 52001500585. బ్యాంక్: ఎస్‌బిహెచ్. ఆన్‌లైన్‌లో 5, 10 సంవత్సరాల చందాలు మాత్రమే అంగీకరించబడతాయి.
* సాహితీస్రవంతి కార్యకర్తలు, అభిమానులు చందాలను ఆన్‌లైన్‌లో జమచేసేటప్పుడు కనీసం 5 చందాలను ఒకసారి జమచేయగలరు. ఒకసారి ఆన్‌లైన్‌లో జమచేసినందుకు రూ. 25/-లు కట్ అవుతుంది.
* 5 సం॥ చందా డిస్కౌంట్‌లో రూ. 500/- కట్టడం వల్ల మీకు అన్ని సంచికలు క్రమంగా అందుతాయి. గ్యాప్‌లు రావు. రూ. 100/- ఆదా కూడా అవుతుంది. (5 × 120 = 600).
* ఎం.ఓ. పంపేవారు కూపన్‌కు ఒకవైపున మీ పూర్తి చిరునామా, ఫోన్ నెం. రాయండి. అడ్రస్ మారితే వెంటనే కార్డు రాయండి. ఇ-మెయిల్ కూడా పంపవచ్చు. ssprasthanam@gmail.com



డిసెంబర్ 15న శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాద్‌లో జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహించిన సప్తపదిలో తోడు నీడ కార్యక్రమంలో ముఖ్య అతిథి డా॥ కె.వి. రమణాచారి, సభా ప్రారంభకులు ఆంధ్రప్రభ, ఎడిటర్ పి. విజయబాబుల ద్వారా సత్కారం అందుకున్న దంపతులు జీడిగుంట రామచంద్రమూర్తి (సాహిత్యం) - శ్రీమతి రాజ్యలక్ష్మి, సభాధ్యక్షులు డా॥ ఓలేటి పార్వతీశం, సి. రామకృష్ణ, జివిఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి చిత్రంలో ఉన్నారు

# అంతర్జాతీయ రచయితల సదస్సులో కవితాగానం

మహారాష్ట్రలోని వార్ధాలో గల మహాత్మాగాంధీ అంతర్జాతీయ హిందీ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 26, 27వ తేదీలలో నిర్వహించిన ఇంటర్ కాంటినెంటల్ కల్చరల్ అసోసియేషన్ నిర్వహించిన 7వ అంతర్జాతీయ రచయితల సదస్సులో పాలమూరు జిల్లా కవులు వల్లభాపురం జనార్దన, ఖాజా మొయినుద్దీన్, భీంపల్లి శ్రీకాంత్, కె.ఎ.ఎల్. సత్యవతి, నందిగామ కిశోర్‌లు పాల్గొని వివిధ సామాజికాంశాలపై తెలుగులోనూ, ఆంగ్లంలోనూ కవితాగానం చేశారు. వల్లభాపురం జనార్దన 'వృద్ధాప్యం' పైన, ఖాజా మొయినుద్దీన్ 'సార్వత్రిక సమ్మె'పైన, భీంపల్లి శ్రీకాంత్ 'ఉగ్రవాదం' పైన, కె.ఎ.ఎల్. సత్యవతి 'మహాత్మాగాంధీ' పైన, నందిగామ కిశోర్ 'శ్రమజీవి' పైన కవితలు చదివారు. ఈ రచయితల సదస్సులో మహాత్మాగాంధీ అంతర్జాతీయ హిందీ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ఎ. అరవిందక్షన్, విభూతి నారాయణరాయ్, రాజీవ్ రంజన్‌రాయ్, దేవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో కవితాగానం చేసిన జిల్లా కవులకు ప్రొఫెసర్ విభూతి నారాయణరాయ్ ప్రశంసా పత్రాలను అందజేశారు.



ఇంటర్ కాంటినెంటల్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 26, 27వ తేదీలలో మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన 7వ అంతర్జాతీయ రచయితల సదస్సులో పాల్గొన్న వల్లభాపురం జనార్దన, భీంపల్లి శ్రీకాంత్, ఖాజా మొయినుద్దీన్, సత్యవతి, నందిగామ కిశోర్ కుమార్

# విశాలాంధ్ర బుక్‌హౌస్

## విశాఖపట్నం బ్రాంచి వారి 12వ పుస్తక ప్రదర్శన

విశాఖపట్నం టర్నర్ పత్రంలో అక్టోబర్ 31వ తేదీ నుంచి నవంబర్ 27వ తేదీ వరకు విశాలాంధ్ర బుక్‌హౌస్ విశాఖపట్నం బ్రాంచి వారి 12వ పుస్తక ప్రదర్శన జరిగింది.

ఈ సందర్భంగా బుక్‌హౌస్ మేనేజర్ రాజు ఆధ్వర్యంలో ప్రతిరోజు సాయంత్రం సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు విశాఖ సాహితీ మిత్రుల నిర్వహణలో 'కథ సాయంత్రం, కార్యక్రమం జరిగింది.



డిసెంబర్ 11న రవీంద్ర భారతి సమావేశ మందిరంలో "ఆది బుట్టిమాని" రచించిన "ఇది నిజం... దీనికి మీరే సాక్ష్యం" అనే పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న గిరి, రామ్మోహన్, బాలవర్ధిరాజు, కన్నోజు లక్ష్మీకాంతం, ఎల్. సంజీవరెడ్డి, శైలజామిత్ర, రఘువీర ప్రతాప్, గోపిని కరుణాకర్, సాహిత్య ప్రకాష్, మౌనశ్రీ మల్లిక్ తదితరులు




నవంబర్ 13న జరిగిన 12వ విశాలాంధ్ర పుస్తక మహోత్సవం సందర్భంగా జరిగిన సభలో పాల్గొన్న శ్రీమతి టి. కృష్ణాబాయి (అధ్యక్షులు), శ్రీమతి జగద్ధాత్రి, డా॥ అయ్యగారి సీతారత్నం (కథ చదువుతున్నవారు)

సమావేశం అనంతరం రచయిత్రులు డా॥ అయ్యగారి సీతారత్నం, శ్రీమతులు పెబ్బెలి హైమావతి, కమలరాంజీ, డా॥ రాగతి రమాదేవి వారి కథలను వినిపించారు. తరువాత ఆ కథలపై విస్తృతమైన చర్చ జరిగింది. ఆ చర్చలో శ్రీయుతులు పి.వి. రమణ, రామతీర్థ, ఉప్పల అప్పలరాజు, శ్రీమతి జగద్ధాత్రి మొదలగువారు పాల్గొన్నారు.

సభకు శ్రీమతి తుమ్మల కృష్ణాబాయి అధ్యక్షత వహించగా, శ్రీమతి జగద్ధాత్రి, డా॥ అయ్యగారి సీతారత్నం వేదికనలంకరించి సభను నిర్వహించారు. సభకు హాజరు కాలేకపోయిన కొందరు రచయిత్రులు వారి అశక్తతను తెలియజేశారు.

# తెలుగు నాటకం - నాటకరంగ జాతీయ సదస్సు

యోగి వేమన విశ్వవిద్యాలయం – లలిత కళల విభాగం సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, లలిత కళా నికేతన్ సంయుక్త నిర్వహణలో వై.ఎస్.ఆర్. జిల్లా ముఖ్య పట్టణం కడపలో వై.ఎస్.ఆర్. ఆడిటోరియంలో డిసెంబర్ 11వ తేదీ "తెలుగు నాటకం – నాటక రంగం" పైన రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది.

ప్రారంభ సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా, నందమూరి తారక రామారావు అవార్డు గ్రహీత చాట్ల శ్రీరాములు, ప్రఖ్యాత చలనచిత్ర నటులు రాళ్ళపల్లి, రంగస్థల, టి.వి., చలనచిత్ర నటులు వైజాగ్ ప్రసాద్‌లు గౌరవ అతిథులుగా, ప్రత్యేక అతిథిగా ప్రముఖ సంఘసేవకుడు సి.ఆర్.ఐ. సుబ్బారెడ్డి పాల్గొన్నారు. సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఇన్‌ఛార్జి ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షులుగా వ్యవహరించగా, ఆంధ్రోపన్యాసకులు, నాటక రచయిత, ప్రయోక్త కందిమళ్ళ సాంబశివరావు కీలకోపన్యాసం చేశారు. ఈ ప్రారంభ సమావేశంలో సదస్సు నిర్వాహకులు డా॥ మూల మల్లికార్జునరెడ్డి అవగాహన పత్రం చదివి వినిపించారు.

ఈ సమావేశంలో వక్తలందరూ నాటకం సమాజానికి దశ దిశ నేర్పుతుందని, ఆధునిక సమాజానికి నాటకం దిక్సూచియని అభిప్రాయపడ్డారు. అందువల్ల తెలుగు నాటక రంగ స్థితిని పరిరక్షించేందుకు తగిన మార్గాలు కనుగొంటేనే ఫలితముంటుందని పలువురు వక్తలు పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో లలిత కళల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ మూల మల్లికార్జునరెడ్డి గానం చేయగా, హార్మోనిస్ట్ సుధాకర్ సంగీత దర్శకత్వంలో తయారైన 'వేమన పద్య సౌరభం' సిడిని ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు.

మధ్యాహ్నం 2 గంటలకు జరిగిన మొదటి సదస్సులో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి 'పద్య నాటకం – ప్రేక్షక స్పందన' ఆకెళ్ళ 'ఆధునిక పోటీ నాటకం – సమస్యలు', డా॥ జి. బాల శ్రీనివాసమూర్తి 'తెలుగు నాటక రంగం మీద సురభి నాటక ప్రభావం', ఎం.వి.ఎస్.హరినాథరావు 'టెలివిజన్‌లో రాజకీయ వ్యంగ్యం', డా॥ అనంత పద్మనాభరావు 'తెలుగులో రేడియో నాటికలు' అనే అంశాలపై పత్ర సమర్పణ చేశారు. ఈ సదస్సుకు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి అధ్యక్షులుగా వ్యవహరించారు.

ఈ జాతీయ సదస్సు సందర్భాన్ని పురస్కరించుకొని అదే రోజు సాయంత్రం 6 గంటలకు యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం రంగస్థల విద్యార్థులు ప్రదర్శించిన భువన విజయం, రుక్మిణీ కల్యాణం నాటకాలు ప్రేక్షక మన్ననలను పొందాయి.



**డిసెంబర్ 11, 12 తేదీలలో జరిగిన "తెలుగు నాటకం – నాటక రంగం" జాతీయ సదస్సులో పాల్గొన్నవారు (ఎడమవైపు నుంచి) ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, కందిమల్లి సాంబశివరావు, రాళ్లపల్లి, డా॥ మూల మల్లికార్జునరెడ్డి, అర్జుల విజయలక్ష్మి, ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి, చాట్ల శ్రీరాములు, వైజాగ్ ప్రసాద్, సి.ఆర్.ఐ. సుబ్బారెడ్డి**

డిసెంబర్ 12, 2011న రెండో రోజు సదస్సు యోగి వేమన విశ్వవిద్యాలయంలోని సర్ సి.వి. రామన్ సైన్స్ బ్లాక్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. ఈ రెండవ సదస్సులో కాకరాల 'తెలుగు నాటక రంగం మీద ప్రజానాట్యమండలి ప్రభావం', శ్రీనివాస దీక్షిత్, చందు భాస్కరరావు సంయుక్తంగా 'రంగస్థల మాధ్యమం – పద్య గద్య నాటకాలలో పాత్రల ప్రదర్శన, శాస్త్రీయ దృక్పథం కోసం అభినయ విద్యాసాధన' అనే అంశాల పైన పత్ర సమర్పణ చేశారు. ఈ సదస్సుకు డా॥ జి.ఎస్. ప్రసాదరెడ్డి అధ్యక్షులుగా ఉన్నారు.


ఆఖరు సదస్సులో డా॥ జి.ఎస్.ఎన్. మూర్తి 'తెలుగు నాటకం, నాటకరంగం మీద విమర్శలు, పరిశోధనలు', డా॥ పెద్ది రామారావు 'దళిత బహుజనపద్య నాటకం', ఎన్. తారక రామారావు 'స్త్రీ పాత్రలు లేని సాంఘిక నాటకం – ప్రయోజనం', ఆచార్య జి.ఎస్. మోహన్ 'తెలుగు కన్నడ నాటకం – తులనాత్మక పరిశీలన', కె. శాంతారావు 'ఉద్యమాలకు ఊపిరి పోసిన తెలుగు నాటకం', డా॥ కె. నాగేశ్వరాచారి 'తెలుగులో విప్లవ నాటకం' అనే అంశాలపై పత్రాలు సమర్పించారు.

సాయంత్రం జరిగిన సమాపనోత్సవంలో యోగి వేమన విశ్వ విద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. వాసంతి ముఖ్య అతిథిగా, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. చాట్ల శ్రీరాములు అధ్యక్షులుగా వ్యవహరించారు.

రెండు రోజుల జాతీయ సదస్సులో పత్ర సమర్పకులు చెప్పిన ప్రధానాంశాలను డా॥ మూల మల్లిఖార్జునరెడ్డి సమీక్షించారు. డా॥ నిభానుపూడి సుబ్బరాజు వందన సమర్పణతో రెండు రోజుల జాతీయ సదస్సు దిగ్విజయంగా ముగిసింది.

## డైరీ

# వైతాళికుడు గురజాడ అప్పారావు





గురజాడ వర్ధంతి సభలో ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహం ప్రసంగిస్తున్న దృశ్యం


సమాజ సేవకుడు గురజాడ అప్పారావు అని ప్రముఖ సాహితీవేత్త యు.ఎ. నర్సింహం కొనియాడారు. విజయనగరం, ఎంఆర్ బిఇడి కాలేజీలో నవంబర్ 30న సాహితీ స్రవంతి ఆధ్వర్యాన గురజాడ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహం మాట్లాడుతూ ఆనందగజపతిరాజు వద్ద పత్రికలను చదివి ఆయన విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారని అన్నారు. తద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించే గ్రంథాలను రచించారని అన్నారు. భాష, సాహిత్యం భవిష్యత్తు అంతరించిపోతున్న తరుణంలో వీటికి గురజాడ ప్రాణం పోశారని కొనియాడారు. మరో వక్త సువర్ణలక్ష్మి మాట్లాడుతూ సమస్యల పట్ల అవగాహన చేసుకొనేవారు అసలైన రచయితగా వెలుగులోకి వస్తారని, అటువంటి వ్యక్తి గురజాడ అని అన్నారు. సమాజం కోసం పాటుపడే వ్యక్తిని ఎవరూ మరువలేరన్నారు. గురజాడ మృతి చెందినా మనలో ఆయన సజీవంగా నిలవడానికి కారణం రచనలేనన్నారు. మరో వక్త జె.రామకృష్ణ మాట్లాడుతూ గురజాడ రాసిన కథలు, వ్యాసాలు ప్రజాదరణ పొందాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్, కళాశాల ప్రిన్సిపాల్ సుభాషిణి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత డి. శ్రీనివాసరావు, విద్యార్థులు గురజాడ గేయాలను ఆలపించారు.


### 'మెరుగు' సభలో గరిమెళ్ళ వర్ధంతి

విజయనగరంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ప్రతీనెలా నిర్వహించే 'మెరుగు' సభలో గరిమెళ్ళ సత్యనారాయణ వర్ధంతి నిర్వహించారు. డిసెంబర్ 19న గురజాడ స్వగృహంలో జరిగిన ఈ సమావేశంలో సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ చీకటి దివాకర్ మాట్లాడుతూ ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గరిమెళ్ళ స్వాతంత్ర్య పోరాట కృషిని కొనియాడారు. గరిమెళ్ళ వంటి స్ఫూర్తిప్రధాతల పట్ల స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించారని అన్నారు. దానికి గరిమెళ్ళ జీవిత చివరి దశ నిలువెత్తు నిదర్శనంగా కనబడుతుందని అన్నారు. చాగంటి తులసి మాట్లాడుతూ తెలుగు జాతీయ మహాకవి గరిమెళ్ళ యావజ్జీవితం స్వాతంత్ర్య సమరానికి ధారపోశారని అన్నారు. తన గేయాలతో ప్రజలను ఆనాడు చైతన్యవంతం చేశారని అన్నారు. సుదీర్ఘకాలం జైలుజీవితం అనుభవించారని, కటిక దారిద్ర్యంతో 1952లో మద్రాసులో దిక్కులేని స్థితిలో చనిపోయారని అన్నారు. యం. విజయ్‌భాస్కర్, చివుకుల శ్రీలక్ష్మి, బి. విజయేశ్వరరావు, హృషీకేశం, కృష్ణారావు, పి. శ్రీరామమూర్తి తదితరులు గరిమెళ్ళ జీవితంలోని పలు అంశాలను స్పృశించారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో మొయిద శ్రీనివాస్, జి. విజయలక్ష్మి, చెళ్ళపిళ్ళ శ్యామల, రావాడ శ్యామల, ఇనుగంటి జానకి, బులుసు సరోజినీ దేవి, నాయుడు రమేష్, రెడ్డి శంకర్రావు, రెడ్డి రామకృష్ణ, బాలసుధాకర్‌మౌళి తదితరులు తమ కవితలను చదివారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఛిద్రమౌతున్న బతుకుల దీనస్థితిని తమ కవితల్లో అద్దం పట్టారు. చంద్రిక, సింహాచలం, నిర్మల, రమణమ్మ, వాసుదేవరావులు పాడిన పాటలు అందరినీ అలరించాయి.

**- సి.హెచ్. చంద్రికారాణి**







గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 10న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన సాహిత్య కార్యక్రమం

గుంటూరు జిల్లా రచయితల సంఘం సాహిత్య పురస్కారాన్ని విహారికి అందిస్తున్న పాపినేని శివశంకర్, ఎస్.ఎం. సుభాని, పెనుగొండ లక్ష్మీనారాయణ, సందూరి రాజగోపాల్, వి. నాగరాజ్యలక్ష్మి

కవికోకిల చిన్న లక్ష్మీ సుబ్బన్న స్మారక కవితా పురస్కారాన్ని శశిశ్రీకి అందిస్తున్న డా॥ సిహెచ్. కళావతి, పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, కోసూరి రవికుమార్, సయ్యద్ జానీ భాషా, ఎస్.ఎం. సుభాని

గుంటూరు జిల్లా రచయితల సంఘం సాహిత్య పురస్కారాన్ని కాట్రగడ్డ దయానంద్‌కు అందిస్తున్న చంద్రశేఖర్, ఎస్.ఎం. సుభాని, పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, వి. నాగరాజ్యలక్ష్మి తదితరులు



జగిత్యాల పట్టణంలోని కౌసల్య తెలుగు పండిట్ శిక్షణ కళాశాలలో
డిసెంబర్ **3**న కాళోజి నారాయణరావు
స్మారక పురస్కార ప్రదానోత్సవంలో కొండపల్లి నీహారిణి, గన్ను
కృష్ణమూర్తి, ప్రొఫెసర్ ఎం.వి. నర్సింహారావు, డా॥ జైశెట్టి రమణయ్య,
కార్యదర్శి మురళీధరస్వామి, ఉస్మానియా యూనివర్శిటీ
తెలుగు ప్రొఫెసర్, డా॥ మసవ చెన్నప్ప, ఆడువాల సుజాత చేతుల
మీదుగా 'పురస్కారం' స్వీకరిస్తున్న మంత్రి లక్ష్మీనారాయణ.



డిసెంబర్ **1**న గుంటూరులో అరసం ఆధ్వర్యాన కథా నాటక రచయిత
వల్లూరు శివప్రసాద్ రచించిన "ఏకాగ్రత" పిల్లల కథా సంపుటి ఆవిష్కరించిన
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ బి.ఈశ్వరరెడ్డి, వేదికపై రచయిత,
బాలసాహితీవేత్తలు దాసరి వెంకట రమణ, రావెల సాంబశివరావు



*యోగి వేమన విశ్వవిద్యాలయం – లలిత కళల విభాగం సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, లలిత కళా నికేతన్ సంయుక్త నిర్వహణలో కడపలో వై.ఎస్.ఆర్. ఆడిటోరియంలో డిసెంబర్ **11, 12** తేదీలలో "తెలుగు నాటకం – నాటక రంగం" రెండు రోజుల జాతీయ సదస్సు సందర్భంగా ప్రదర్శించిన భువన విజయం నాటకం*




నిజామాబాద్ జిల్లా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో
నవంబర్ **19**న జరిగిన మల్లవరపు విజయ
'అంకురం' మినీ కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం.
చిత్రంలో ఎ. సూర్యప్రకాశ్, ఆరెట్టి నారాయణ, శ్రీమతి మోరెయా
కిరణ్, శ్రీమతి త్రివేణి, పడాల రామారావు, ఎల్ది సుదర్శన్, సిర్ప
లింగయ్య, మల్లవరపు చిన్నయ్య, శహీద్‌మియా, విజయలక్ష్మి




నవంబర్ **25**న అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో గుంటూరుజిల్లా
రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కవితాగోష్ఠిలో ప్రముఖ
కవి అద్దేపల్లి రామమోహనరావును సత్కరిస్తున్న సంఘ ఉపాధ్యక్షులు
డా॥ వి. నాగరాజ్యలక్ష్మి, డా॥ సిహెచ్. కళావతి, ప్రధాన కార్యదర్శి
కోసూరి రవికుమార్, అధికార ప్రతినిధి ఎస్.ఎం. సుభాని



శ్రీమతి పసుమర్తి లలిత రచించిన 'అక్షర ప్రమిదలు' నానీల సంపుటిని
హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో డా॥ సి. నారాయణరెడ్డి
ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో కృతిభర్త లయన్ పసుమర్తి
నరశింగరావు, 'అభినందన' భవాని, సుప్రీంకోర్టు కార్యాచరణ కమిటీ
సభ్యులు కె.జె. రావు, కవయిత్రి పసుమర్తి లలిత, సభాధ్యక్షులు ఆచార్య
ఎన్. గోపి, శ్రీమతి ఝాన్సీ కె.వి. కుమారి

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**







# ప్రగతి బాటలో పయనం...
# ప్రతి ఒక్కరికీ ప్రయోజనం

అందరి ఆకాంక్షలను నెరవేరుస్తూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. అసలైన సంక్షేమ పాలనకు అర్థం చెప్తూ రైతులు, బడుగులు, మహిళల జీవన స్థితిగతులను మార్చే వినూత్న పథకాలతో, యువతరాన్ని నిరాశ, నిస్పృహల చీకటి నుండి వెలుగుబాట నడిపించే స్ఫూర్తితో, ముఖ్యమంత్రి **శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి** నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రగతి బాటలో పయనిస్తోంది.

**ఉజ్వల భవితకు హామీనిస్తూ... సర్వజన సంక్షేమంలో ప్రత్యేకతను చాటుతూ... ప్రజా సేవలో వినూత్న పథకాలు**

## రాజీవ్ యువ కిరణాలు
అవధులు లేని అవకాశాలు

### 'రాజీవ్ యువకిరణాలు' పథకం లక్ష్యాలు:

- వచ్చే మూడేళ్లలో 15 లక్షల మంది యువతకు ఉపాధి కల్పన
- వివిధ ప్రభుత్వ శాఖలలో 1 లక్ష 16 వేల ఉద్యోగాల భర్తీ
- డిసెంబరు నెలలో ఒకేరోజు 1 లక్ష ఉద్యోగాల నియామకం
- ఉపాధికి అవకాశం ఉన్న ప్రైవేటు రంగాలతో భాగస్వామ్యం
- ప్రభుత్వరంగ, ప్రైవేటు సంస్థల సమన్వయంతో అమలు
- పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉన్నత, సాంకేతిక, వృత్తివిద్యా కోర్సుల్లో సరికొత్త సిలబస్






## ఇందిర జలప్రభ

### ఇందిర జలప్రభ విశిష్టతలు:

- వచ్చే మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఎకరాల భూమికి సాగునీటి సౌకర్యం
- 3.30 లక్షల ఎస్సీ, 2.37 లక్షల ఎస్టీ కుటుంబాలకు లబ్ధి
- దేశంలోనే తొలిసారిగా రూ.1838 కోట్లతో ఎస్సీ, ఎస్టీలకు చెందిన మెట్టభూములకు సాగునీటి వసతుల కల్పన
- 22 జిల్లాలలోని 211అసెంబ్లీ నియోజక వర్గాలలో అమలు
- మొత్తం 5.81 లక్షల కుటుంబాలను దారిద్ర్యరేఖ ఎగువకు తీసుకువచ్చే బృహత్తర పథకం.



శ్రీమతి డి.కె. అరుణ
రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ మరియు చలనచిత్ర, టీవీ & నాటకరంగ అభివృద్ధి సంస్థ శాఖామాత్యులు

## రూ. 3000 కోట్లతో రైతు, మహిళా సంక్షేమ ప్రత్యేక కార్యక్రమాలు - 1.20 కోట్ల కుటుంబాలకు లబ్ధి

### రైతుల కోసం...

- రూ. 765 కోట్లతో 2010 ఖరీఫ్ పంటల బీమా పరిహారం 7.48 లక్షల మంది రైతులకు లబ్ధి
- వడ్డీ మాఫీ క్రింద రూ. 352 కోట్ల పంపిణీ గత ఖరీఫ్‌లో పంట నష్టపోయిన 680 మండలాల్లోని 20 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- పావలావడ్డీ క్రింద రైతులకు రూ. 73 కోట్లు పంపిణీ 9.6 లక్షల మంది రైతులకు లబ్ధి

### మహిళల కోసం...

- పావలావడ్డీ క్రింద మహిళా సంఘాలకు రూ.470 కోట్ల పంపిణీ
- రూ.274 కోట్లతో 'స్త్రీ శక్తి' భవనాల నిర్మాణం. ప్రతి మండలంలోనూ రూ. 25 లక్షలతో 'స్త్రీ శక్తి' భవన్
- రూ. 1000 కోట్లతో 'స్త్రీ నిధి' బ్యాంకుల ఏర్పాటు

SAHITYA PRASATHANAM RNI N0.APTEL/2004/18396 Postal Regd. No.H/SD/415/10-12




**If Un delivered please return to :** Prasthanam, C/o M.H.Bhavan, Plot No: 21/1, Azamabad
Near RTC Kalyanamandapam, Hyderabad - 500 020 (A.P), Ph: 040-27660013, Cell: 9490099059